మరవరాని మన చరిత్ర
రూ॥40/-
పేజీలు:40

నవచేతన పబ్లిషింగ్ హౌస్
గిలప్రసాద్ భవన్, బండ్లగూడ (నాగోల్),
హైదరాబాద్-68. ఫోన్: 040-29884453/54
E-mail: navachethanaph@gmail.com
నవచేతన బుక్ హౌస్
బ్యాంక్ స్ట్రీట్(అబిడ్స్),హిమాయత్‌నగర్,
కొండాపూర్, బండ్లగూడ(నాగోల్)- హైదరాబాద్
హన్మకొండ.

www.prajapaksham.in

ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

PRAJAPAKSHAM ★

సంపుటి 27, సంచిక: 80 | సోమవారం | 02-09-2024 | హైదరాబాద్ | Published from: Hyderabad, Khammam, Karimnagar, Mahabubnagar | పేజీలు: 12 | ఖమ్మం : 12+8 | కరీంనగర్ : 12+8 | మహబూబ్‌నగర్ : 12 | వెల రూ. 5.00

వర్షాలు, వరద పరిస్థితులపై సిఎం రేవంత్‌రెడ్డికి కేంద్ర హోంమంత్రి అమిత్ షా ఫోన్

ఎఇల నుండి సిఇల దాకా క్షేత్రస్థాయిలోనే ఉండాలి

లోపలి పేజీల్లో

ఆకాశానికి చిల్లు..

రాష్ట్రవ్యాప్తంగా కుండపోత

ఉధృతంగా ప్రవహిస్తున్న నదులు, వాగులు

జనజీవనం అస్తవ్యస్తం

ఖమ్మంను ముంచెత్తిన మున్నేరు

వర్షాలకు 9 మంది మృతి

ప్రజాపక్షం న్యూస్‌నెట్‌వర్క్

ఆకాశానికి చిల్లుపడింది. గత రెండు రోజుల నుంచి రాష్ట్ర వ్యాప్తంగా భారీ వర్షాలు కురుస్తున్నాయి. ఎడతెరిపి లేకుండా వర్షాలు కురుస్తుండడంతో ఎక్కడికక్కడ వాగులు, వంకలు పొంగి పొర్లడంతో జనజీవనం అస్తవ్యస్తం అయింది. భారీ వర్షాలు, వరదల కారణంగా ఆదివారం మధ్యాహ్నం ఒంటి గంట వరకు రాష్ట్రంలో 9 మంది మృతి చెందారు. వరంగల్‌లో ఐదుగురు మృతి చెందగా, సూర్యాపేట జిల్లాలో ఇద్దరు, ఖమ్మం జిల్లాలో ఇద్దరు మృతి చెందారు. భారీ వర్షాలకు మున్నేరు వాగు ఉప్పొంగి ప్రవహిస్తోంది. దీంతో ఖమ్మంలోని లోతట్టు ప్రాంతాలన్నీ జలమయమయ్యాయి. పలు అపార్ట్‌మెంట్లలోని సెల్లార్లు వరద నీటితో నిండాయి. రహదారులన్నీ చెరువులను తలపిస్తున్నాయి. భారీగా ట్రాఫిక్ స్తంభించడంతో వాహనదారులు తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారు. ఎపి, తెలంగాణ మధ్య రాకపోకలు నిలిచిపోయాయి. భారీ వర్షాల నేపథ్యంలో సోమవారం రాష్ట్ర వ్యాప్తంగా విద్యాసంస్థలకు ప్రభుత్వం సెలవు ప్రకటించింది.

ఖమ్మంను ముంచెత్తిన మున్నేరు

ఉమ్మడి ఖమ్మంజిల్లా మునుపెన్నడు లేని రీతిలో జల దిగ్బంధంలో చిక్కుకుని విలవిలలాడుతుంది. జిల్లాలోని నదులు, ఉప నదులు,వాగులు, వంకలు పోటెత్తి ప్రవాహిస్తున్నాయి. పలు చోట్ల రహదారుల పైనుంచి ప్రవహించడంతో ఎక్కడికక్కడే రాకపోకలు నిలిచిపోయాయి. మధ్యతరహా ప్రాజెక్టులతో పాటు చెరువులు, కుంటలు అలుగులు పోస్తుండడంతో పల్లెలు, పట్టణాలు అనే తేడా లేకుండా పల్లపు ప్రాంతాలన్నీ జలమయమయ్యాయి. కూసుమంచి మండలంలోని నాయకన్ గూడెంలో పాలేరు వాగులో దంపతులు వరదనీటిలో కొట్టుకుపోయి చనిపోయారు. నాలుగు లక్షల జనాభా కలిగిన ఖమ్మం నగరం వర్షానికి విలవిలలాడింది. గడిచిన 25 ఏళ్ల కాలంలో ఏనాడూ ఎప్పుడూ చవి చూడని వరదను ప్రజలు చవి చూశారు. కేవలం మున్నేరు పరివాహక ప్రాంతంలోని ప్రజలు మాత్రమే ఎప్పుడూ ముంపు బారి నపడేవారు. కానీ ఇప్పుడు గాంధీచౌక్‌తో పాటు కవిరాజ్‌నగర్, చైతన్యనగర్ ప్రాంతాలు జల దిగ్బంధంలో చిక్కుకున్నాయి. కొన్ని ప్రాంతాల్లో మొదటి అంతస్తు వరకు నీరు రావడంతో ప్రజలు తీవ్ర భయభ్రాంతులకు గురయ్యారు. మున్నేరు ఎన్నడులేని రీతిలో ప్రవహించడంతో ఖమ్మం నగరానికి కిలో మీటర్ మేర మున్నేటి వరద వచ్చింది. తిరుమలాయపాలెం మండలంలో ఆకేరు నది ఉగ్ర రూపం దాల్చింది. గడిచిన 15 ఏళ్ల కాలంలో ఎన్నడు కురవని రీతిలో ఆరు గంటల్లో దాదాపు 20 సెంటీ మీటర్ల వర్షం కురవడంతో మధిర జల దిగ్బంధంలో చిక్కుకుని విలవిలలాడుతోంది. పక్కనే ఉన్న వైరా నది ఎగపోతకు మధిర మున్సిపాలిటీలోని పలు ప్రాంతాలు జలమయమయ్యాయి. మధిర నియోజకవర్గంలోని మధిర, ఎర్రుపాలెం, బోనకల్, చింతకాని మండలాల్లో శనివారం రాత్రి కురిసిన వర్షానికి పల్లె ల మధ్య రాకపోకలు తెగిపోయాయి. నాగులవంచ, పందిళ్లపల్లి వద్ద వాగుల వరద ఉధృతికి ఖమ్మం బోనకల్ మధ్య రాకపోకలు నిలిచిపోయాయి. వైరా

తరువాయి 2లో



రెడ్ అలెర్ట్

రాష్ట్రంలో కుండపోత వర్షాలు

33 జిల్లాలకు హెచ్చరికలు జారీ చేసిన వాతావరణ శాఖ

వాయుగుండం ప్రభావంతో రాష్ట్రవ్యాప్తంగా విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. పలుచోట్ల భారీ నుంచి అతిభారీ వర్షాలు పడుతున్నాయి. వర్షాలకు వాగులువంకలు పొంగుతున్నాయి. ఎక్కడ చూసినా కనుచూపుమేరంతా వర్షంనీరే కనిపిస్తున్నది. ఈ క్రమంలోనే హైదరాబాద్ వాతావరణ కేంద్రం అధికారులు కీలక ప్రకటన చేశారు. వర్షాలు మరో ఐదురోజుల పాటు కొనసాగుతాయని హెచ్చరించారు. ఆదివారం ఆదిలాబాద్, నిజామాబాద్, రాజన్న సిరిసిల్ల, యాదాద్రి భువనగిరి, వికారాబాద్, సంగారెడ్డి, కామారెడ్డి, మహబూబ్ నగర్ జిల్లాల్లో అక్కడక్కడ అతి భారీ

తరువాయి 2లో

అత్యవసరమైతేనే బయటికి రండి

అధికారులు సెలవులు పెట్టొద్దు

ప్రజలకు సిఎం విజ్ఞప్తి

రాష్ట్రంలో ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాలపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అత్యవసరంగా సమీక్షించారు. ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, సీనియర్ మంత్రులు ఉత్తమ్ కుమార్‌రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు, దామోదర రాజనర్సింహ, జూపల్లి కృష్ణారావు తదితరులతో ముఖ్యమంత్రి ఫోన్‌లో మాట్లాడి రాష్ట్రంలో పరిస్థితిని సమీక్షించి వారిని అప్రమత్తం చేశారు. సిఎస్, డిజిపి, మున్సిపల్, విద్యుత్, పంచాయతీరాజ్, హైడ్రా, ఇరిగేషన్ అధికారులు 24 గంటలు అప్రమత్తంగా ఉండాలని టెలికాన్ఫరెన్స్‌లో సిఎం రేవంత్‌రెడ్డి

తరువాయి 2లో

నేడు పలుచోట్ల

విద్యాసంస్థలకు సెలవు

వాయుగుండం ప్రభావంతో రాష్ట్రంలో ఎడతెరిపి లేకుండా వర్షం కురుస్తున్న నేపథ్యంలో ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. నేడు పలు చోట్ల ప్రభుత్వ, ప్రైవేటు విద్యాసంస్థలకు ప్రభుత్వం సెలవు ప్రకటించింది. అలాగే అన్ని ప్రభుత్వ విభాగాలకు సెలవులు రద్దు చేస్తూ ఆదేశాలు జారీచేసింది. అధికారులు అప్రమత్తంగా ఉంటూ ప్రజలకు అందుబాటులో ఉండాలని స్పష్టం చేసింది. అయితే రంగారెడ్డి హైదరాబాద్‌తో పాటు చుట్టుపక్కల జిల్లాల్లో సోమవారం విద్యాసంస్థలకు సెలవు ఉండొచ్చని, మిగతా చోట్ల సెలవు ప్రకటించుకునే అవకాశాన్ని

తరువాయి 2లో

వరద నీటిని వృథా చేయొద్దు

భవిష్యత్తు అవసరాలకు వినియోగించుకోవాలి

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశాలు

ప్రజాపక్షం / హైదరాబాద్

భారీ వర్షాలతో వచ్చిన వరద నీటిని వృథా చేయకుండా భవిష్యత్తు అవసరాలకు వినియోగించుకోవాలని ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి, ఇరిగేషన్ శాఖ మంత్రి ఎన్.ఉత్తమ్‌కుమార్ రెడ్డి ఇరిగేషన్ అధికారులను ఆదేశించారు. వివిధ ప్రాజెక్టుల పరిధిలోని రిజర్వాయర్లు, చెరువులు కుంటల్లో నీటిని నిల్వ చేయాలని సూచించారు. ఎగువన కురిసిన వర్షాలతో పాటు కడెం నుంచి వస్తున్న వరదతో పెద్దపల్లి జిల్లాలోని శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టు నిండిందని, ఎల్లంపల్లి గేట్లు ఎత్తి నీటిని గోదావరిలోకి వదులుతున్నారని తెలిపారు. మరోవైపు ఎల్లంపల్లికి వచ్చిన వరద నీటిని వీలైనంత మేరకు లిఫ్ట్ చేయాలని, రోజుకు ఒక టిఎంసికి తగ్గకుండా విడుదల చేయాలని అధికారులను వారు ఆదేశించారు. నంది, గాయత్రి పంప్ హౌస్‌ల ద్వారా లిఫ్ట్ చేసి రిజర్వాయర్లు నింపాలని ముఖ్యమంత్రి సూచించారు. మిడ్ మానేరు, లోయర్ మానేరు డ్యామ్‌లతో పాటు రంగనాయక్ సాగర్, మల్లన్నసాగర్ వరకు జలాశయాల్లోకి ఏకధాటిగా నీటిని లిఫ్ట్ చేయాలని ఇరిగేషన్ అధికారులను సిఎం ఆదేశించారు. ఇదిలా ఉండగా, ఇరిగేషన్ అధికారుల సమాచారం ప్రకారం ఎల్లంపల్లి ప్రాజెక్టు సామర్థ్యం 20 టిఎంసిలు కాగా ప్రస్తుతం18.45 టిఎంసిల నీటి నిల్వ ఉంది. కడెం ప్రాజెక్టు నుంచి ప్రవాహం ఉధృతంగా వస్తుండటంతో నంది, గాయత్రి పంప్ హౌస్‌ల ద్వారా మిడ్ మానేరుకు నీటిని తరలిస్తున్నారు. మిడ్ మానేరు ప్రాజెక్టు సామర్థ్యం 27 టిఎంసిలు కాగా ప్రస్తుతం 15 టిఎంసిలు ఉంది. అక్కడి నుంచి 14 వేల క్యూసెక్కులకు పైగా లోయర్ మానేరు డ్యామ్‌కు మరో 6400 క్యూసెక్కులు అన్నపూర్ణ రిజర్వాయర్ ద్వారా రంగనాయక్ సాగర్‌కు తరలిస్తున్నారు. అటు రంగ నాయకసాగర్ నుంచి నీటిని పంపింగ్ చేసి

తరువాయి 2లో

ఆందోళన వద్దు

అన్ని విధాలా ఆదుకుంటాం

వచ్చే 24 గంటలు మరింత అప్రమత్తం

మంత్రులు భట్టి, పొంగులేటి ఆదేశం

జిల్లా కలెక్టర్లు, ఎస్‌పిలతో వీడియో కాన్ఫరెన్స్

ప్రజాపక్షం/హైదరాబాద్

రాష్ట్రంలో భారీ వర్షాల నేపథ్యంలో వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో జిల్లా కలెక్టర్లు, పోలీస్ అధికారులు మరింత అప్రమత్తంగా ఉండాలని, ఏ విధమైన ప్రాణ, ఆస్తి నష్టం కాకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక శాఖ మంత్రి మల్లు భట్టివిక్రమార్క, రెవెన్యూ , సమాచార, పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. ఎటువంటి పరిస్థితులనైనా ఎదుర్కోనేందుకు సిద్ధంగా ఉండాలన్నారు. ప్రజలు ఎటువంటి భయాందోళన చెందాల్సిన అవసరం లేదని, ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటుందని భరోసానిచ్చారు. రాష్ట్రంలో కురుస్తున్న భారీ వర్షాలు, వరదల జిల్లా కలెక్టర్లు, పోలీస్ కమిషనర్లు, ఎస్.పిలతో ఆదివారం ఖమ్మం కలెక్టరేట్ కార్యాలయం నుంచి ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క, రాష్ట్ర సచివాలయం నుండి మంత్రి పొంగులేటి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి, డిజి పిజితేందర్ లతో కలసి ఆదివారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. మున్సిపల్, వైద్య ఆరోగ్య, నీటి పారుదల, రెవిన్యూ, డిజాస్టర్ మేనేజ్‌మెంట్ , జిహెచ్‌ఎంసీ, జలమండలి, ట్రాన్స్‌కో తదితర శాఖల అధికారులు సమావేశంలో హాజరయ్యారు. ఉప ముఖ్యమంత్రి భట్టి మాట్లాడుతూ సోమవారం కూడా రాష్ట్రంలో భారీ వర్షాలు ఉన్నట్లు

తరువాయి 2లో

బిసి కులగణన సమస్యపై తక్షణమే అఖిలపక్షం

సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు డిమాండ్

ప్రజాపక్షం / హైదరాబాద్

తెలంగాణ రాష్ట్రంలో బిసి కులగణన సమస్యపై అఖిలపక్ష సమావేశం నిర్వహించి, ఈ అంశంపై చర్చించి బిసిల కులగణన చేపట్టాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎంఎల్‌ఎ కూనంనేని సాంబశివరావు రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. బిసి కులగణన చేయాలని డిమాండ్ చేస్తూ గాంధీ ఆసుపత్రిలో బత్తుల సిద్ధేశ్వర్ నిరాహారదీక్ష చేస్తున్నారు. కూనంనేని సాంబశివరావు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, మాజీ ఎంపి వి.హనుమంతరావు, రాజ్యసభ సభ్యులు ఆర్.కృష్ణయ్య, సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఎన్.బాలమల్లేష్, దళిత హక్కుల పోరాట సమితి (డిహెచ్‌పిఎస్)రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.అనికుమార్ తదితరులు ఆదివారం ఉదయం గాంధీ ఆసుపత్రికి వెళ్ళి సిద్ధేశ్వర్‌ను పరామర్శించారు. సిద్ధేశ్వర్ ఆరోగ్య పరిస్థితి గురించి వారు వైద్యులను అడిగి తెలుసుకున్నారు. నిరాహారదీక్షను విరమించుకోవాలని సిద్ధేశ్వర్‌ను వారు కోరారు. ఈ సందర్భంగా కూనంనేని సాంబశివరావు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ నేత, లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ సైతం దేశ వ్యాపితంగా కులగణన జరపాలని డిమాండ్ చేస్తున్నారని, తెలంగాణ రాష్ట్రంలో సైతం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క తెలంగాణ అసెంబ్లీలో కులగణన చేపడతామని ప్రకటించారని గుర్తు చేశారు. ఆ దిశగా కాంగ్రెస్ ప్రభుత్వం అడుగులు వేస్తుందని అన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం చొరవ తీసుకుని అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేసి, అందరితో చర్చించి కులగణన చేపట్టి, బిసిల సమస్యను పరిష్కరించాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు. నిరాహార దీక్ష చేస్తున్న బత్తుల సిద్ధేశ్వర్, జక్కని సంజయ్‌కుమార్, వరంగల్ ఎంజిఎంలో నిరాహార దీక్ష చేస్తున్న కుమార్ దీక్ష విరమించుకుని, డిమాండ్ల సాధన కోసం అందరం కలిసి ఉద్యమం చేపట్టి కులగణన సాధించుకుందామని కూనంనేని సాంబశివరావు అన్నారు.

ఇద్దరు పిల్లలతో సహా

భార్యా భర్తలు ఆత్మహత్య

ప్రజాపక్షం/ నిజాంపేట్

ఇద్దరు పిల్లలతో సహా భార్యా భర్తలు ఆత్మహత్య చేసుకున్న ఘటన మేడ్చల్ జిల్లా జీడిమెట్ల పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. గాజులరామారంలో చోటుచేసుకున్న ఈ ఘటన స్థానికంగా విషాధాన్ని నింపింది. జీడిమెట్ల సిఐ మల్లేష్ తెలిపిన వివరాల ప్రకారం.. మంచిర్యాలకు చెందిన వెంకటేశ్ (40), వర్షిణి (33)లు

తరువాయి 12లో

వయనాడ్ విలయానికి

రూ.2వేల కోట్లు పరిహారం

కేంద్ర ప్రభుత్వానికి కేరళ సిఎం విజయన్ విజ్ఞప్తి

జాతీయ విధ్వంసంగా గుర్తిస్తేనే భారీ సహాయం



తిరువనంతపురం : వయనాడ్‌లో ఇటీవల కొండచరియలు విరిగిపడి జరిగిన అసాధారణ ప్రకృతి విధ్వంసానికి కేంద్ర ప్రభుత్వం రూ.2వేల కోట్లు పరిహారం ఇవ్వాలని కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్ డిమాండ్ చేశారు. దీనిని జాతీయ స్థాయి ప్రకృతి విలయంగా గుర్తించినప్పుడే బాధిత కుటుంబీకులకు, విగతజీవులకు భారీగా పరిహారం లభిస్తుందన్నారు. కేంద్ర ప్రభుత్వం నుండి ఆశించిన రీతిలో ఒక మంచి ప్యాకేజీ బాధితుల సమస్యల పరిష్కారం కోసం లభించగలదని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. ఆదివారంనాడు ఆయన తిరువనంతపురంలో మీడియాతో మాట్లాడుతూ, ఈ ప్రకృతి వైపరీత్యంపై కేంద్ర ప్రభుత్వం నియమించిన గాడ్గిల్, కస్తూరిరంగన్ నివేదికలు అంత ఆచరణాత్మకంగా ఉండబోవని కూడా ఆయన నిరాశ వ్యక్తం చేశారు. భౌగోళికంగా ఎంతో సున్నితమైన పశ్చిమ కనుమల ప్రాంతంలో జరిగిన ఈ విధ్వంసంపై మాధవ్ గాడ్గిల్, కస్తూరి రంగన్

తరువాయి 12లో

ఆగని అత్యాచారాలు

పశ్చిమబెంగాల్, ఉత్తరప్రదేశ్‌లోని హాస్పిటళ్లు, స్కూల్‌లో దారుణాలు

కోల్‌కతా (పశ్చిమబెంగాల్) : ఆర్‌జి కర్ మెడికల్ కాలేజి, హాస్పిటల్‌లో ట్రైనీ డాక్టర్‌పై హత్యాచారం ఘటనపై నిరసన జ్వాలలు ఇంకా చల్లారనేలేదు. ఈ దుర్ఘటనను నిరసిస్తూ దేశవ్యాప్తంగా ఆందోళనలు నానాటికీ విస్తృతం అవుతున్న నేపథ్యంలో పశ్చిమబెంగాల్ రాష్ట్రంలో లైంగికవేధింపుల కేసులు నమోదు అవుతూనే ఉన్నాయి. ఒకచోట డ్యూటీలో ఉన్న నర్సుపై పేషెంట్ లైంగికవేధింపులకు పాల్పడ్డ కేసు , సిటి స్కాన్ కోసం వచ్చిన 13ఏళ్ల బాలికపై విధులు నిర్వర్తిస్తున్న కాంట్రాక్ట్ లేబరేటరీ టెక్నీషియన్ అనుచిత ప్రవర్తన కేసు మరోచోట నమోదు అయ్యాయి. దీంతోపాటు ఉత్తర ప్రదేశ్ రాష్ట్రం ఫరూఖాబాద్‌లోనూ ఒక మైనర్ బాలికపై అత్యాచార ఘటన ఆలస్యంగా వెలుగుచూసింది. బీర్‌భమ్ జిల్లాలోని ప్రభుత్వ ఆరోగ్య కేంద్రంలో శనివారం రాత్రి వేళ చోటోచక్ గ్రామానికి చెందిన అబ్బాసుద్దీన్‌కు జ్వరం రావడంతో హాస్పిటల్‌కు తీసుకువచ్చారు. వైద్యులు అతడిని పరీక్షించి సైలైన్ పెట్టేందుకు హాస్పిటల్ వార్డుకు తరలించారు. డ్యూటీలో ఉన్న నర్సు అబ్బాసుద్దీన్‌కు సెలైన్ ఎక్కించే సమయంలో ఆమెపట్ల అనుచితంగా ప్రవర్తించాడు. దీంతో ఆమె వెంటనే హాస్పిటల్ వైద్యులకు ఈ విషయం తెలియజేయగా వారు అతడిని మందలించారు. అయినప్పటికీ ఆ తర్వాత కూడా రోగి అబ్బాసుద్దీన్ ఆమెతో అనుచిత ప్రవర్తన ఆపలేదు. దీంతో వైద్యులు పోలీసులకు ఫిర్యాదు చేయగా హుటాహుటిన ఆసుపత్రికి చేరుకుని అతడిని అరెస్ట్ చేశారు. ఈ విషయం తెలుసుకున్నస్థానికులు

తరువాయి 12లో

కేసుల వాయిదా సంస్కృతికి

ఇక స్వస్తి చెప్పాలి

రాష్ట్రపతి ద్రౌపతి ముర్ము

న్యూఢిల్లీ : న్యాయస్థానాల్లో చురుగ్గా, సత్వరం తీర్పులు వెలువరించేందుకు వీలుగా వాయిదాల సంస్కృతిలో మార్పులు తీసుకురావాల్సిన అవసరం ఉందని, అందుకు తగిన కృషి జరగాలని రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము అన్నారు. న్యూఢిల్లీలోని భారత్ మంటపంలో రెండు రోజులపాటు జరిగిన డిస్ట్రిక్ట్ జ్యుడీషియరీ జాతీయ సదస్సు ముగింపు సభలో ఆదివారంనాడు రాష్ట్రపతి ప్రసంగించారు. ''దేశంలోని వివిధ న్యాయస్థానాల్లో అపరిష్కృతంగా వున్న

తరువాయి 12లో

ఆ హెలికాప్టర్ కూలిపోయింది : రష్యా

మాస్కో : రష్యా తూర్పు ప్రాంతం కామ్‌చత్కాలో అదృశ్యమైన ఎంఐ–8 హెలీకాప్టర్ కూలిపోయినట్లు రష్యా అత్యవసర పరిస్థితుల మంత్రిత్వ శాఖ వెల్లడించింది. రక్షణ బలగాలు హెలికాప్టర్ శకలాలను గుర్తించినట్లు వెల్లడించింది. చివరి సారిగా హెలికాప్టర్ నుంచి మాట్లాడిన ప్రాంతంలో సుమారు 900 మీటర్ల ఎత్తున శకలాలు లభించినట్లు తెలిపింది. కూలిపోయిన ప్రాంతంలో 17 మంది భౌతికకాయాలు లభించినటుల అధికారులు తెలిపారు. మిగతా వారి ఆచూకీ గురించి అన్వేషణ కొనసాగుతుందని, 9 మంది ఈపనిలో నిమగ్నమైనట్లు తెఇపింది. విట్యాజ్–ఎయిరోకు చెందిన హెలికాప్టర్ వచ్కాఝెట్స్ పర్వత శ్రేణల మీదుగా నిఖోలయేవ్కాకు ప్రయాణిస్తుంది. అందులో 22 మంది ఉండగా, వారిలో 19 మంది ప్రయాణికులు, ముగ్గురు సిబ్బంది ఉన్నారు. పైలెట్ పొరపాటు కారణంగా హెలికాప్టర్ కూలిపోయినట్లు రష్యా అత్యవసర సేవల శాఖ భావిస్తోంది.

పోలాండ్‌లో రెండవ ప్రపంచ యుద్ధం

85వ వార్షికోత్సవం

వార్సా: పోలాండ్ రాజధాని వార్సాలో రెండవ ప్రపంచ యుద్ధం 85వ వార్షికోత్సవాన్ని ఆదివారం నిర్వహించారు. పోలాండ్‌ను ఆక్రమించిన జర్మనీ నాజీ సేనాలు, అక్కడ బాంబుల మోత మోగించడంతో ద్వితీయ ప్రపంచ యుద్ధం ప్రారంభమైంది. జర్మనీ సేనలు 1939 సెప్టెంబర్ 1న మొదట దాడి చేసిన వైలన్ పట్టణంలో పోలాండ్ అధ్యక్షుడు ఆండ్రేజ్ డుడా నివాళి అర్పించారు. బాల్టిక్ సముద్రంలోని వెస్టర్‌ప్లేట్ ద్వీపకల్పంలోని మిలిటరీ ఔట్ పోస్ట్‌పై జర్మనీ యుద్ధ నౌక బాంబులు కుర్పించిన ప్రాంతంలో నిర్మించిన యుద్ధ స్మృతి వద్ద ప్రధానమంత్రి డొనాల్డ్ టస్క్, రక్షణ మంత్రి వాడీస్లా కొసినియాక్ కామిస్ట్‌లు పుష్పగుచ్ఛాలు ఉంచారు. ఆ ప్రాంతంలో జర్మనీ సైన్యానికి లొంగిపోకుండా ఏడు రోజుల పాటు పోలాండ్ సైన్యం వీరోచిత పోరాటం చేసింది. ఐదేళ్ళ జర్మనీ దురాక్రమణలో 60 లక్షల పోలాండ్ పౌరులు, అందులో 30 లక్షల యూధులు ప్రాణాలు కోల్పోయారు. మౌలిక వసతులు, పారిశ్రామిక, వ్యవసాయ రంగాలలో కూడా ఆ దేశం తీవ్రంగా నష్టపోయింది. పోలాండ్‌లో గత మితవాద ప్రభుత్వం నష్టపరిహారంగా జర్మనీ 1.3 ట్రిలియన్ డాలర్‌లు ఇవ్వాలని డిమాండ్ చేసింది. కాగా, ప్రస్తుత ప్రభుత్వం ఎంతో కొంత పరిహారం ఇచ్చి, రెండు పొరుగుదేశాల సంబంధాలు మెరుగుపరచాలని కోరుతోంది.

గాజాలో పాలస్తీనా వైద్య బృందాలు, ఐక్యరాజ్య సమితి ఏజెన్సీల ఆధ్వర్యంలో ఆదివారం నుంచి భారీ పోలియో వ్యాక్సినేషన్ కార్యక్రమం ప్రారంభమైంది. పాతికేళ్ళలో తొలిసారిగా ఆగస్టులో గాజాలో తొలి పోలియో కేసు నమోదైంది.

హసీనాను రప్పించేందుకు అవసరమైతే న్యాయ ప్రక్రియః బంగ్లా

ఢాకా: మాజీ ప్రధాని షేక్ హసీనాను తిరిగి రప్పించేందుకు అవసరమైతే న్యాయ ప్రక్రియను తమ ప్రభుత్వం చేపడుతుందని బంగ్లాదేశ్ విదేశీ వ్యవహారాల సలహాదారుడు తౌహీద్ హొస్సేన్ అన్నారు. ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ ప్రస్తుతం భారతదేశంలో ఉన్న హసీనా పరిస్థితి గురించి మీడియాకు ప్రశ్నించగా, ఈ ప్రశ్నను భారతీయ అధికారులను అడగాలని అన్నారు. ఇటీవల భారతదేశంతో రైల్వే రంగం సహా, పలు రంగాలలో చేసుకున్న అవగాహన ఒప్పంద పత్రాల గురించి ప్రశ్నించగా. ఎంఒయులకు చట్టబద్ధ కట్టుబాటు లేదని, దేశ ప్రయోజనాలను పరిరక్షణలో భాగంగా వాటిని సమీక్షించే అవకాశం ఎల్లప్పుడూ ఉంటుందన్నారు. ఐక్యరాజ్య సమితి జనరల్ అసెంబ్లీ సమావేశాలకు హాజరయ్యేందుకు బంగ్లాదేశ్ ప్రధాన సలహాదారులు మహమ్మద్ యూనస్ ఈ నెలాఖరులో న్యూయార్క్ వెళ్తారని హొస్సేన్ తెలిపారు.

సమ్మెకు దిగిన బంగ్లాదేశ్ డాక్టర్‌లు

శనివారం ఢాకా మెడికల్ కాలేజీలో వైద్యులపై దాడిని నిరసిస్తూ బంగ్లాదేశ్ ప్రభుత్వ, ప్రైవేటు వైద్యులు ఆదివారం దేశవ్యాప్తంగా మెరుపు సమ్మెకు దిగాయి. తక్షణమే ఘటనకు కారణమైన దోషులను పట్టుకోవాలని వారు డిమాండ్ చేశారు. ఢాకా మెడికల్ కాలేజీలో గాయాలతో చేరిన విద్యార్థి మరణించడంతో అతని సహచరులు వైద్యులపై దాడికి దిగారు. దీంతో ఆగ్రహం వ్యక్తం చేసిన వైద్యులు నిరవధిక సమ్మె ప్రకటించి, తమ డిమాండ్‌లు నెరవేరే దాకా విధుల్లో చేరబోమని ప్రకటించారు.

రేపటిలోగా ఆయుధాలు తిరిగివ్వండి

బంగ్లాదేశ్‌లో ఇటీవల జరిగిన ఘటనల్లో లూటీ చేసిన పోలీసు ఆయుధాలు, బుల్లెట్‌లను సెప్టెంబర్ 3లోగా తిరిగి ఇవ్వాలని బంగ్లాదేశ్ పోలీసులు ఆదివారం అల్టిమేటం జారీ చేశారు. ఇప్పటి వరకు 3,872 ఆయుధాలను, 2.86 లక్షల రౌండ్‌ల బుల్లెట్‌లను, 22,201 టియర్ గ్యాస్ షెల్స్‌ను, 2,139 గ్రెనేడ్‌లను స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. ఇదిలా ఉండగా, ప్రభుత్వోద్యోగులంతా తమ ఆస్తుల వివరాలను సమర్పించాలని ప్రభుత్వం కోరింది.

ఉక్రేన్ భీకర డ్రోన్‌ల దాడిని తిప్పికొట్టిన రష్యా

మాస్కో సహా 15 ప్రాంతాలు లక్ష్యంగా వచ్చిన 158 డ్రోన్‌ల కూల్చివేత

0మాస్కో : డ్రోన్‌లతో ఉక్రేన్ జరిపిన భారీ దాడిని రష్యా తిప్పికొట్టింది. రష్యాలోని 15 ప్రాంతాలను లక్ష్యంగా చేసుకొని ఉక్రేన్ డ్రోన్‌లతో శనివారం అర్ధరాత్రి మెరుపు దాడికి పూనుకుంది. అయితే, అందులో సుమారు 158 ఉక్రేన్ డ్రోన్‌లను రష్యా వాయు రక్షక వ్యవస్థ కుప్పకూల్చింది. అందులో రెండు డ్రోన్‌లు మాస్కో, తొమ్మిది పరిసర ప్రాంతాలలో దూసుకువచ్చేందుకు ప్రయత్నించాయని రష్యా రక్షణ మంత్రిత్వ శాఖ వెల్లడించింది. ఉక్రేన్ బలగాలు వెళ్ళిన రష్యా భూభాగంలోని కుర్స్క్ ప్రాంతంలో 46 డ్రోన్‌లు, బ్రైయాన్స్క్ ప్రాంతంలో 34, వోరోనెజ్ ప్రాంతంలో 28, బెల్గొరొడ్ ప్రాంతంలో 14 డ్రోన్‌లను కూల్చేశారు. ఇవన్నీ కూడా ఉక్రేన్ సరిహద్దు ప్రాంతాలు. రష్యా లోపల రాజధాని మాస్కోకు వాయువ్యంలో, ఈశాన్యంలో ఇవానోవో ప్రాంతాలో ఒక్కొక్క డ్రోన్‌ను కూల్చారు. మొత్తమ్మీద మాస్కోవైపు దూసుకువచ్చిన 9 డ్రోన్‌లను వాయు రక్షక వ్యవస్థలు కూల్చేశాయని మాస్కో మేయర్ సెర్గీ సొబ్యానిన్ వెల్లడించారు. రామెన్‌స్కీ మున్సిపల్ డిస్ట్రిక్ట్‌లో రెండు మానవ రహిత శతృ వాహనాలను కూల్చేడం ద్వారా, మొత్తం తొమ్మిది కూల్చేసినట్లు తెలిపారు. ఇదిలా ఉండగా ఉక్రేన్‌లోని డొనెట్స్క్ ప్రాంతంలోని పివ్నిచ్నే, వైయింకా పట్టణాలపై పట్టు సాధించినట్లు రష్యా రక్షణ మంత్రిత్వ శాఖ వెల్లడించింది. ఉక్రేన్‌లోని తూర్పు ప్రాంతంలో మరింత లోపలికి దూసుకుపోయి మొత్తంగా ఆక్రమించే లక్ష్యంగా రష్యా ముందుకు సాగుతోంది. ఉక్రేన్ రక్షణ రంగానికి కీలకమైన ప్రాంతం పోక్రోవ్స్క్‌ను రష్యా బలగాలు సమీపిస్తున్నాయి. ఉక్రేన్‌పై ప్రయోగించిన 11 రష్యన్ డ్రోన్‌లను కూల్చేశామని ఉక్రేన్ వాయు సేన ప్రకటించింది. రాత్రంతా జరిగిన పేలుళ్ళలో సుమీ ప్రాంతంలో ఒకరు మరణించగా, నలుగురు గాయపడినట్లు స్థానిక అధికారులు తెలిపారు. కాగా, తమ ప్రాంతంలో ఐదుగురు మరణించినట్లు ఖార్కీవ్ గవర్నర్ ఒలే సైనీహుబోవ్ వెల్లడించారు. కాగా కపోట్నియాలోని మాస్కో ఆయిల్ రిఫైనరీలో డ్రోన్‌దాడిలో అంటుకున్న మంటను ఆపేందుకు అగ్నిమాపక దళాలు అక్కడికి చేరుకున్నాయి. డ్రోన్‌ను కప్పకూల్చినప్పుడు శకలాలకు ఉన్న మంటలతో రిఫైరీలో నిప్పు అంటుకుందని భావిస్తున్నారు.

తొమ్మిది మంది బందీల మృతదేహాలను స్వాధీనం చేసుకున్న ఇజ్రాయెల్

ఇజ్రాయిల్ దాడుల్లోనే మరణించారని హమాస్ ప్రకటన

దక్షిణ గాజాలోని ఒక సొరంగంలో ఆరుగురు బందీల మృతదేహాలను స్వాధీనం చేసుకున్నట్లు ఇజ్రాయిల్ మిలిటరీ ప్రకటించింది. అందులో ఒకరు అమెరికా ద్వంద్వ పౌరసత్వం కలిగిన పౌరుడు ఉన్నట్లు తెలిపింది. సుమారు 250 మంది ఇజ్రాయెల్, విదేశీ పౌరులను హమాస్ బందీలుగా ఉంచుకుంది. అందులో ఆరుగురు భౌతికకాయాలను నేలమాలిగలోని సొరంగంలో లభించినట్లు ఇజ్రాయిల్ మిలిటరీ ప్రకటించింది. వారిని అల్మోగ్ లొబనోవ్, కార్మెల్ గాట్, ఒరి డానినో, ఇడెన్ యెరుషల్మి, హెర్ష్ గొల్డ్‌బెర్గ్–పొలిన్‌లనుగా గుర్తించారు. హమాస్‌పై ప్రతీకారం తీర్చుకుంటామని, వారిని వేటాడుతామని ఇజ్రాయిల్ ప్రధాన మంత్రి బెంజామిన్ నెతాన్యుహూ ప్రకటించారు. బందీలను చంపేసిన వారికి గాజా ఒప్పందంపై సంతకం కావాలని భావించడం లేదన్నారు. కాగా, మరణించిన ఆరుగురు బందీలు ఇజ్రాయిల్ వాయు సేన దాడుల్లోనే చనిపోయారని హమాస్ సీనియర్ అధికారి ఇజ్జత్ అల్ రిషెక్ తెలిపారు. బందీల కుటుంబ వేదిక నెతన్యాహూ చర్యలను, సమస్యను నియంత్రించే తీరు పట్ల ఆగ్రహం వ్యక్తం చేస్తోంది. తక్షణమే ఇజ్రాయిల్ కాల్పుల విరమణ జరపాలని, మిగతా బందీలను విడిపించాలని డిమాండ్ చేస్తూ ఆదివారం బందీల కుటుంబీకుల వేదిక భారీ నిరసన నిర్వహించింది. ప్రతి ఒక్క పౌరుడి హృదయం ద్రవించిందని, ప్రజలు భారీగా నిరసనల్లో పాల్గొనాలని ప్రతిపక్ష నేత యేయిర్ లాపిడ్ వీడియో సందేశంలో పేర్కొన్నారు.

సాయం అభినందనీయం: గవర్నర్

ప్రజాపక్షం/హైదరాబాద్: వరద బాధితులకు అవసరమైన సామాగ్రిని సమీకరించి, అందజేయడంలో ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ శరవేగంగా స్పందించడం అభినందనీయమని గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ అన్నారు. ఆపదలో ఉన్న వారికి సకాలంలో సహాయాన్ని అందిస్తుందన్నారు.త్రిపుర రాష్ట్రంలో ఇటీవల కురిసిన భారీ వర్షాలు, వరదల నేపథ్యంలో బాధితులను ఆదుకోవాలని భారతీయ రెడ్ క్రాస్ సొసైటీ రాష్ట్ర శాఖను గవర్నర్ కోరారు. దీనిపై రెడ్ క్రాస్ సొసైటీ సానుకూలంగా స్పందించింది. ఇందులో భాగంగా వెయ్యి కుటుంబాలకు అవసరమైన సహాయ సామగ్రిని వెంటనే సేకరించారు. పిల్లలకు ఆహారం, దుస్తులు, దోమతెరలు, గొడుగులు, సబ్బులు, అత్యవసర మందులు, తదితర సహాయ, సహాయక సామగ్రిని ట్రక్కు ద్వారా త్రిపురకు పంపుతున్నారు. ఈ ట్రక్కును హైదరాబాద్‌లోని రాజ్‌భవన్‌లో గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ ఆదివారం జెండా ఊపి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో గవర్నర్ ముఖ్యకార్యదర్శి బుర్రావెంకటేశం, గవర్నర్ జాయింట్ సెక్రటరీ జె. భవానీశంకర్,రెడ్ క్రాస్ రాష్ట్ర ఛైర్మన్ అజయ్ మిశ్రా పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.

బయటికి రండి

(మొదటి పేజీ తరువాయి)

ఆదేశించారు. జిల్లాల్లో కలెక్టర్లు, ఎస్‌పిలు, రెవెన్యూ, ఇరిగేషన్, మున్సిపల్ అధికారులు 24 గంటలు క్షేత్రస్థాయిలో పర్యటించాలని సిఎం సూచించారు. అధికారులు సెలవులు పెట్టొద్దని, సెలవులు పెట్టిన వారు వెంటనే రద్దు చేసుకుని వెంటనే పనుల్లో నిమగ్నం కావాలని సిఎం ఆదేశించారు. అత్యవసర విభాగాల అధికారులు క్షేత్రస్థాయిలో ఉంటూ ఎప్పటికప్పుడు సమాచారాన్ని సిఎంఓ కార్యాలయానికి పంపాలని ఆదేశించారు. వరద ప్రభావం ఏరియాల్లో తక్షణ సహాయం కోసం చర్యలు చేపట్టాలసి సిఎం ఆదేశించారు. అత్యవసర పనుకుంటే తప్పా ప్రజలు బయటికి రావొద్దని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. లోతట్టు ప్రాంత ప్రజలు అప్రమత్తంగా అంటూ ఏ అవసరం ఉన్నా అధికారులకు ఫోన్‌లో సమాచారం ఇవ్వాలని సూచించారు. మంత్రులు, ఎంపిలు, ఎంఎల్‌ఎలు, ఎంఎల్‌ఎసిలు స్థానికంగా ఉంటూ సహాయక కార్యక్రమాలు చేపట్టాలని సిఎం ఆదేశించారు. వర్షాల నేపథ్యంలో 24 గంటలు అప్రమత్తంగా ఉంటూ సహాయ కార్యక్రమాల్లో భాగం కావాలని కాంగ్రెస్ కార్యకర్తలను ముఖ్యమంత్రి ఆదేశించారు.

సెలవు (మొదటి పేజీ తరువాయి)

ఆయా జిల్లాల కలెక్టర్లకే ఇస్తున్నామని రెవెన్యూశాఖామంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి చెప్పారు. సోమవారం సాయంత్రం వరకు భారీ వర్షాలు ఉన్నాయని తెలిపారు. వర్ష ప్రభావిత ప్రాంతాల్లో అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షించి సహాయక చర్యలు చేపడుతున్నారని ఆయన తెలిపారు. పలుచోట్ల రహదారులపై భారీగా వరద ప్రవహిస్తోందని, వరద ఉన్నచోట ఎవరూ రోడ్డు దాటేందుకు ప్రయత్నించవద్దని హెచ్చరించారు.అత్యవసరం అయితే తప్పఎవరూ బయటకి రావొద్దన్నారు.యువత సెల్ఫీ కోసం నీరు ఉన్న ప్రాంతాల్లోకి వెళ్లి ప్రాణాల మీదకి తెచ్చుకోవద్దని సూచించారు.

వృథా చేయొద్దు (మొదటి పేజీ తరువాయి)

మల్లన్న సాగర్, కొండపోచమ్మ సాగర్ నింపాలని, అక్కడి నుంచి సింగూర్ ప్రాజెక్ట్, నిజాంసాగర్ ప్రాజెక్ట్ వరకు నీటిని తరలించాలని సిఎం ఆదేశించారు. ప్రస్తుతం అన్నపూర్ణ, రంగ నాయక సాగర్ నుంచి 7.52 టిఎంసిలు, మల్లన్నసాగర్‌లో 50 టిఎంసిల సామర్థ్యం ఉండగా, ప్రస్తుతం 11.43 టిఎంసిల నిల్వ ఉంది.

కొండ పోచమ్మ సాగర్‌లో 15 టిఎంసిల సామర్థ్యం ఉండగా 7.91 టిఎంసి నీళ్లున్నాయి. కేంద్ర జల సంఘం మార్గదర్శకాల ప్రకారం మల్లన్నసాగర్, కొండపోచమ్మ సాగర్ రిజర్వాయర్లలో సాధ్యమైనంత వరకు నీటిని నిల్వ చేయాలని చెప్పారు. మల్లన్నసాగర్ లో గరిష్టంగా 18 నుంచి 20 టిఎంసిలు, కొండపోచమ్మ సాగర్‌లో 10 టిఎంసిలు నిల్వ చేయాలని ఆదేశించారు. ఈ సందర్భంగా అన్ని ముందు జాగ్రత్తలు పాటించాలని అధికారులను సిఎం అప్రమత్తం చేశారు.

ఆకాశానికి చిల్లు..

(మొదటి పేజీ తరువాయి)

మున్సిపాలిటీలోని పలు పల్లపు ప్రాంతాలు జలమయమయ్యాయి. పెనుబల్లి, కల్లూరు, కూసుమంచి, ఖమ్మం రూరల్ మండలాల్లో భారీ వర్షానికి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. పలు చోట్ల వరదల్లో చిక్కుకున్న బాధితులను కాపాడేందుకు అధికార యంత్రాంగం అన్ని ప్రయత్నాలు చేస్తుంది.మధిర మండలంలో పశువులు కాసేందుకు వెళ్లిన ఓ మహిళ మృతి చెందగా మర్రిపేడ మండలం వద్ద వాగులో కారు కొట్టుకుపోవడంతో తండ్రి,కూతురు మరణించారు. కారేపల్లి మండలంకు చెందిన యువ శాస్త్రవేత్త నునావత్ అనూష కొట్టుకుపోయి విగతజీవిగా మారారు. ఆమె తండ్రి మోతీలాల్ ఆచూకీ తెలియ రాలేదు. జిల్లా మొత్తం జల దిగ్బంధంలో చిక్కుకోగా నాగార్జున సాగర్ ఎడమ కాలువకు ఖమ్మంజిల్లా సరిహద్దు నడికుడి మండలంలో భారీ గండి పడింది.

సీతారామకు గండి

భద్రాది జిల్లాలో వర్షం భీభత్సాన్ని సృష్టించింది. శనివారం నుండి ఆదివారం వరకు జిల్లా వ్యాప్తంగా 3373 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైంది. బూర్గంపాడు మండలలో అత్యధికంగా 287.8 మి.మీ, అత్యల్పంగ దమ్మపేట మండలంలో 57.4 మిమీటర్ల వర్షం కురిసింది. ములకలప్లి మండల పరిధిలోని వికే రామవరం సీతారామ ప్రాజెక్టు పంపుహౌస్ 2 ప్రధాన కాలువకు గండి పడింది. దీంతో నీరంతా దిగువకు కొట్టుకుపోయింది. ఈ ప్రాజెక్టుకు సిఎం రేవంత్ రెడ్డి ఆగస్టు 15వ తేదిన ప్రారంభించారు. అశ్వారావు పేట గుమ్మడి వల్లి ప్రాజెక్టు రింగుబండ్‌కు గండిపడింది. దీంతో నీరు పెద్ద ఎత్తున ప్రవహిస్తూ రోడ్లపైకి చేరింది. మండలంలోని వాగొడ్డుగూడెం నుండి అశ్వారావుపేటకు రాకపోకలు నిలిచిపోయాయి. భారీ వర్షం కారణంగా మణుగూరు జలమయం అయ్యింది. కుంకుడు చెట్ల గుంపు, సుందరయ్యనగర్, గాంధీనగర్, లెనిన్‌నగర్, ఆదర్శనగర్ నీటిము నిగాయి. పరిస్థితి తీవ్రంగా ఉండటంతో ఆ ప్రాంత ప్రజలను అధికారులు సురక్షిత ప్రాంతాలకు చేర్చారు.

ఉమ్మడి వరంగల్‌లో కుండపోత

ఉమ్మడి వరంగల్ జిల్లాలో కుండపోత వర్షం కొనసాగుతోంది. శనివారం రాత్రి నుంచి మొదలైన వర్షం ఎడతెరపిలేకుండా కురుస్తుండటంతో ములుగు, మహబూబాబాద్, వరంగల్ జిల్లాల్లోని లోతట్టు ప్రాంతాలు జలమయం అయ్యాయి.

మహబూబాబాద్, ములుగు జిల్లాల్లో వాగులు, వంకలు ప్రమాదకర స్థాయిలో ప్రవహిస్తుండటంతో వందలాది గ్రామాలకు రవాణా వ్యవస్థ దెబ్బతింది. మరిపెడ మండలం పురుషోత్తమయగూడెం బ్రిడ్జి వద్ద వరద ఉధృతికి ఖమ్మం జిల్లా కారేపల్లి మండలం గంగారం తండాకు చెందిన తండ్రి కూతూర్లు నునావత్ మోతీలాల్, అశ్వినీలు కొట్టుకుపోయారు. మహబూబాబాద్ జిల్లాలోని గంగారం మండలం మినహా అన్ని మండలాల్లో 150.మి.మీ.కు పైగా వర్షపాతం నమోదు కావడం గమనార్హం. కొత్తగూడ 162.4, గంగారంలో 68.2, బయ్యారం 180.0, గార్ల 174.4, డోర్నకల్ 262.4, కురవి 354.2, మహబూబాబాద్ 374.8, గూడూరు 254.0, కేసముద్రం 377.2, నెల్లికుదురు 469.6, నర్సింహులపేట 405.6, చిన్నగూడూరు 450.6, మరిపెడ 352.4, దంతాలపల్లి 354.2, తొర్రూరు 262.4, పెద్దవంగర 245.4మి.మీ.రికార్డు వర్షపాతం నమోదైంది. జిల్లాలో మొత్తం 4747.3 మి.మీ నమోదు కాగా జిల్లా సగటు వర్షపాతం 296.7గా నమోదైంది. మహబూబాబాద్ జిల్లా కేంద్రంతో పాటు గూడూరు, నెల్లికుదురు, కురవి, మరిపెడ మండలకేంద్రాలు నీట మునిగాయి. మహబూబాబాద్ జిల్లాలోని మున్నేరు, పాలేరు, ఆకేరు వాగులు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. పెద్దవంగర మండలంలోని విద్యుత్ స్తంభాలు విరిగిపడ్డాయి.

ములుగులో రికార్డు వర్షపాతం నమోదు..!

ములుగు జిల్లాలో మొత్తం 1021.6మి.మీ.వర్షపాతం నమోదు కాగా జిల్లా సగటు వర్షపాతం 113.5గా నమోదైంది. తాడ్వాయి మండలంలో రికార్డు స్థాయిలో 260.8మి.మీ.వర్షం కురిసింది. ఏటూరునాగారం మండలంలో 235.4, గోవిందరావుపేట మండలంలో 151.8 వర్షం నమోదైంది. ములుగు జిల్లాలోని ఏటూరునాగారం ఏజెన్సీలో వాగులు, వంకలు పొంగిపొర్లుతున్నాయి. ఏటూరునాగారం–చరంగల్ జాతీయ రహదారి 163పై రాకపోకలు నిలిచిపోయాయి. జయశంకర్ భూపాలపల్లి జిల్లా కాటారం మండలంలోని దేవరాంపల్లి, శంకరంపల్లి, బొప్పారం, దామెరకుంట తదితర గ్రామాల్లో పత్తి పంటలు నీట మునిగాయి. జనగామ జిల్లా వ్యాప్తంగా 1286.4 మిల్లీ మీటర్ల వర్షాపాతం నమోదు కాగా ఆవరేజ్‌గా 107.2 మిల్లీ మీటర్లు నమోదైంది. భారీ వర్షం కురవడంతో పలు ప్రాంతాలకు వెళ్లే రోడ్లకు గండ్లు పడ్డాయి. రోడ్డు డైవెర్షన్లు కొట్టుకుపోయాయి.

ఇక జనగామ పట్టణం పూర్తిగా జలయమైంది. హన్మకొండహైదరాబాద్ జాతీయ రాహదారిలో రఘునాథపల్లి బ్రిడ్జి వద్ద వర్షం నీరు భారీగా నిలిచిపోవడంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. ఇక జనగామ బస్టాండ్ నుండి కళ్లె కమాన్ వరకు పూర్తి సుమారు మీటర్ ఎత్తులో నీరు ప్రవహించింది. దీనితో బాలాజీనగర్, గీతానగర్ పూర్తిగా నీట మునిగాయి.

ఏడుపాయల ఆలయం చుట్టూ ఉప్పొంగుతున్న మంజీరా మెదక్ జిల్లాలో ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన ఏడుపాయల వనదుర్గ భవాని ఆలయం చుట్టూ మంజీరా ఉప్పొంగడంతో ఆలయం మూసివేశారు.

రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు ఘనపుర ఆనకట్ట నిండడంతో పాటు ఎగువన ఉన్న మహారాష్ట్ర నుంచి వరద వస్తుండడంతో వనదుర్గా ప్రాజెక్టు పూర్తిగా నిండి పొర్లుతోంది. పటాన్ చెరువు సమీపంలోని నక్కవాగు నీరు కూడా చేరడంతో మంజీరాలో వరద ప్రవాహం మరింత పెరిగింది. దీంతో వనదుర్గ ప్రాజెక్టు పూర్తిగా నిండి 13000 క్యూసెక్కుల నీరు దిగువకు ప్రవహిస్తుంది. ప్రాజెక్టు పైనుంచి గంగమ్మ పరవళ్ళు తొక్కుతూ వనదుర్గామాత ఆలయం చుట్టూ మంజీరా ఉధృతంగా ప్రవహిస్తుంది. దీంతో వనదుర్గామాత ప్రధాన ఆలయం చుట్టూ మంజీరా నీరు చేరింది.

కడెం ప్రాజెక్టు 10 గేట్లు ఎత్తివేత

రాష్ట్రంలో కురుస్తున్న భారీ వర్షాలతో నిర్మల్ జిల్లాలోని వాగులు వంకలు నిండుకుండలుగా మారి పొంది ప్రవహిస్తున్నాయి.

00భారీ వర్షాలకు కడెం నారాయణరెడ్డి ప్రాజెక్టురకు భారీగా వరద నీరు చేరడంతో ఆదివారం ప్రాజెక్టు 10 గేట్లు ఎత్తినీటిని విడుదల చేస్తున్నారు.ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటిమట్టం 7.195 క్యూసెక్కుల,700 అడుగులు కాగా ప్రస్తుతం డ్యాంలో 7.603 టీఎంసీ లు ఉండగా ప్రాజెక్టు ఎగువ ప్రాంతాల్లో భారీ వర్షాలు కురవడంతో ప్రాజెక్టులోకి వరద భారీగా చేరుతుంది. ఇన్ ప్లో 61,001 క్యూసెక్కులుగా నమోదవుతోంది.

రెడ్ అలెర్ట్

(మొదటి పేజీ తరువాయి)

నుంచి అత్యంత భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందన్నారు. రెడ్ అలెర్ట్ జారీ చేశారు. ఆసిఫాబాద్, మంచిర్యాల, జగిత్యాల, భూపాలపల్లి, ములుగు, కొత్తగూడెం, ఖమ్మం, వరంగల్, హన్మకొండ, వికారాబాద్, సంగారెడ్డి జిల్లాల్లో అతి భారీ వర్షాలు పడుతాయని చెప్పారు. దాంతో ఆయా జిల్లాలకు ఆరెంజ్ హెచ్చరికలు జారీ చేశారు. మేడ్చల్ మల్కాజిగిరి, జోగులాంబ గద్వాలతో పాటు పలు జిల్లాలకు ఎల్లో అలెర్ట్‌ను జారీ చేశారు. ఉరుములు, మెరుపులు, గంటకు 4050 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీస్తాయన్నారు. సోమవారం నిర్మల్, నిజామాబాద్, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి జిల్లాల్లో అక్కడక్క భారీ వర్షాలు నమోదవుతాయని అంచనా వేశారు. సోమవారం ఉత్తర తెలంగాణ జిల్లాల్లో అతి నుంచి అత్యంత భారీ వర్షాలు కురుస్తాయన్నారు. సోమవారం ఉత్తర తెలంగాణ జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వెల్లడించారు. రాష్ట్రంలోని 33 జిల్లాలకు రెడ్, ఆరెంజ్, ఎల్లో హెచ్చరికలను జారీ చేశారు. అర్ధరాత్రి కలింగపట్నం ప్రాంతంలో వాయుగుండం తీరాన్ని దాటినట్లు చెప్పారు. మహబూబాబాద్, సూర్యాపేట, ఖమ్మం, జనగాం జిల్లాల్లో గడిచిన 24గంటల్లో అతి నుంచి అత్యంత భారీ వర్షాలు కురిశాయని తెలిపారు. మహబూబాబాద్ జిల్లా ఇనుగుర్తిలో 43.8, వరంగల్ జిల్లా నెక్కొండ మండలం రెడ్లవాడలో 43.5, సూర్యాపేట జిల్లా ముకుందాపురం 42.5, ఖమ్మం జిల్లా కాకర్వాయి 42.2, ములుగు జిల్లా తాడ్వాయిలో 25 సెంటీ మీటర్ల వర్షపాతం నమోదైందన్నారు. భారీ వర్షాల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వాతావరణ శాఖ సూచించింది.

అత్యంత భారీ వర్షాలు 9 జిల్లాలకు రెడ్ అలర్ట్ 9 జిల్లాలకు రెడ్ అలర్ట్, 12 జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్, 12 జిల్లాలకు ఎల్లో అలర్ట్ జారీ చేశామని అధికారులు చెప్పారు. ఆదిలాబాద్, నిర్మల్, నిజామాబాద్, కామారెడ్డి, మహబూబ్ నగర్, నాగర్ కర్నూల్, వనపర్తి, నారాయణపేట, జోగులాంబ గద్వాల జిల్లాల్లో అతి భారీ నుంచి అత్యంత భారీ వర్షాలు కురుస్తాయన్నారు. ఈ మేరకు ఈ జిల్లాలకు రెడ్ అలెర్ట్ జారీ చేశామన్నారు. కుమ్రంభీం ఆసిఫాబాద్, మంచిర్యాల, జగిత్యాల, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, వరంగల్, హన్మకొండ, జనగాం, వికారాబాద్, సంగారెడ్డి జిల్లాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురుస్తాయన్నారు. రాజన్న సిరిసిల్ల, కరీంనగర్, పెద్దపల్లి, నల్లగొండ, సూర్యాపేట, మహబూబాబాద్, సిద్దిపేట, యాదాద్రి భువనగిరి, రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్ మల్కాజిగిరి, మేడ్చల్ జిల్లాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షాలు కురుస్తాయన్నారు. ఆయా జిల్లాలకు ఎల్లో అలర్ట్ జారీ చేశామన్నారు.

24 గంటల్లో వరదలు ముంచెత్తే జిల్లాలు..

ఆదిలాబాద్, భద్రాద్రి కొత్తగూడెం, భూపాలపల్లి, జగిత్యాల, జనగాం, ఖమ్మం, కుమురం భీం, మహాబూబాబాద్, మంచిర్యాల, నల్లగొండ, నిర్మల్, నిజామాబాద్, పెద్దపల్లి, రాజన్న సిరిసిల్ల, సిద్దిపేట, సూర్యాపేట, వరంగల్ గ్రామీణం, వరంగల్ జిల్లాలో రానున్న 24 గంటల్లో భారీ వరదలు ముంచెత్తే అవకాశముందన్నారు.

ప్రజలకు, ప్రభుత్వానికి మధ్య

వారధిగా ఉంటా

టిజిఎల్ఎ సన్మాన కార్యక్రమంలో ఎంఎల్సి ప్రొఫెసర్ కోదండరామ్

ప్రజాపక్షం/హైదరాబాద్/ఖైరతాబాద్ : ప్రజలకు, ప్రభుత్వానికి మధ్య ఒక వారధిగా ఉంటానని, అది తన బాధ్యత అని టిజెఎస్ అధ్యక్షుడు, ఎంఎల్సి ప్రొఫెసర్ ఎం.కోదండరామ్ అన్నారు. హైదరాబాద్,బషీర్‌బాగ్‌లోని దేశోద్ధారకభవన్‌లో తెలంగాణ గెజిటెడ్ లెక్చరర్స్ అసోసియేషన్(టిజిఎల్ఎ) రాష్ట్ర కౌన్సిల్ ఆధ్వర్యంలో సిహెచ్ కనకచంద్రం అధ్యక్షతన ప్రొఫెసర్ కోదండరామ్‌కు ఆదివారం ఆత్మీయ సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కోదండరామ్ మాట్లాడుతూ కాంట్రాక్ట్ నుంచి రెగ్యులరైజ్ అయిన లెక్చరర్లకు శుభాకాంక్షలు తెలిపారు. జీతం, రెగ్యులరైజ్ కోసం గతంలో తనతో ఇందిరాపార్కు వద్ద ధర్నా చేసి, ఇప్పుడు గెజిటెడ్ లెక్చరర్లుగా అయి తనను సన్మానించడం సంతోషంగా ఉన్నదన్నారు. ఉద్యోగులెవరైనా ఒకేరకమైన పనికి ఒకేరకమైన జీతం ఉండాలని సుప్రీం కోర్ట్ ఇచ్చిన తీర్పు నేపథ్యంలోనే రెగ్యులరైజ్ సమస్యకు పరిష్కారం సులువైందన్నారు. జూనియర్ కాలేజీల్లో మౌలిక వసతుల సమస్యలు,లెక్చరర్ల వృత్తిపరమైన అంశాలపై దృష్టి పెడతానన్నారు. అందరం కలిసి చర్చించుకొని సమస్యల పరిష్కారానికి ప్రయత్నిద్దామని, అందుకు తన వంతు బాధ్యతగా కృషి స్తానని హామీనిచ్చారు. అనంతరం టిజిఎల్ఎ రాష్ట్ర అధ్యక్షుడు సిహెచ్ కనకచంద్రం, ప్రధానకార్యదర్శి ఆర్ శేఖర్, టిఎన్‌జిఒ రాష్ట్ర అధ్యక్షులు జగదీశ్వర్, ప్రధానకార్యదర్శి ముజీబ్, టిజిఒ రాష్ట్ర అధ్యక్షులు శ్రీనివాస్, టిజిఒ ప్రధానకార్యదర్శి సత్యనారాయణ, పిఆర్‌టియు టిఎస్ అధ్యక్షులు శ్రీపాల్‌రెడ్డి తదితర నాయకులు కలిసి కోదండరామ్‌కు పుష్పగుచ్ఛం అందజేసి, శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా అసోసియేషన్ తరపున కనకచంద్రం పలు తీర్మానాలను ప్రవేశపెట్టారు. సెప్టెంబర్1న పెన్షన్ 'విద్రోహదినం'కు మద్దతు ప్రకటిస్తూ, సిపిఎస్ రద్దుచేసి, ఒపిఎస్ అమలు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. కాంట్రాక్ట్ లెక్చరర్లను క్రమబద్ధీకరించాలని, ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో మౌలిక వసతులు కల్పించాలని, వ్యయ నిర్వహణ నిధులు పెంచాలని, వ్యాయామ అధ్యాపకులను నియమించాలని విజ్ఞప్తి చేశారు. అధ్యాపకులు, స్పాజ్, మెడికల్ గ్రౌండ్ వారికి సర్వీస్ సంబంధం లేకుండా బదిలీలు చేపట్టాలని విన్నవించారు. నూతనంగా రెగ్యులర్ అయిన అధ్యాపకులకు జూనియర్ కళాశాలలో సీనియార్టీ ఆధారంగా ఎఫ్ఎసి ప్రిన్సిపాల్‌గా అదే కాలేజీలో అవకాశం కల్పించాలని కోరారు. ఈ సందర్భంగా ఎంప్లాయీస్ జెఎసిలో టిజిఎల్ఎ భాగస్వామ్యమైనట్టు కనకచంద్రం ప్రకటించారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ రాష్ట్ర సహఅధ్యక్షులు వి. కొండల్, వర్కింగ్ ప్రెసిడెంట్ జిల్లా నర్సింహ్మ, కార్యనిర్వాహక కార్యదర్శి ఎం సిద్ధారెడ్డి, సంయుక్త కార్యదర్శి జి.రమేశ్, కోశాధికారి డి పవన్ కుమార్, ప్రచార కార్యదర్శి పి. నాగేందర్, అధికార ప్రతినిధి ఎన్ శ్రీనివాస్‌రెడ్డి వివిధ జిల్లాల నాయకులు పాల్గొన్నారు.

ఎల్లంపల్లి నుంచి నీటిని తరలిస్తున్నాం

ముంపు ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి

రాష్ట్ర రవాణ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్

ప్రజాపక్షం/కరీంనగర్ ప్రతినిధి: నేషనల్ డ్యాం సేఫ్టీ అథారిటీ సూచనల మేరకు కాళేశ్వరంలోని సుందిళ్ల, అన్నారం, మేడిగడ్డ బ్యారేజీలకు వచ్చి చేరుతున్న వరద నీటిని దిగువకు వదిలేస్తున్నామని, ఎల్లంపల్లి ప్రాజెక్టుకు వచ్చిన వరద నీటిని ఎగువ ప్రాంతానికి ఎత్తిపోస్తున్నామని రాష్ట్ర రవాణా, బిసి సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ వెల్లడించారు. ఆదివారం కరీంనగర్ లోయర్ మానేరు డ్యాంను సందర్శించిన సంధర్భంగా ఆయన మీడియాతో మాట్లాడారు.

తుమ్మిడిహట్టి నుంచి గ్రావిటీ ద్వారా ప్రాణహిత నీటిని ఎల్లంపల్లికి తెచ్చుకునే వీలున్నప్పటికీ కెసిఆర్ మేడిగడ్డ ప్రాజెక్టు కట్టారని ఆరోపించారు. ప్రస్తుతం ఆ ప్రాజెక్టులో నీరు నిలిపే పరిస్థితి లేకపోవడంతోనే ఎల్లంపల్లి నుంచి నీటిని తరలిస్తున్నట్లు చెప్పారు. ఎల్లంపల్లి ప్రాజెక్టుకు, కడెం నారాయణరెడ్డి ప్రాజెక్టు నుంచి వస్తున్న నీటితో పాటు క్యాచ్‌మెంట్ ఏరియా నుంచి వచ్చి చేరిన నీటిని నంది పంప్ హౌజ్ మీదుగా వరద నీటిని ఎగువ ప్రాంతాలకు ఎత్తిపోసే ప్రక్రియ కొనసాగుతోందన్నారు. ఎల్లంపల్లి వరద ఉధృతి తీవ్రం కావడంత గేట్లు ఎత్తి దిగువ ప్రాంతాలకు వదలాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. 24 టీఎంసీల సామర్థ్యం ఉన్న లోయర్ మానేరు డ్యాంకు 14 టీఎంసీల నీరు తరలించడం జరిగిందన్నారు. మరో వైపున మిడ్‌మానేరు ప్రాజెక్టుకు ఎల్లంపల్లి నుంచి నీటిని తరలించడంతో పాటు క్యాచ్‌మెంట్ ఏరియాల నుంచి వరద వచ్చి చేరుతోందని వివరించారు. దీంతో కొండపోచమ్మ సాగర్, రంగనాయక సాగర్, మల్లన్న సాగర్ వరకు నీటిని తరలిస్తున్నామని పేర్కొన్నారు. కోదాడ వరకు వరద నీటిని తరలించే ప్రక్రియ కొనసాగుతోందని తెలిపారు. కాళేశ్వరం బ్యారేజీలతో సంబంధం లేకుండానే ఈ నీటిని ఎగువ ప్రాంతాలకు తరలిస్తున్నట్లుగా వివరించారు. ఎస్సారెస్పీ నిండినట్లయితే మరింత నీరు మానేరు నదికి రానుందని, దీంతో మిగతా ప్రాంతాలకు నీటిని సరఫరా చేసే అవకాశం ఉంటుందని తెలిపారు. ప్రతి నీటి చుక్కను వినియోగంలోకి తీసుకొచ్చే విధంగా ప్రణాళికలు తయారు చేశామని తెలిపారు. రాజకీయాలు చేయడం మానుకుని వ్యవసాయ రంగం అభివృద్ధి చెందాలన్న కాంక్షతో ఉండాలని సూచించారు. సాగునీటి ప్రాజెక్టులకు కళకళలాడాలని ఆకాంక్షించాలన్నారు. భారీ వర్షాల కారణంగా ఎలాంటి ప్రాణ నష్టం జరగకుండా ఉండాలన్న లక్ష్యంతో ప్రభుత్వం వ్యవహరిస్తోందని, ఇందులో భాగంగా అన్ని రకాల చర్యలు తీసుకుంటోందని తెలిపారు. వరద నీరు రహదారులపైకి వచ్చి చేరడంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడుతోందని, వరద ప్రభావం తగ్గే వరకు బైకులను రోడ్లపైకి అనుమతించకూడదని అధికారులను ఆదేశించామన్నారు. హైదరాబాద్ నగరంలో 141 చోట్ల వాటర్ లాగింగ్స్ పాయింట్స్ గుర్తించామని, అక్కడ నీటిని నిలుపు చేసేందుకు అనువైన విధంగా ప్రణాళికలు తయారు చేస్తున్నామన్నారు. అదేవిధంగా జిల్లాల్లోనూ లోలెవల్ కాజ్‌వేలను గుర్తించి అక్కడ హైలెవల్ వంతెనలు నిర్మించేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటామని ప్రకటించారు. ప్రజలకు వర్షాలు తగ్గే వరకు అత్యవసరమైతే తప్ప బయటకు రాకూడదని కోరారు. భారీ వర్షాలు ఏకధాటిగా పడడం లేదని, కొంత గ్యాప్ ఇచ్చిన తర్వాత వర్షాలు కురుస్తుండడం వల్ల ఇబ్బందులు ఎదురు కావడం లేదన్నారు. అత్యవసర సేవలు అందించేందుకు అధికార యంత్రాంగా అన్ని వేళల్లో అందుబాటులో ఉంటారని మంత్రి వివరించారు. లోతట్టు ప్రాంతాలలో వర్షాల కారణంగా ఇబ్బందులు పడితే వారికి పునరావాస కేంద్రాలు కల్పిస్తామన్నారు. పార్టీ శ్రేణులు, ప్రజాప్రతినిధులు తమ వంతుగా సహాయక చర్యల్లో నిమగ్నం కావాలని పిలుపునిచ్చారు. మంత్రి వెంట ఎమ్మెల్యేలు కవ్వంపల్లి సత్యనారాయణ, మేడిపల్లి సత్యం, కలెక్టర్ పమేలా సత్పతి, నగరపాలక సంస్థ కమిషనర్ బాజిపాయ్

మహిళలపై హింసకు వ్యతిరేకంగా పోరాటం

ఈ పోరాటంలో పురుషులను కలుపుకొని పోదాం

పిఒడబ్ల్యు మెగసేన్ అవార్డు గ్రహీత పద్మశ్రీ ప్రొఫెసర్ శాంతా సిన్హా

ప్రజాపక్షం / హైదరాబాద్ : మహిళలపై జరుగుతున్న హింసకు వ్యతిరేకంగా పోరాడాలని మెగసేన్ అవార్డు గ్రహీత, పద్మశ్రీ ప్రొఫెసర్ శాంతా సిన్హా పిలుపునిచ్చారు. మహిళలపై జరుగుతున్న హింసకు పితృస్వామిక భావజాలం కారణమని, పితృస్వామిక భావజాలానికి వ్యతిరేకంగా కూడా పోరాడాలని, ఆ పోరాటంలో కలిసి వచ్చే పురుషులను కూడా భాగస్వాములను చేసుకోవాలని శాంతా సిన్హా అన్నారు. ప్రగతిశీల మహిళా సంఘం (పిఒడబ్ల్యూ) తెలంగాణ రాష్ట్ర 7వ మహాసభలను ఆదివారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలోప్రారంభమయ్యాయి. సంఘం పతాకాన్ని పిఒడబ్ల్యు రాష్ట్ర అధ్యక్షులు జి.ఝాన్సీ ఆవిష్కరించగా, ప్రధాన కార్యదర్శి అందే మంగ అమరవీరుల సంతాప తీర్మానం ప్రవేశపెట్టి రెండు నిముషాలు మౌనం పాటించారు. ప్రారంభసభలో ప్రొఫెసర్ శాంతా సిన్హా స్వాగతోపన్యాసం చేసారు. 'మహిళలు తమపై జరుగుతున్న హింసకు వ్యతిరేకంగా గొంతు పెంచాలి. ఇక హింసచాలు మాకూ హక్కులు ఉన్నాయి వాటిని పాటించండి''అని గట్టిగా నినదించాలని శాంతా సిన్హా అన్నారు. అనంతరం ప్రతినిధుల సభను ఉస్మానియా యూనివర్సిటీ ప్రొఫెసర్ రమా మేల్కోటే ప్రారంభిస్తూ మహిళలు గౌరవంగా జీవించే పరిస్థితులు క్షీణించిన క్రమంలో పిఒడబ్ల్యూ ద్వారా మహిళల గొంతులు గట్టిగా పెరిగాయన్నారు. మహిళలపై ఆర్థిక విధానాల ప్రభావం అనే అంశంపై ఢిల్లీ ఉమెన్స్ స్టడీస్ నాయకురాలు ప్రొఫెసర్ మేరీ జాన్ మాట్లాడుతూ భార్య, భర్తల మధ్య ఆర్థిక సంబంధాలు తీవ్ర ప్రభావాన్ని చూపిస్తున్నాయన్నారు. శ్రామిక శక్తిలో మహిళల భాగస్వామ్యం వ్యవస్థీకృత విధానంలో నిత్యం తగ్గిపోతోందని, ఈ క్రమంలో కుంటుంబాల్లో కొట్లాటలు వస్తున్నాయన్నారు. ఇందుకు కారణం పలు రంగాల్లో పురుషులతో సమానంగా వేతనాలు పొందక పోవడమేనన్నారు. 'పితృస్వామ్య ఆధిపత్యం, మహిళా ఉద్యమ కర్తవ్యాలు ' అనే అంశంపై ఐవిఫ్‌టియు జాతీయ అధ్యక్షులు డాక్టర్ అపర్ణ మాట్లాడుతూ స్త్రీలను పితృస్వామిక ఆధిపత్యం అణచివేస్తూనే ఉందని, గృహ సింహ, ఇతర దురాచారాలు ఇంకా కొనసాగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతి రంగంలో మహిళలు పోటీ పడుతున్నప్పటికీ వారిని పట్టించుకోవడం లేదన్నారు. ఈ క్రమంలో మహిళలు అప్రమత్తం కావాలన్నారు.

సహాయక చర్యల్లో అగ్నిమాపక శాఖ

ప్రజాపక్షం/హైదరాబాద్: వరద బాధితులను రక్షించేందుకు అగ్నిమాపక శాఖ రంగంలోకి దింగింది. సహాయ చర్యల్లో భాగంగా వరద ముంపుకు గురైన ప్రాంతాలకు అగ్నిమాపక అధికారులు, సిబ్బంది హుటాహుటీనా తరలివెళ్లారు. వర్షం దాటికి లోతట్టు ప్రాంతాలు జటమయమయ్యాయి. హైదరాబాద్, రంగారెడ్డి, వికారాబాద్, మహబూబ్‌నగర్, మహబూబాబాద్, వరంగల్, ఖమ్మం, నిజామాబాద్ ఆయా జిల్లాల్లో ఫైర్ అధికారులు సహాయ చర్యలో నిమగ్నమయ్యారు. అవసరమైన ప్రాంతాల్లో ఎమర్జెన్సీ బోట్స్‌ను రంగంలోకి దింపి వరద బాధితులకు సహాయ సహకారాలు అందిస్తున్నారు. వరదలో చిక్కుకున్న ప్రజలకు తాగునీరు, పాలు, ఇతర ఆహార పదార్థాలు కూడా అందించారు. వరదలో చిక్కుకున్న వారిని సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు శాయశక్తుల ప్రయతిస్తున్నారు. ఆదివారం రాత్రి వరకు సుమారు 5 వేలమంది క్షతగాత్రులను సహాయ శిభిరాలకు తరలించారు. ఇతర ప్రభుత్వ శాఖల అధికారులతో సమన్వయం చేసుకుని సహాయ చర్యలను ముమ్మరం చేశారు. వరదలో చిక్కుకున్న వారిని తాళ్ల సహాయం, పడవ సహాయంతో కాపాడారు. రహదారులపై పొంగిపోర్లుతున్న వరదలో వాహనాల రాకపోకలకు సహరిస్తూన్నారు. వరద ఉధృతంగా ఉన్న వంతెనల వద్ద సిబ్బంది అందుబాటులో ఉన్నారు. అత్యవసర సేవలను ప్రజల వద్దకు చేర్చడంలో నిమగ్నమయ్యారు. సహాయక చర్య ల్లో సుమారు మూడు వేల మంది సిబ్బంది పాల్గొంటున్నారు. భవనాలపై చిక్కుకున్న వృద్ధులను, బాలింతలను, చంటిపిల్లలను జోలో సహాయంతో రక్షించారు.

క్షతగాత్రులకుఅండగా ఉంటాం: ఫైర్ డిజిపి వై.నాగిరెడ్డి

వర్షప్రభావంతో వరద ముంపు ప్రాంతాల్లో ఫైర్ అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉన్నారు. ఆయా జిల్లా కలెక్టర్ల సమాచారం మేరకు ముంపు ప్రాంతాలను గుర్తించి ఆ ప్రాంతాలకు చేరుకుంటున్నాము. వరద బాధిత శిభిరాలకు బాధితులను తరలిస్తున్నాము. విద్యుత్ శాఖ అధికారులతో సమన్వయం చేసుకుని ఆయా ప్రాంతాలకు విద్యుత్ సరఫారా చేసే సిబ్బందికి ఫైర్ సిబ్బంది కూడా సహకారాలు అందిస్తున్నారు.

వరద ప్రాంతాల్లో సహాయక చర్యలు

సిబ్బందికి సెలవు 'నో' : డిజిపి

ప్రజాపక్షం/హైదరాబాద్: వరద ప్రభావిత ప్రాంతాలలో బాధితులకు సహాయ సహకారాలు అందించాలని డిజిపి డాక్టర్ జితేందర్ ఆయా కమిషనరేట్ల కమిషనర్లను, జిల్లాల ఎస్‌పిలను ఆదేశించారు. ఈ మేరకు జితేందర్ రాష్ట్ర పోలీసు వ్యవస్థను అప్రమత్తం చేశారు. వరద ముంపు ప్రాంతాలలో ప్రాణ నష్టం కలుగకుండా ఇతర విభాగాల అధికారులతో సమన్వయం చేసుకుని సహాయక చర్యలో పాల్గొనాలని డిజిపి సెట్‌కాన్ఫరెన్స్ ద్వా రా పోలీసు అధికారులకు సూచించారు. ఆయా జిల్లాలలో పోలీసు సహాయక చర్యలను డిజిపి హైదరాబాద్ నుంచి పర్యవేక్షిస్తున్నారు. ఎప్పటిప్పు డు కమిషనర్లు, ఎస్‌పిలతో మాట్లాడి తగిన సూచనలు జారీ చేస్తున్నారు. మల్టీజోన్ ఐజీలు చంద్రశేఖర్‌రెడ్డి, సత్యనారాయణలు కూడా వరద బాధిత ప్రాంతాలపై దృష్టి సారించారు.సెలవులో ఉన్న అధికారులు, సిబ్బందిని వెంటనే విధుల్లో చేరాలని ఉత్తర్వులు జారీ చేశారు. అత్యవసరమైతే తప్పా ఎవరు కూడా సెలవులో వెళ్లరాదని ఆంక్షలు విధించారు.

మహబూబాబాద్ పోలీసులను అభినందించిన డిజిపి జితేందర్..

మహబూబాబాద్ జిల్లా పరిధిలో వరద నీటితో కేసముద్రం వద్ద రైల్వే ట్రాక్ క్రింద ఉన్న కంకర కొంతభాగం కొట్టుకుపోయింది. ఈ కారణంగా కేసముద్రం రైల్వేస్టేషన్‌లో నిలిచిపోయిన రైలు లోని ప్రయాణికులు ఇబ్బంది పడకుండా తినడానికి ఆహారం తో పాటు వాటర్ బాటిల్స్, బిస్కట్ పాకెట్స్ లను రూరల్ సిఐ సరవయ్య, కేసముద్రం ఎస్.ఐ మురళీధర్ తదితర సిబ్బంది వారికి అందించారు. వివరాలు తెలుసుకున్న రాష్ట్ర డిజిపి డాక్టర్ జితేందర్ మహబూబాబాద్ జిల్లా పోలీసులను అభినందించారు.

అలాగే నాగర్ కర్నూల్ నాగనూల్ వాగులో ఓ వ్యక్తి కొట్టుకుపోతుండగా తక్షణమే స్పందించి ధైర్య సాహసాలతో ప్రాణాలకు తెగించి కాపాడిన హెడ్ కానిస్టేబుల్ తకీయొద్దీన్, కానిస్టేబుల్ రాములను డిజిపి డాక్టర్ జితేందర్ అభినందించారు.

హాస్టల్‌లో సమస్యలు పరిష్కరిస్తాం

ఐటి శాఖ మంత్రి శ్రీధర్ బాబు

ప్రజాపక్షం/నార్సింగి: రంగారెడ్డి జిల్లా శంషాబాద్ మండలం పాలమాకుల కస్తూర్బా గాంధీ(కెజిబివి)ప్రభుత్వ బాలిక పాఠశాలలో నెలకొన్న సమస్యలను పరిష్కరిస్తామని తెలంగాణ ఐటీ శాఖ, జిల్లా ఇంచార్జీ మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్ బా బు అన్నారు. ఆదివారం స్థానిక ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ తో కలిసి ఐటి శాఖ మంత్రి శ్రీధర్ బాబు,రాష్ట్ర ముదిరాజ్ సంఘం అధ్యక్షుడు బొర్రా జ్ఞానేశ్వర్,విద్యాశాఖ కమిషనర్,జిల్లా కలెక్టర్ శశాంక లతో కలిసి సందర్శించారు.ఈ సందర్భంగా ఆయన విద్యార్థుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. మాజీ మంత్రి హరీష్ రావు చేసిన వ్యాఖ్యలను ఖండించిన శ్రీధర్ బాబు గత ప్రభుత్వంలో విద్యార్థులను హాస్టల్లో ఎలుకలు కొరికి ఆసుపత్రులు పాలైన పట్టించుకున్న దాఖలాలు చేయలేదు.. మీరు మాపై మాట్లాడతారంటూ హరీష్ రావు చేసిన వ్యాఖ్యాలను మంత్రి శ్రీధర్ బాబు ఘాటుగా విమర్శించారు.మీరు చేసిన తప్పులను సరి చేయడంలోనే మా ప్రభుత్వం పనిచేస్తుందని మంత్రి శ్రీధర్ బాబు అన్నారు. కస్తూర్బా గాంధీ విద్యార్థుల పట్ల నిర్లక్ష్యం వహించిన పదిమంది టీచర్లపై బదిలీ వేటు వేషం అని అన్నారు. విద్యార్థులతో కలిసి భోజనం చేశారు సమస్యలను వెంటనే పరిష్కరిస్తామని మంత్రి హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

నిండుకుండల్లా ప్రాజెక్టులు...ఉధృతంగా వరద ప్రవాహం

కృష్ణా, గోదావరి బేసిన్‌లో గరిష్ట స్థాయికి చేరుకున్న నీరు

సిఎం, ఇరిగేషన్ మంత్రి సమీక్షతో ఉద్యోగులు అప్రమత్తం



ప్రజాపక్షం / హైదరాబాద్ : గత రెండు రోజులుగా కురుస్తున్న కుండపోత వర్షాలకు ఉభయ తెలుగు రాష్ట్రాల్లోని ఇరిగేషన్ ప్రాజెక్టులు నిండు కుండలను తలపిస్తున్నాయి. ఖమ్మం, నల్గొండ , గద్వాల సహా పలు జిల్లాల్లో వరద ఉధృతంగా ప్రవాహిస్తోంది. పలు జిల్లాల్లో ఎక్కడికక్కడ రాకపోకలు నిలిచిపోవడంతో జనజీవనం అస్తవ్యస్తమైంది. వర్షాలతో రోడ్లన్నీ జలమయమయం కాగా, ప్రజలు బిక్కుబిక్కుమంటూ జీవనాన్ని కొనసాగిస్తున్నా రు. మరో వైపు తెలంగాణ, ఏపిల మధ్య వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. ఎన్టీఆర్ జిల్లా నందిగామ మండలం ఐతవరం వద్ద హైవేపైకి వరద ప్రవాహంతో జాతీయ రహదారిపై రాకపోకలు స్తంభించిపోయాయి. అటు భద్రాచలం వద్ద గోదావరి నీటిమట్టం క్రమంగా పెరుగుతూ వస్తోంది. ఆదివారం మధ్యాహ్నం 12 గంటలకు గోదావరి నీటి మట్టం 32 అడుగులు దాటి ప్రవహిస్తోంది. శనివారం మధ్యాహ్నం 23 అడుగులు ఉన్న గోదావరి నీటిమట్టం, ఆదివారం మధ్యాహ్నానికి సుమారు 10 అడుగులు పెరిగింది. గోదావరి ఎగువన ఉన్న చర్ల మండలంలోని తాళి పేరు జలాశయం వద్ద 25 గేట్లను ఎత్తి 48 వేల క్యూసెక్కుల వరద నీటిని అధికారులు దిగువన ఉన్న గోదావరి నదిలోనికి విడుదల చేస్తున్నారు. ఈ క్రమంలో గోదావరి, కృష్ణా ప్రాజెక్టుల్లో నీటిమట్టం భారీగా పెరుగుతోంది. భద్రచాలం దగ్గర గోదావరి నీటి మట్టం పెరగడంతో ఇప్పటికే మొదటి ప్రమాద హెచ్చరికను ఇరిగేషన్ అధికారులు జారీ చేశారు. అంతే కాకుండా ప్రాజెక్టులు గరిష్టానికి చేరకున్నా యంటూ లోతట్టు ప్రాంతాల ప్రజలను అప్రమత్తం చేస్తున్నారు. ముఖ్యంగా భారీగా కురుస్తున్న వర్షాల నేపథ్యంలో భద్రాచలంలోని పలు కాలనీల్లోకి వర్షపు నీరు చేరింది. దుమ్ముగూడెం మండలం గంగోలు ప్రధాన రహదారి వద్ద వర్షపు నీరు చేరడంతో భద్రాచలం నుంచి దుమ్ముగూడెం, చర్ల మండలాలకు రాకపోకలు నిలిచిపోయాయి. బూర్గంపాడు మండలంలోని వలస ఆదివాసి గ్రామం ఉర్ల దోసపాడు గ్రామంలో భారీ వర్షానికి సుమారు 15 పశువులు మృత్యువాత పడ్డాయి. ఎగువ ప్రాంతాల నుంచి వస్తున్న వరదనీటి వల్ల భద్రాచలం వద్ద నీటిమట్టం ఇంకా పెరుగుతుందని కేంద్ర జలవనరుల శాఖ అధికారులు తెలిపారు.

మున్నేరు మరింత ఉధ్ధృతి

విస్తారంగా కురుస్తున్న వర్షాలతో ఉమ్మడి ఖమ్మం జిల్లాలో పలు ప్రాంతాల్లో మున్నేరు ఉధ్ధృతంగా ప్రవహిస్తోంది. ఈ క్రమంలో ఇరిగేషన్ శాఖ అధికారులు అప్రమత్తం అయ్యారు. రాష్ట్ర వ్యాప్తంగాను వరద ఉధృతిపై అధికారులు పలు చర్యలు తీసుకుంటున్నారు. డిప్యూటి సిఎం భట్టి విక్రమార్క ఈ విషయంలో మరో అడుగు ముందుకు వేసి ప్రజలను అప్రమత్తం చేస్తున్నారు. స్వయంగా పలు చోట్లకు వెళ్లి ఇరిగేషన్ శాఖ అధికారులకు పలు సూచనలు చేస్తున్నారు. అక్కడక్కడ అపార్ట్‌మెంట్‌లోకి వరద నీరు వస్తోందన్నారు. అటు ఎగువ నుండి వస్తున్న వరద పోటుతో గోదావరి ఉధృతి అంతకంతకు పెరుగుతోంది. శ్రీరామ్ సాగర్ ప్రాజెక్ట్ ..మిడ్ మానేరు, కిన్నెరసాని, తుపాకులగూడెం సమ్మక్క సాగర్ , కడెం, ఎల్లంపల్లి ప్రాజెక్టుల్లో ఇన్‌ఫ్లో పెరగడంతో అధికారులు నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. ఏపిలోనూ అక్కడి సిఎం చంద్రబాబు నాయుడు నీటిపారుదల ప్రాజెక్టులను స్వయంగా సందర్శించి పరిస్థితులపై అధికారులతో ఆరా తీయడం తెలుగు రాష్ట్రాల్లో వరద ఉధృతి ఏ స్థాయిలో ఉందో అర్థం చేసుకోవచ్చు. కాగా రాజమండ్రి ధవళేశ్వరం బ్యారేజ్ దగ్గర వరద ఉధృతి పెరుగుతూ వస్తోంది. దీంతో అధికారులు అప్రమత్తం అవుతున్నారు. మొన్న కర్నాటక రాష్ట్రంలో తుంగభద్ర డ్యాం గేటు వరదకు కొట్టుకు పోవడంతో అధికారులు సాగునీటి రంగ ప్రాజెక్టుల గేట్ల విషయంలో తగు జాగ్రత్తలు తీసుకుంటున్నారు. జూరాల, తుంగభద్ర , నాగార్జునసాగర్ , శ్రీశైలం ప్రాజెక్టులు నిండు కుండలను తలపిస్తుండడంతో నీటిని వదిలే విషయంలో ప్రభుత్వంతో సంప్రదింపులు జరుపుతున్నారు.

సిఎంఆర్ఎఫ్ స్కామ్‌లో అరెస్టులు షురూ..

నల్గొండలో ఇద్దరి అరెస్టు

ప్రజాపక్షం/హైదరాబాద్: బిఆర్ఎస్ ప్రభుత్వ హయంలో జరిగిన సిఎంఆర్ఎఫ్ కుంభకోణం కేసులో సిఐడి పోలీసులు అరెస్టులు మొదలు పెట్టారు. వైద్యం చేయకున్నా చేసినట్లు నకిలీ బిల్లులు సృష్టించి సిఎంఆర్ఎఫ్ నుంచి నిధులు దోచుకునేందుకు కుట్ర జరిగింది. దీంతో ఇటీవలే 28 ఆసుపత్రులపై సిఐడి పోలీసులు ఆరు ఎఫ్ఆర్‌లు చేసిన విషయం తెలిసిందే. ఇందులో క్రైమ్ నెంబర్ 10/2024 కేసులో సూర్యపేటలో ఇద్దరిని అదివారం అరెస్టు చేసిన ట్లు సిఐడి చీఫ్ శిఖాగోయల్ తెలిపారు. మిర్యాలగూడకు చెందిన ఆర్ఎంపి డాక్టర్ గొట్టిగిరి (46) చాణిక్య హాస్పిటల్‌లో మెడికల్ ప్రాక్టీస్ చేస్తున్నాడు. అలాగే నల్గొండ జిల్లాకు చెందిన లేకిరెడ్డి సైదిరెడ్డి (40) మిర్యాలగూడ నవీనా మల్టీస్పెషాలిటీ ఆసుపత్రిలో సూపర్‌వైజర్‌గా పనిచేస్తున్నాడు. వీరిద్దరు ఇద్దరి పేర్లతో సిఎంఆర్ఎఫ్‌కు 19 నకిలీ బిల్లులతో దరఖాస్తు చేశారని విచారణలో తేలింది. దీంతో సిఐడి విభాగంలోని జనరల్ అఫెన్స్ వింగ్ (జిఒడబ్ల్యూ) ఎస్‌పి ఎస్‌వి నాగలక్ష్మి నేతృత్వంలో ఇన్‌స్పెక్టర్ డి.ప్రశాంత్, హెడ్‌కానిస్టేబుళ్లు బి.నర్సయ్య, ఎండి షర్ఫూద్దీన్, కానిస్టేబుళ్లు నర్సయ్య, బి.శివకృష్ణలు ఆదివారం నవీనా మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రిలో తనిఖీలు నిర్వహించారు. నవీనా మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రి బిల్లులు, రబ్బరు స్టాంపులు, లెటర్ హెడ్‌తో పాటు నకిలీ తయారు చేసిన కంప్యూటర్, హార్డ్‌డిస్క్‌ను స్వాధీనం చేసుకున్నారు. నిందితులు గొట్టి గిరి(46), లేకిరెడ్డి సైదిరెడ్డి (40)లను అరెస్టు చేసి రిమాండ్ కు తరలించారు. మిగతా నిందితుల కోసం ఆరా తీస్తున్నామని సిఐడి డిజిపి శిఖాగోయల్ పేర్కొన్నారు.

వరద పరిస్థితులను తెలుసుకున్న కేంద్ర హోంమంత్రి

సిఎం రేవంత్‌రెడ్డికి అమిత్ షా ఫోన్

ప్రజాపక్షం / హైదరాబాద్: రాష్ట్రంలో భారీ వర్షాలు, వరద పరిస్థితుల గురించి కేంద్ర హోంమంత్రి అమిత్‌షా తెలుసుకున్నారు. ఈ మేరకు అమిత్‌షా తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి ఆదివారం రాత్రి ఫోన్ చేశారు. రాష్ట్రంలో క్షేత్రస్థాయిలో వరదలతో వాటిల్లిన నష్టాన్ని అమిత్‌షాకు ముఖ్యమంత్రి వివరించారు. వర్షాలు వరద పరిస్థితులను అమిత్ వివరంగా అడిగి తెలుసుకున్నారు. ప్రాణ నష్టం జరగకుండా తగిన జాగ్రత్తలు తీసుకుంటున్నామని అమిత్ షాకు సిఎం రేవంత్‌రెడ్డి తెలిపారు. అవసరమైన తక్షణ సాయం అందించడంతో పాటు కేంద్ర ప్రభుత్వం తరపున అవసరమైన వరద సహాయక చర్యలు చేపడతామని అమిత్‌షా ఈ సందర్భంగా ముఖ్యమంత్రికి హామీ ఇచ్చారు. రాష్ట్ర స్థాయి అధికారులు, అన్ని జిల్లాల కలెక్టర్లతో నేరుగా మాట్లాడి ఎప్పటికప్పుడు పరిస్థితిని సమీక్షిస్తున్నట్లు కేంద్ర మంత్రి అమిత్‌షాకు ముఖ్యమంత్రి తెలిపారు. అవాంఛనీయ పరిస్థితులు తలెత్తకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని అప్రమత్తం చేశామని, బాధిత కుటుంబాలను ఆదుకుంటామని రేవంత్‌రెడ్డి భరోసా ఇచ్చారు.

'వర్షాల'పై సమీక్ష నిర్వహించండి

సిఎం రేవంత్‌కు మాజీ మంత్రి సత్యవతి రాథోడ్ సూచన

ప్రజాపక్షం/హైదరాబాద్: రాష్ట్రంలో వర్షాల పరిస్థితులపైన మంత్రులతో సిఎం రేవంత్ రెడ్డి సమీక్ష నిర్వహించాలని బిఆర్‌ఎస్ మాజీ మంత్రి సత్యవతి రాథోడ్ సూచించారు. హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఎంఎల్‌ఎ కె.పి.వివేకానంద ,ఎంఎల్‌సి నవీన్ కుమార్‌తో కలిసి సత్యవతి రాథోడ్ మాట్లాడుతూ మాట్లాడుతూ విద్యా, గిరిజన ,హోంశాఖలకు మంత్రులు లేరన్నారు. కాంగ్రెస్ నేతలను చూసి ప్రజలు ఓట్లు వేయలేదని, మ్యానిఫెస్టోను చూసి ఓట్లు వేశారన్నారు. కె.వి.వివేకానంద మాట్లాడుతూ హైడ్రాకు గైడ్ లైన్స్ లేదని, చట్టబద్ధత లేదని, హైడ్రా పేరుతో కాంగ్రెస్ నాయకులు దందా చేస్తున్నారని ఆరోపించారు. హైడ్రాకు శాస్త్రీయత ఉందా అని ప్రశ్నించారు. హైదరాబాద్ నగరంలో ఎన్ని చెరువులు ఉన్నాయని, చెరువు బఫర్ జోన్,ఎఫ్.టి.ఎల్‌లో ఎన్ని ఇళ్ళు ఉన్నాయో నివేదిక ఉన్నదా అని ప్రశ్నించారు. హైడ్రా ఒక అట్టర్ ఫ్లాఫ్ ప్రోగ్రామని ఎద్దేవా చేశారు. టిడిపి, బిఆర్‌ఎస్ ప్రభుత్వాల హయాంలోనే హైదరాబాద్ నగరం అభివృద్ధి చెందిందని అన్నారు. సిఎం రేవంత్ రెడ్డికి చిత్తశుద్ధి ఉంటే హైడ్రాకు చట్టబద్ధత తీసుకురావాలన్నారు. రియల్ ఎస్టేట్ కోసమే ఫోర్త్ సిటీ అని ఆరోపించారు.

రైలులో చిక్కుకున్న ఎఐటియుసి నేతలు

సౌకర్యాలు కల్పించడంలో యంత్రాంగం విఫలం

ప్రజాపక్షం/హైదరాబాద్:వరదల కారణంలో రైలులో చిక్కుకున్న ప్రయాణికులకు కనీస సౌకర్యాలు కల్పించడంలో రైల్వే అధికారులు, సంబంధిత ప్రభుత్వ యంత్రాగం పూర్తిగా విఫలమైందని ఎఐటియుసి రాష్ట్ర కార్యదర్శి ఎస్,బాలరాజు పేర్కొన్నారు. విశాఖపట్నంలో జరుగుతున్న ఎఐటియుసి జాతీయ సమితి సమావేశాలకు హాజరవుతున్న జాతీయ సమితి నా యకులు ఎస్ బా లరాజు, ఎండి యూసుఫ్ , ఎం నరసింహ, వై. ఓ మయ్య, రవిచంద్ర, హసీనా బేగం, దేవేందర్ రెడ్డి దేవేందర్ రెడ్డి ,బి వెంకటేశం ,ఇమ్రాన్ తదితరులు సికింద్రాబాద్ , కాచిగూడ గరీబ్ రథ్ ట్రైన్ లో ప్రయాణం చేస్తుండగా అతి భారీ వర్షాలు కురవడంతో ఖమ్మం జిల్లా మధిర రైల్వే స్టేషన్ సమీపంలో చిక్కుకున్నారు. రైల్వే ట్రాక్ కింద కంకర బేస్ కొట్టుకపోవడంతో శనివారం రాత్రి రెండు గంటల నుండి ఉదయం 12 గంటల వరకు మధిర రైల్వే స్టేషన్ లోనే రైళ్లు నిలిపివేశారు. అక్కడ ప్రయాణికులకు కనీస సౌకర్యాలు కరువై, మంచినీళ్లు , టిఫిన్లు సరఫరా చేసే రైల్వే సిబ్బంది లేక ఒకపక్క జోరుగా వర్షం కురుస్తున్న, రైల్వే అధికారులు తక్షణ చర్యలు చేపట్టకుండా గంటల కొలది ట్రైన్ లో నిరీక్షణ చేయించడం విచారకరమని ఆయన తెలిపారు. ఎఐటియుసి సి జాతీయ నాయకులతో పాటు అనేకమంది వృద్ధులు, పిల్లలు ట్రైన్ లో ప్రయాణం చేస్తూ అనేక అవస్థలకు గురయ్యారన్నారు. రైల్వే శాఖ తక్షణమే రైల్వే లైను పునరుద్ధరణ చేసి, ప్రయాణికులను గమ్యస్థానాలకు పంపించాల్సింది పోయి నిమ్మకు నీరు ఎత్తినట్లుగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. కనీసం భోగిలను శుభ్రం చేసే సిబ్బంది లేకపోవడం మరుగుదొడ్లలో నీటి సౌకర్యం అడుగంటిపోయినా కనీసం పరిష్కారం చేసే దిశలో రైల్వే శాఖ సిబ్బంది అధికారులు నిర్లక్ష్యం వహించడానికి ఎఐటియుసి నాయకులు తీవ్రంగా ఖండించారు. అనేక అసౌకర్యాలకు గురవుతున్న వేలాదిమంది రైల్వే ప్రయాణికులు ఎప్పుడు తమ గమ్యస్థానాలకు చేరుతమో తెలియక ఆయోమయానికి గురయ్యారన్నారు. భవిష్యత్తులో ఇలాంటి సంఘటనలు జరగకుండా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

సెల్ఫీల కోసం వాగులు, చెరువులు వద్దకు వెళ్లొద్దు : శాంతి కుమారి

ప్రజాపక్షం / హైదరాబాద్: వాగులు చెరువులు నదుల వద్దకు ప్రజలు వెళ్లవద్దని, ముఖ్యంగా సెల్ఫీలు, ఫోటోగ్రాఫ్‌లను తీసుకునేందుకు వెళ్ళి ప్రాణాలమీదకు తెచ్చుకోవద్దని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి విజ్ఞప్తి చేశారు. వాగులు, నదులు పొంగి పొర్లుతుంటే పలుచోట్ల ప్రజలు వంతెనలు ఎక్కి చూడడం, సెల్ఫీలు తీసుకుంటున్నారని, ఆ సమయంలో ఎక్కడైనా బ్రిడ్జి, వంతెన కొట్టుకుపోతే జరిగే ప్రాణనష్టం చాలా ఎక్కువగా ఉంటుందన్నారు. ఇప్పటికే ఈ విధమైన సంఘటనలు అక్కడక్కడ ఎదురవుతున్నాయని శాంతికుమారి ఒక ప్రకటనలో తెలిపారు.

పరకాలలో నిజాం సేనల ఊచకోత

డా॥పల్లేరు వీరస్వామి
9441602605

ఆంగ్లేయుల పాలనానంతరం భారతదేశంలోని కొన్ని రాష్ట్రాల పాలకులు తమకు స్వయం ప్రతిపత్తి కావాలని భావించారు. అలాంటి వాటిలో తిరువాన్కూరు, హైదరాబాద్, జునాగఢ్, కశ్మీర్ వంటివి ఉన్నాయి. ఎలాగైనా అప్పటి హోం శాఖామంత్రి సర్దార్ వల్లభభాయి పటేల్ చారిత్రక కృషివల్ల అన్ని సంస్థానాలు భారత యూనియన్‌లో విలీనమయ్యాయి. ఐతే, హైదరాబాద్ సంస్థానం విషయం ఇక్కడ ప్రస్తావనార్హం. ఈ రాష్ట్ర పోరాటంలో స్టేట్ కాంగ్రెస్, ఆర్యసమాజ్, కమ్యూనిస్టులు ప్రధాన పాత్రలు పోషించి పోరాటాలు నిర్వహించారు. నిజాం ప్రభుత్వ పోలీసు బలగాలతోనూ, రజాకారుల దుర్మార్గపు చర్యలతోనూ స్వాతంత్ర్య పోరాట యోధులు సాయుధులుగా తలపడవలసి వచ్చింది. జైళ్ళు ఉద్యమ కారులతో నిండిపోయాయి. ఎందరెంద రో ఆస్తిపాస్తులను పోగొట్టుకున్నారు. తుపాకీల కాల్పులకు ఆహుతి అయ్యారు. అయినా గ్రామ ప్రజల ప్రాణాల రక్షణకు వారు బాసటగా నిలిచారు. త్యాగాలనూ, దీక్షలనూ, సాహసాలనూ ప్రదర్శించిన ఆనాటి ఆ వీరులు చిరస్మరణీయులు. అలాంటి వీరోచిత పోరాటం పరకాలలో జరిగింది. మతమార్పిడులకు వ్యతిరేకంగా ఆర్యసమాజిస్టులు; భూ స్వామ్య విధానాన్ని ధిక్కరిస్తూ కమ్యూనిస్టులు; మానవ హక్కు ల పరిరక్షణకై ప్రజాస్వామికవాదులు శాంతియుత, సాయుధ పోరాట పద్ధతులలో శ్లాఘనీయంగా తలపడ్డారు. స్వాతంత్ర్య పోరాటకాలంలో సువర్ణాక్షరాలతో లిఖించదగిన చరిత్రయిది. మరో జలియన్ వాలాబాగ్ ను తలపించే మరుపురాని ఆ సంఘటనల్ని పునరావలోకనం చేసుకునే సందర్భమిది.

హైదరాబాద్ నైజాం సంస్థానంలో భూస్వాములు, పెత్తందార్లు, దొరలు, ప్రభుత్వోద్యోగులు వారి ఆగడాలకు అంతేలేదు. నైజాం ఏజెంట్లుగా దేశ్‌ముఖులు, జమీందార్లు, జాగీర్దార్లు, మక్తేదార్లు, రజాకార్లు సామాన్యులపై ఒత్తిడులు పెంచి పెత్తనాలు చెలాయించేవారు. నిర్బంధాలు, వెట్టి చాకిరీలు చేయించుకునేవారు. పరకాల ప్రాంతంలో ప్రధానంగా కంతాత్మకూర్, పత్తిపాకలలో జాగీర్దార్లు, జంగేడు, నైన్‌పాక, నేరేడుపల్లె, గొర్లవీడు, గిద్దెముత్తారం, రాఘవాపురం, అంకుశాపురం, సోమన్‌పల్లి, రామకృష్ణాపూర్, నిజాంపల్లి, కోనరావుపేట, గూడెప్పల్లె, గోరికొత్తపల్లి, తదితర గ్రామాలలో మక్తేదారులుండేవారు. నార్లాపూర్‌లో అక్బర్ షా, వెంకటేశ్వర్ పల్లిలో సలావుద్దీన్ లాంటి వారు వేలాది ఎకరాల భూములకు అధిపతులుగా ఉండేవారు.

అప్పుడు హైదరాబాద్ సంస్థానాన్ని అసఫ్ జాహీ వంశంలోని ఏడవ నవాబు మీర్ ఉస్మాన్ అలీఖాన్ పాలించేవాడు. ఇతని కింద జాగీర్దార్లు, మక్తేదార్లు, వతన్ దార్లు, భూస్వాములు ఉండేవారు. ఇదొక ఫ్యూడల్ వ్యవస్థ. వీరంతా నిజాం నవాబుకు నజరానాలు, తాటిచెట్ల వేలంలో వచ్చిన కొంత సొమ్ము, సారాయి దుకాణాల్లో, భూమి శిస్తుల రూపాల్లో వసూలైన కొంత మొత్తం చెల్లించుకునేవారు. గ్రామాల్లోని సివిల్ క్రిమినల్ కేసులు వీరే పరిష్కరించి జరిమానాలు వసూలు చేసేవారు. తహసీల్దారు నుండి గ్రామ సేవకుల వరకు నియామకాలు వీరి కనుసన్నల్లోనే జరిగేవి.

ఈ జాగీర్దార్లకు వేలాది ఎకరాల భూములు వివిధ గ్రామాల్లో ఉండేవి. వాటిని సేరిదారులు సాగుచేయాలి. సామాన్య రైతుల నాగండ్లు వంతుల వారీగా వచ్చి జాగీరుదారుల భూముల్ని దున్నాలి. వెట్టి చాకిరీలు ఆడ, మగ అందరూ చేయాలి. నామమాత్రపు కూలీలు స్వీకరించాలి. ఆనారోగ్యాల పాలై వెట్టికి రాకుంటే కఠిన శిక్షలుండేవి. వ్యవసాయ భూముల్లో విత్త నాలు చల్లిన వెంటనే పన్నులు రైతుల నుండి వసూలు చేసేవారు. అతివృష్టి, అనావృష్టి వంటి ప్రకృతి వైపరీత్యాల వలన పంటలు పండక శిస్తులు చెల్లించకపోతే ఆ జాగీర్దారుకే భూమి అధీనమయ్యేది. అట్టి భూముల్లోనే సంబంధిత రైతులు కూలీలుగా మారిపోయేవారు. ప్రతి గ్రామంలో జాగీర్దారుకు 25 మందికి తగ్గకుండా దళితులు వెట్టిచాకిరీకోసం నియమింప బడేవారు. వీరికి రోజుకు సోలెడు గింజలు గంజినీళ్ళ కోసం ఇచ్చేవారు.

జాగీర్దార్లు పలురకాల పన్నులు వసూలు చేసేవారు. జాగీర్దారు ఇంట్లో జరిగే ప్రతి శుభ కార్యానికీ పట్టాలు (చందాలు) ఇవ్వాలి. సున్నతుల పట్టీ, బారసాలల పట్టీ, దొరసానుల గాజుల పట్టీ వంటివి ఉండేవి. రైతులు ప్రతి ఇంటినుండి వంద, ఆపైన చొప్పకట్టలు ఉచితంగా ఇవ్వాలి. ఇవేగాక ఎద్దులు, ఆవులు, గేదెలు, మేకలు, కోళ్ళు జరిమానాలుగా ఇవ్వాలి. దొరల భూములు కౌలుకు తీసుకుంటే ధాన్యం ఇవ్వాలి. కొందరు వెట్టి చాకిరీలు చేయాలి. సేద్యానికి యువతీ యువకులే వెళ్ళాలి. బాలింతలైతే పాలుపిండి చూపిస్తేనే మినహాయింపు ఉండేది. కొందరు మక్తేదార్లకు ఆ గ్రామాల్లోని అందమైన యువతులు కావాలి. ఎదురు తిరిగితే గుడిసెలు బూడిదయ్యేవి. గడీలముందు హిందువులు చెప్పులు వేసుకొని నడువరాదు. తలపాగాలు చుట్టుకోరాదు. గజ్జెల మోతలు గల బండ్లలో ప్రయాణించరాదు. హద్దులు మీరితే కఠినశిక్షలుండేవి. ముస్లిములేకాదు, హిందూ దొరల ఇండ్లలోనే ఆడ పిల్లలుండేవారు. ఈ యువతులు దొరసానులకు సేవలు చేస్తూ, ఆ ఇంట్లో కోరిన ప్రతి మగాడి కోరిక తీర్చాలి.

సామాన్యులకు తిండి దొరికేది కాదు, అంబలి, నూకల జావ, ఇప్పపూవు కుడుములు, తౌదురొట్టెలు, దుంపలు, తాటిపండ్లపై కాల్చుకొని ఉడికిన చింత గింజలతో కాలం వెళ్లబుచ్చేవారు. ఆనారోగ్యాలు వారిని చుట్టుముట్టేవి. నాటు వైద్యాలే వారికి శరణ్యం. నిరుపేదలు, దళితులు మతం మార్చుకుంటే కొన్ని ఆశలు కలిగించేవారు. ముస్లి, జనాభా ఎక్కువై, నిజాం పాలన బలోపేతం కావడం వారి వారి ముఖ్య ఉద్దేశం. మత మార్పిడి అయినవారికి అంకూస్, యాకోబ్, రాజమహ్మద్ లాంటి పేర్లు పెట్టారు. దీన్ని కనిపెట్టిన ఆర్య సమాజ్ నాయకులు పండిత నరేంద్ర జీ నాయకత్వాన 'శుద్ధి' కార్యక్రమం చేపట్టి వారిని తిరిగి హిందువులుగా మార్చేవారు. రజాకార్లచే చెరచబడిన స్త్రీలకు పునరావాసాలు కల్పించారు. ఇక్కడి పాఠశాలల్లో ఉర్దూ మాధ్యమం ఉండేది. పరకాల ప్రాం త యువకులు క్విట్ ఇండియా స్ఫూర్తితో క్విట్ హైదరాబాద్ ఉద్యమాన్ని సైతం నిర్వహించారు .

పరకాల ప్రాంతం ఆనాడు కరీంనగర్ జిల్లాలో ఉండేది. ఆంధ్రమహాసభ నాయకులు బద్దం ఎల్లారెడ్డి పరకాలకు వచ్చి ఆంధ్ర మహాసభల సభ్యత్వాలను ఇచ్చాడు. అప్పటి కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు కటంగూరి కేశవరెడ్డి సూచనల మేరకు కటంగూరి నర్సింహారెడ్డి, వాసుదేవ రెడ్డి, కటంగూరి ప్రకాశరెడ్డి, మేడిపల్లి మల్లయ్య, రంగాచార్యులు, కటంగూరి రాఘవరెడ్డి, రేగూరి చంద్రయ్య వంటి 150మంది మెరికల్లాంటి యువకులు ఆ సభ్యత్వాలను స్వీకరించారు.

2 సెప్టెంబరు 1948 పరకాల పోరాటం సందర్భంగా

1945, ఫిబ్రవరి 5న మద్రాసు నుండి కాజీపేట మీదుగా వార్ధాకు వెళ్ళే రైలులో గాంధీ గారు వస్తున్నారు. ఈ విషయం తెలుసుకొన్న యువకులు సమ్మోహి మనోహరరావు, పాములపర్తి సదాశివ రావు, బండారు చంద్రమౌళీశ్వర్ రావు వంటివారు గాంధీగారిని కలిసి జాతీయోద్యమ స్ఫూర్తిని పొందారు.

1946లో భారత సంస్థానాధీశులు కొందరు భారతదేశంలో కలియుటకు వచ్చారు. కానీ, నైజాం రాజు మాత్రం అందుకు ససేమిరా అన్నాడు. తాను రాజ్యాధిపతినని ఐక్యరాజ్యసమితికి లేఖరాశాడు. పాకిస్తాన్ ప్రభుత్వం నిజాంకు బాసటగా నిలచింది. బహదూర్ యార్జంగ్ పరకాల ప్రాంతానికి వచ్చి ముస్లిములను హిందువులపైకి రెచ్చగొట్టే ప్రసంగాలు చేశాడు. ఈ ప్రాంత భూస్వాములు, దొరలు అతనికి మద్దతు పలికారు. అనంతర కాలంలో ఖాసీం రజ్వీ రంగంలో ప్రవేశించి తమ మత పాక్షికతకు ప్రతినిధియై రజాకార్ పేరుతో ముస్లిం గూండాలను ఒక సైన్యంగా తయారుచేశాడు.

తేది 8–8–1946నాడు వరంగల్ తూర్పు కోటలో బత్తిని మొగిలయ్య ఇంటి ప్రాంగణంలో త్రివర్ణ పతాకావిష్కరణ చేసే సందర్భంలో పరకాల ప్రాంతం నుండి సమ్మోహీ మనోహరరావు నాయకత్వంలో కొందరు పాల్గొన్నారు. ఆనాడు బత్తిని మొగిలయ్యను చంపి, అతడి తమ్ముని ముక్కును, చేతిని కోసివేశారు. మనోహర్ రావు తప్పించుకున్నాడు. కరీంనగర్ జిల్లా కాంగ్రెస్ కమిటీలో కటంగూరి కేశవరెడ్డి, సమ్మోహి మోహనరావులు చురుకైన పాత్రలు పోషించారు. జులై 1947 మాసంలో పరకాలప్రాంతం నుండి ఒక కరపత్రం విడుదల చేశారు. నిజాం పాలనను ఎదిరించుటకు ''శాంతి యుత పోరాటమా – సాయుధ పోరాటమా'' అని చర్చను చేసి, ప్రభుత్వ పోలీసులను, రజాకార్లను సాయుధులుగానే ఎదుర్కొందామనే నిర్ణయం కరపత్రం ద్వారా ప్రకటించారు.

ఖాసీంరజ్వీ నాయకత్వాన రజాకార్లు, కొందరు దొరలు నైజాం ప్రభుత్వ మనుగడకై ఉద్యమకారులను వేటాడుతున్నారు. చైతన్యశీలురైన యువకులు వెట్టిచాకిరీకి వ్యతిరేకంగా, బానిససంకెళ్ళను తెగటార్చుటకు తాటి, ఈత వనాలను నరికి త్రివర్ణ పతాకాలను ఎగురవేస్తూ ఉద్యమిస్తున్నారు. హైదరాబాద్ సంస్థానం భారత్‌లో విలీనమగుటకు సమావేశం కావాలని తేది 4–8–1947 నాడు సమ్మోహి మనోహరరావు రాసిన లేఖ ద్వారా సమావేశమై తొలి సత్యాగ్రహం పరకాలలో చేశారు. సురాబు చందర్ రావు తొలి సత్యాగ్రాహిగా నిలిచారు. సత్యాగ్రహం విజయవంతమైంది. ప్రభుత్వ ఉత్తర్వులు రానందున ఎవరూ అరెస్టు కాలేదు. రజాకార్లు దాడికి యత్నిస్తే సత్యాగ్రహులు వారిని త్రిప్పికొట్టారు. సత్యాగ్రహ సమాచారమీయని అప్పటి పోలీసు పటేలు దగ్గ వీరగోపాల్‌రావును ప్రభుత్వం సస్పెండ్ చేసి, ఆయన స్థానంలో ఇనాయత్ అలీని నియమించింది. సత్యాగ్రహానికి నాయకత్వం వహించిన మోహనరావుకు అరెస్టు వారెంటు జారీ అయింది. అతను చాకచక్యంగా తప్పించుకున్నాడు.

15–08–1947న భారత స్వాతంత్ర్యం ప్రకటిస్తారని, నెహ్రూ రేడియో ప్రసంగం చేస్తారని తెలిసి, పరకాల ప్రాంతంలో త్రివర్ణ పతాకాల నెగురవేయాలని నిర్ణయించారు. ఊరేగింపులు, సభలు పెట్టాలని కరపత్రాల్ని పంచారు. దీనికి ఎంతో గుండెధైర్యం కావాలి. అయినా యువకులు ఆ పనులు చేశారు. సమ్మోహి రహస్య సంచారం చేస్తున్నాడు. కటంగూరి కేశవ రెడ్డిని అరెస్టు చేశారు. ప్రజలకు నిత్యావసర సరుకుల పంపిణీని నిలిపివేశారు. ప్రజలు తిండికిలేక బాధపడుతున్నారు. అప్పుడు పరకాల తాహసీల్దారు విష్ణువేశ్వరరావు రేపాక నుండి కనిపర్తి ద్వారా పరకాలకు వస్తుంటే, కనిపర్తి గ్రామంలో అతన్ని ప్రజలు నిలదీశారు. తహసీల్దారు నక్కజిత్తులతో అతిత్వరలో నిత్యావసర సరుకుల్ని పంపిస్తానని తప్పించుకున్నాడు.

గ్రామాల్లో జరిపే సత్యాగ్రహాలతో పాటు, తేది 2–9–1947 నాడు పరకాలలో ఊరేగింపు జరపాలని సమ్మోహి మనోహరరావు లేఖ రాశాడు. నర్సింహారెడ్డి, ప్రకాశ్‌రెడ్డి, వీరగోపాల్‌రావు, రంగాచార్యులు, మేడిపల్లి మల్లయ్య లాంటి కార్యకర్తలు విరివిగా ప్రచారాలు రహస్య పద్ధతులతో నిర్వహించారు. ప్రభుత్వం గ్రహించి వారికి దొరికిన రాఘవరెడ్డి, కోటయ్య, జోగారెడ్డిలను అదుపులోకి తీసుకున్నారు. పరకాల ప్రాంతం నుండి వివిధ గ్రామాల ప్రజలు సెప్టెంబరు 2, 1947 న సుమారు 5వేల మంది పైడిపెల్లి తాటి వనంలో జమఐనారు. జనం ఊరేగింపుగా పరకాల పట్టణంలో ప్రవేశిస్తున్నారు. దగ్గు వీరగోపాల్ రావు నాయకత్వం వహిస్తున్నారు. శాంతియుతంగా ఊరేగింపు కదలుతున్న కడలిని తలపిస్తున్నది. శాంతిభద్రతల పేరిట నిజాం పోలీసులు, కత్తులు, బరిసెలు, తల్వార్లు ధరించిన రజాకార్లు, దొరలు పంపించిన హిందూ గూండాలు యుద్ధానికి సిద్ధమన్నట్లు నిలిచారు. ప్రజావాహిని ఏమాత్రం వెనుకడుగు వేయలేదు. ముందువరుసలో నాగారం నుండి శ్రీశైలం, రంగయ్యపల్లె వాని సూర నర్సయ్య త్రివర్ణ పతాకాలు చేబూని నడుస్తున్నారు.

తహసీల్దారు విష్ణుకేశ్వరరావు, ఖజానాధికారి అలీబావున్‌తో కలిసి ఊరేగింపును చూస్తున్నారు. తహసీల్దారు పోలీసు పటేలు రాజన్నతో ఊరేగింపును మానుకోండని వర్తమానం పంపాడు. ఉద్యమకారులు రెట్టింపు ఉత్సాహంతో కదులుతున్నారు. రజాకార్లు బుసలుకొడుతూ చూస్తున్నారు. సర్కిల్ ఇన్‌స్పెక్టరు 'జియా ఉల్లా' తహసీల్దారు ఆజ్ఞకై ఎదురు చూస్తున్నారు. అంతలో పోలీసు జవాన్లతో నిండిన ఒక లారీ ఊరేగింపు వైపు దూసుకెళ్లింది. పక్కనే పెద్దబావి, ముళ్ళకంచె ఉన్నాయి. జనం వాటిలో నెట్టివేయబడ్డారు. కొందరు పరుగులు పెట్టారు. తహసీల్దారు సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌కు అనుమతినిచ్చారు. అతని చేతిలోని తుపాకీ మోగింది. వెంటనే రజాకార్లు, గూండాలు సామాన్య ప్రజలపై స్వైరవిహారం చేశారు. అనేకమంది క్షతగాత్రులైనారు. ఆ క్రూర చర్య మూలంగా (15) మంది అక్కడికక్కడే ప్రాణాలొదిలారు. వారు గజ్జి పర్వతాలు (కనిపర్తి), కుంట అయిలయ్య (నాగుర్లపల్లె), బత్తుల సమ్మయ్య (రాయప్పల్లె), ఆముదాపురం వీరన్న (రాయప్పల్లె), మేకల పోచయ్య (రాయపల్లె), మంత్రి కేదారి (దమ్మన్నపేట), పోతుగాటి పెద్దులు (దమ్మన్నపేట), గుండారపు కొంరయ్య (రేగొండ), రాయపల్లి రాజయ్య (రేగొండ), గెల్లె కట్టమల్లు (దామరంచెపల్లె), జాలిగపు ముసలయ్య (చల్లగరిగె), తొనగర్ పూర్ణాసింగ్ (చల్లగరెగె), కలువల అంకూస్ (గోవిందాపూర్), కుమ్మరి రాములు (రేగొండ), మరొకరు అమరులయ్యారు. రజాకార్లు హిందువుల ఇండ్లల్లో జొరబడి చెప్పరాని అఘాయిత్యాలు చేశారు.

తర్వాత పరకాల యువకులు కొదమసింహాలై అక్టోబరు 1వ తేదీ 1947 లో చాందాలో సమావేశమై సాయుధ శిక్షణలు పొందారు. ఆయుధాలు వివిధ పద్ధతుల్లో సేకరించుకొని దొరల భూస్వాముల గుండెల్లో ఫిరంగులు మోగించారు. 12.09.1948 నాడు జిన్నా మరణంతో నిజాం రాజు కుదేలైనాడు. చివరికి పటేల్ పంపిన భారత సైనికులు 13.09.1948 నాడు రాజూరా రైల్వేస్టేషన్‌పై త్రివర్ణ పతాకాన్ని ఎగరేశారు. 15.9.1948 నాడు కరీంనగర్‌లో పెద్ద బహిరంగ సభ నిర్వహించారు. కె.వి.నర్సింహారావు ఉత్తేజిత ప్రసంగం చేశారు. అతనికి అంగరక్షకులుగా పరకాల దళసభ్యులే ఉన్నారు.

హైదరాబాద్ సంస్థానంలో అసఫ్‌జాహి వంశస్థులు 1724 సంవత్సరం నుంచి పాలన సాగించి నిరంకుశంగా 224 సంవత్సరాలు నిరాటంకంగా పాలించారు. 7వ నవాబు మీర్ ఉస్మాన్ అలీఖాన్ బహద్దూర్ గత్యంతరం లేక 17.09.1948 నాడు భారత ప్రభుత్వానికి లొంగిపోతున్నట్లు రేడియో ప్రకటన చేశాడు. అదేరోజు సాయంత్రం జనరల్ ఎల్.ఎడ్రూస్ నాయకత్వంలో గల నిజాం సైన్యం భారత యూనియన్ సేనకు లొంగిపోయింది. భారత సైనిక దళ మేనేజర్ జనరల్ జె.ఎన్.చౌదరి హైదరాబాద్ సంస్థాన మిలిటరీ గవర్నరుగా నియమితులైనారు. నిజాం ప్రభువు హైదరాబాద్ బేగంపేట విమానాశ్రయంలో భారత యూనియన్ హోంశాఖామాత్యులు సర్దార్ వల్లభ్ భాయి పటేల్‌కు అభివాదం చేస్తూ లొంగిపోయాడు.

ఆ నిజాం విముక్తి పోరాటంలో పరకాల ప్రాంతంలో రక్తపుటేరులు పారాయి. ఎందరెందరో ధన, మాన, ప్రాణాలను లెక్కచేయక పోరాడారు. తేదీ 2, సెప్టెంబరు 1948 జరిగిన పరకాల పోరాటం మరో జలియన్‌వాలా బాగ్‌ను తలపించి చరిత్రలో నిలిచింది.

'టానిక్ ఎలైట్' మద్యం షాపు సీజ్

రూ.1.70 కోట్ల మద్యం సీజ్

ప్రజాపక్షం/హైదరాబాద్: అనేక వివాదాలకు కేంద్రంగా, ఎక్సైజ్ చట్టంకు వ్యతిరేకంగా జూబ్లీహిల్స్ ఎలైట్ మద్యం దుకాణం రెన్యువల్‌ను ఎక్సైజ్ శాఖ తిరస్కరించింది. ఎక్సైజ్ శాఖ సంబంధించి ప్రతి రెండు సంవత్సరాలకు ఒకసారి మద్యం దుకాణాల వేలం నిర్వహిస్తుంది. కానీ 2016లో ప్రత్యేకంగా టానిక్ ఎలైట్ షాపును అనుమతి తీసుకున్నటువంటి ఈ దుకాణం యజమాని అనుమతి కోసం మరోసారి రెన్యువల్ చేయాలని టానిక్ ఎలైట్ షాప్ యజమాని దరఖాస్తు చేసుకున్నారు. ఎక్సైజ్ చట్టం కు వ్యతిరేకంగా నడుస్తున్న టానిక్ ఎలైట్ షాపుకు రెన్యువల్ చేయకూడదని భావించిన ఎక్సైజ్ శాఖ దరఖాస్తును తిరస్కరించింది. ఆగస్టు 31 నాటికి టానిక్ ఎలైట్ షాపు కు అనుమతి ఉంది. సెప్టెంబర్ 1 నుంచి టానిక్ ఎలైట్ మద్యం దుకాణం నడపడం చట్టరీత్యా నేరం కావడంతో ఆదివారం దుకాణాన్ని సీజ్ చేశారు. టానిక్ ఎలైట్ మద్యం దుకాణాన్ని హైదరాబాద్ ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ శాస్త్రి , అసిస్టెంట్ కమిషనర్ అనిల్ కుమార్ రెడ్డి, జూబ్లీహిల్స్ సిఐ వాసుదేవరావు ఇతర ఎక్సైజ్ పోలీసులు కలిసి సీజ్ చేశారు. టానిక్ ఎలైట్ మద్యం దుకాణంలో 10,291 మద్యం బాటిళ్లు ఉన్నట్లు లెక్కించారు. ఈ మద్యం విలువ రూ.1.70 కోట్లు ఉంటుందని అంచనా వేశారు.

రోడ్ నెంబర్ 36 లో 2016 నుంచి నడుస్తున్న 'టానిక్ ఎలైట్' మద్యం షాపుని ఎట్టకేలకు ఆదివారం ఎక్సైజ్ అధికారులు సీజ్ చేశారు. ఎక్సైజ్ నిబంధనల మేరకు.. టానిక్

జర్నలిస్టుల సమస్యలు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తాం

త్వరలోనే సిఎం రేవంత్ రెడ్డితో జర్నలిస్టుల ఆత్మీయ సభ

ప్రజాపక్షం/సూర్యాపేట: హైదరాబాద్‌లో ఈ నెల చివరి వారంలో జర్నలిస్టుల ఆత్మీయ సభ నిర్వహించాలని తెలంగాణ వర్కింగ్ జర్నలిస్టుల సంఘం (టియుడబ్ల్యూజె) రాష్ట్ర కార్యవర్గ సమావేశం నిర్ణయించింది. సూర్యా పేట జిల్లా కేంద్రంలో రాష్ట్ర అధ్యక్షులు విరాహత్ అలీ అధ్యక్షతన ఆదివారం జరిగిన టియుడబ్ల్యూజె ఐజెయురాష్ట్ర మొదటి కార్యవర్గ సమావేశంలో జర్నలిస్టుల ఇళ్ల స్థలాలు, ఆరోగ్య పథకం వంటి అంశాలపై సమావేశంలో సుదీర్ఘంగా చర్చించి పలు నిర్ణయాలు తీసుకుంది. సమావేశానికి ఐజెయూ జాతీయ అధ్యక్షులు, తెలంగాణ రాష్ట్ర మీడియా అకాడమి చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి, యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామనారాయణ, మాజీ అధ్యక్షులు నగునూరు శేఖర్, ఐజెయు నాయకులు మాజిద్, కె. సత్యనారాయణలు హాజరయ్యారు.

రాష్ట్రంలో జర్నలిస్టులు ఎదుర్కొంటున్న పలు ప్రధాన సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకు వచ్చేందుకు రాష్ట్ర యూనియన్ ప్రతినిధి బృందం రాష్ట్ర ముఖ్యమంత్రి రేవ

శివాజీ విగ్రహం కూలడం క్షమించరానిది

మోదీ క్షమాపణలో అహంకారాన్ని చూశారా? : ఠాక్రే అవినీతికి నిదర్శనం ఆ ఘటన : శరద్ పవార్

ముంబయి : మహారాష్ట్రలో ఛత్రపతి శివాజీ మహారాజ్ విగ్రహం కూప్పకూలడాన్ని నిరసిస్తూ ఎన్‌సి పి (ఎస్‌పి) సుప్రీం శరద్ పవార్, శివసేన (యుబి టి) నేత ఉద్ధవ్ ఠాక్రే నేతృత్వంలోని ప్రతిపక్ష మహావికా అఘాడీ (ఎంవిఎ) ఆదివారం నిరసన ప్రదర్శ న నిర్వ హించింది. దక్షిణ ముంబయిలోని హుతా త్మ చౌక్ నుంచి గేట్‌వే ఆఫ్ ఇండియా వరకు విపక్ష నేతలు ర్యాలీ చేపట్టారు. మహారాష్ట్రలోని తీరప్రాం త జిల్లా సింధుదుర్గ్ జిల్లాలోని ఛత్రపతి శివాజీ మ హారాజ్ విగ్రహం గత నెల 26వ తేదీన కుప్పకూలి న విషయం తెలిసిందే. ఈ విగ్రహాన్ని 2023, డి సెంబరు 4వ తేదీన నేవీ డే సందర్భంగా ప్రారంభించారు. అయితే ఇప్పుడు ఆ విగ్రహం కూలడం వివాదాస్పద మైంది. ఈ ఘటనను నిరసిస్తూ ప్రతిపక్ష మహా వికాస్ అఘాడీ కూటమి ఆదివారం ముంబయిలో ఆందోళన చేపట్టింది. సందర్భంగా ప్రధాని మోదీ, మహారాష్ట్ర ప్రభుత్వంపై విపక్ష నేత లు తీవ్రంగా మండిపడ్డారు. విగ్రహం కూలడంపై ప్రధాని మోదీ ఇటీవల క్షమాప ణలు చెప్పడాన్ని ప్రస్తావిస్తూ మాజీ సిఎం ఉద్ధవ్ ఠాక్రే విమర్శలు గు ప్పించారు. 'ఆయన (మోదీని ఉద్దే శిస్తూ) క్షమాపణల్లో అహంకారాన్ని గుర్తించారా? అది ముమ్మాటికీ అహంకారమే. ఆయన క్షమాప ణలు చెబుతుంటే.. పక్కన నిల్చున్న ఉపముఖ్యమంత్రి ఒకరు నవ్వుతూ కన్పించారు. విగ్రహం కూలడాన్ని ఎప్పటికీ క్ష మించకూడదు. బిజెపిని భారత్ నుంచి వెళ్లి పోవాలని డిమాండ్ చేసేందుకు తాము ఈ ర్యాలీ నిర్వహించాం. విగ్రహం కూలడం అంటే మహారాష్ట్ర ఆత్మకు అవమానం జరిగినట్లే..! ఇందులో భారీ అవి నీతి జరిగింది' అని విమర్శించారు. శివాజీ విగ్రహం కూలడం, రామాలయం, కొత్త పార్లమెంట్ కాంప్లె క్స్‌లో లీకేజీలు ఇవే మోడీ ఇచ్చిన హామీలు అని ఠాక్రే ఎద్దేవా చేశారు. మోడీ ఎందుకు క్షమాపణలు చెబుతు న్నారు? 8 నెలల క్రితం ఆయన విగ్రహాన్ని ఆవిష్కరిం చినందుకా? అందులో భారీ కుంభకోణం జరిగినం దుకా? అని ఠాక్రే నిలదీశారు. శివాజీ మహారాజ్‌ను అవమానించిన శక్తులను ఓడించేందుకు ఎంవిఎ శ్రే ణులంతా కలిసి పనిచేయాలని ఠాక్రే పిలుపునిచ్చా రు. శివాజీ విగ్రహం కూలడం మహారాష్ట్ర ఆత్మను అ వమానించడమేనన్నారు. నిరసన ప్రదర్శనలో ప వార్ మాట్లాడుతూ సింధుదుర్గ్‌లో ఛత్రపతి శివాజీ మ హా రాజ్ విగ్రహం కూలడం అవినీతికి నిదర్శనమన్నా రు. ఇది శివప్రేమికులందరినీ (యోధ రాజు అనుచ రులు) అవమానించడమేన్నారు. కాంగ్రెస్ చీఫ్ నానా పటోలే మాట్లాడుతూ, 'శివద్రోహి' (ఛత్రప్రతి శివాజీ సూత్రాలకు ద్రోహం చేసేవారు) ప్రభు త్వం అధికా రంలోకి రావడానికి అనుమతించినందుకు ప్రధానికి కంటే ముందే ప్రతిపక్షాలు చక్రవర్తి నుండి క్షమాపణ లు కోరాయన్నారు. రానున్న రాష్ట్ర ఎన్నికలను దృ ష్టిలో ఉంచుకుని ప్రధాని క్షమాపణలు చెప్పారని పటే ల్ ఆరోపించారు. 'జోడే మారో ఆందోళన' (చెప్పుల తో కొట్టడం) సందర్భంగా ఠాక్రే శివసేన (యుబిటి), కాంగ్రెస్ నాయకులతో కలిసి ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ షిండే, డిప్యూటీ సిఎంలు దేవేంద్ర ఫడ్నవీస్, అజిత్ ప వార్‌ల పోస్టర్‌ను పాదరక్షలతో కొట్టారు. కొల్హాపూర్ కాంగ్రెస్ ఎంపీ షాహూ మాట్లాడుతూ ఛత్రపతి చక్ర వర్తి వారసుడు, చక్రవర్తి గౌరవాన్ని ఎట్టి పరిస్థితుల్లో నూ నిలబెట్టుకోవాలని అన్నా రు. ఎన్‌సిపి (ఎస్‌పి) అ ధినేత పవార్, శివసేన (యుబిటి) నాయకుడు ఠాక్రే, కాంగ్రెస్ రాష్ట్ర విభాగం చీఫ్ నానా పటోలే, ఆ పార్టీ ముంబయి అధినేత్రి వర్ష గై క్వాడ్‌లు 'సంయుక్త మహారాష్ట్ర'లో అమరులైన వారి స్మారక స్థూపం హుతాత్మా చౌక్ వద్ద పుష్పగుచ్ఛాలు ఉంచి నిరసన ప్రదర్శనను ప్రారంభించారు. ఉదయం 11 గంటల తర్వాత ప్రారంభమై మధ్యాహ్నం ముగిసిన మార్చ్‌లో ఎన్‌సిపి (ఎస్‌పి) బారామతి ఎంపి సుప్రియా సూలే, ఎమ్మెల్యే అనిల్ దేశ్‌ముఖ్‌లు పాల్గొన్నారు.

ప్రకాశం బ్యారేజీ వద్ద రెండో ప్రమాద హెచ్చరిక

విజయవాడ: ప్రకాశం బ్యారేజీ వద్ద వరద ఉధృతి గంట గంటకూ పెరుగుతోంది. ఎగువ నుంచి 9.18లక్షల క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతోంది. ఈ రోజు ఉదయం.. ఐదు లక్షల క్యూసెక్కులుగా ఉన్న ఇన్‌ఫ్లో రాత్రి 7గంటల సమయానికి 9లక్షల క్యూసెక్కులు దాటింది. ఇంత భారీ స్థాయిలో వరద రావడం కొన్ని దశాబ్దాల తర్వాత ఇదే మొదటిసారి. వరద ప్రవాహం మరింత పెరిగే అవకాశముందని అధికారులు అంచనా వేస్తున్నారు. ఈ రోజు రాత్రికి 9.30లక్షల వరకు దిగువకు నీరు విడుదలయ్యే అవకాశముందని చెబుతున్నారు. ప్రస్తుతం ప్రకాశం బ్యారేజీ వద్ద రెండో ప్రమాద హెచ్చరిక కొనసాగుతోంది. బ్యారేజీ 70 గేట్లను ఎత్తి 9.18 లక్షల క్యూసెక్కులు, కాలువల ద్వారా 500 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. భారీ వర్షాల కారణంగా పంట పొలాలన్నీ నీట మునగడంతో కాలువలకు తక్కువ నీటిని విడుదల చేస్తున్నారు. కృష్ణానది ఎగువ పరివాహక ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలకు తోడు స్థానికంగా ఉన్న వాగుల నుంచి కృష్ణానదికి వరదనీరు వచ్చి చేరుతోంది. వరద తీవ్రత పెరగడంతో కృష్ణా నది లంక గ్రామాల ప్రజలు బిక్కు బిక్కుమంటున్నారు. కృష్ణా జిల్లా అవనిగడ్డ నియోజకవర్గంలోని పలు లంక గ్రామాలు ఇప్పటికే నీట మునిగాయి. పులిగడ్డ, దక్షిణ చిరువోల్లంక, కె.కొత్తపాలెం, బొబ్బర్లంక, ఆముదార్లంక, ఎడ్లంక తదితర గ్రామాల బాధితులను పునరావాస కేంద్రాలకు తరలించారు.

జమ్ము కశ్మీర్‌లో యువతను మోసగించేందుకు బిజెపి కుట్ర

అసెంబ్లీ ఎన్నికల్లో యువత బిజెపికి బుద్ధి చెబుతుందని కాంగ్రెస్ చీఫ్ మల్లికార్జున్ ఖర్గే ఎద్దేవా

న్యూఢిల్లీ : రాబోయే ఎన్నిక లలో జమ్మూకశ్మీర్ యువ తను మోసగించాలన్న ఒకే ఒక విధానాన్ని బిజెపి అనుస రిస్తోందని, జమ్మూకశ్మీర్ లోని యువత కోసం తమ తలుపులు ఎప్పుడూ తెరిచే ఉంటాయని మభ్యపెడుతోన్న ప్రధానమంత్రి నరేంద్రమోదీ అండ్ కంపెనీకి అక్టోబర్ 1న ముగియనున్న ఎన్నికల నాటికి పెట్టేబేడా సర్దుకుని ఢిల్లీకి వెళ్లడం ఖాయమని కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే ఎద్దేవా చేశారు. జమ్మూకశ్మీర్ ఎన్నికల నేపథ్యంలో ఆయన ఆదివారంనాడు సామాజిమాధ్యమం 'ఎక్స్' వేదికగా విమర్శల బాణాలు సంధిం చారు. జమ్మూకశ్మీర్‌లో నిరుద్యోగ రేటు మార్చినుంచి 28.2శాతంతో తిష్టవేసిందని ఎద్దేవా చేశారు. గత నాలుగు సంవత్సరాల కాలంగా అనేక ప్రశ్నపత్రాలు లీక్‌లు, విచ్చల విడిగా లంచాలు, నానాటికీ పెరిగిపోతోన్న అవినీతి, బిజెపి ప్రభుత్వ అనాలోచిత విధా నాల కారణంగా 2019నుంచి జమ్మూకశ్మీర్ లోని ప్రభుత్వ డిపార్ట్‌మెంట్లలో 65శాతం పోస్టులు ఖాళీగా ఉన్నాయని కాంగ్రెస్‌పార్టీ చీఫ్ మల్లికార్జున్ ఖర్గే ఆరోపించారు. 15ఏ ళ్లుగా జమ్మూకశ్మీర్‌లో ప్రభుత్వ దినసరి వేత నకార్మికులు 60వేల మందికి పైగా పనిచేస్తు న్నారని, వారి కష్టానికి ప్రతిఫలంగా రోజుకు 300రూపాయలు మాత్రమే చెల్లించడం మోసగించడం కాదా అని ఖర్గే ప్రశ్నించారు. వారు సుదీర్ఘకాలంగా సేవలు అందిస్తున్నప్పటికీ వారిని ఇంకా కాంట్రాక్ట్ పద్ధతిలోనే విద్యుత్, ప్రజారోగ్యం, ఇంజినీ రింగ్ డిపార్ట్‌మెంట్లలో వినియో గించుకుంటున్నారని దుయ్యబ ట్టారు. ఉద్యోగ సంక్షోభాన్ని సృష్టి స్తూ వారి జీవితాలతో చెలగాటమాడు తున్నారని ఆరోపించారు. ప్రైవేట్ రంగం వ్యవసాయం, ఆతిథ్యం, ఆరోగ్య రంగాలకు మాత్రమే తన సేవలను పరిమితం చేసిందని ఖర్గే తెలిపారు. 2021 సంవత్సరంలో ప్రవేశ పెట్టిన నూతన పారిశ్రామిక విధానం ప్రకారం క్షేత్రస్థాయిలో దాదాపు 3శాతం పెట్టుబడులు మాత్రమే కార్యరూపం దాల్చా యని, ప్రధానమంత్రి అభివృద్ధి ప్యాకేజీ కింద 40శాతం ప్రాజెక్ట్‌లు ఇంకా పెండింగ్‌లోనే ఉన్నాయని తెలిపారు. నరేంద్రమోదీఅ ండ్ కంపెనీ తలుపులు మూసుకుని నిష్కమిం చేలా జమ్మూకశ్మీర్ యువత అక్టోబర్ 1న జరుగనున్న ఎన్నికలలో గట్టి గుణపాఠం చెప్పనున్నారని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికా ర్జున్‌ఖర్గే వివరించారు. 90అసెంబ్లీ స్థానా లున్న జమ్మూకశ్మీర్ లో మూడు విడతలుగా ఎన్నికలు జరుగనున్నాయి. సెప్టెంబర్ 18 మొదటి విడత, సెప్టెంబర్ 25న రెండో విడత, అక్టోబర్ 1న మూడోవిడత ఎన్నికలు జరుగనున్నాయి. అక్టోబర్ 8వ తేదీన జమ్మూకశ్మీర్ అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు వెలువడనున్న విషయం విదితమే.

జస్టిస్ హేమ కమిటీ రిపోర్ట్‌ను స్వాగతిస్తున్నా

ప్రముఖ మలయాళ నటుడు మమ్ముట్టి

తిరువనంతపురం : హేమ కమిటీ రిపోర్ట్ గత కొన్నిరోజులుగా మలయాళ చిత్ర పరిశ్రమను కుదిపేస్తోన్న విషయం తెలిసిందే. ఈ నివేదికను ఉద్దేశించి ప్రముఖ మలయాళ నటుడు మమ్ముట్టి స్పందించారు. తాజాగా ఆయన ఫేస్‌బుక్‌లో పోస్ట్ పెట్టారు. షూటింగ్ ప్రదేశాల్లో మహిళలకు సురక్షిత వాతావరణం కలిగించేందుకు నివేదికలో చేసిన సూచన లను స్వాగతిస్తున్నా అని తెలిపారు. ఇలాంటి ఘటనలు భవిష్యత్తులో జరగకుండా చేయాల్సిన బాధ్యత అందరికీ ఉందన్నారు. 'సెట్‌లో మహిళలకు ఇబ్బందికర ఘటనలు ఏమీ జరగకుండా దర్శక నిర్మాతలు జాగ్రత్తలు తీసుకో వాలి. సినీ పరిశ్రమ గురించి అధ్యయనం చేసి, నివేదికను సిద్ధం చేసి, పరిష్కారాలను సూచించడానికి ప్రభుత్వం జస్టిస్ హేమ కమిటీని ఏర్పాటు చేసింది. మహిళలకు ఇలాంటి పరిస్థితులు ఎదురు కాకుండా ఉండేలా ఆ నివేదికలో పేర్కొన్న సూచనలు, పరిష్కారాలను హృదయపూర్వకంగా స్వాగతిస్తున్నా. వాటిని అమలు చేసేందుకు చిత్ర పరిశ్రమలోని అన్ని అసోసియేషన్స్ ఏకతాటిపైకి రావాల్సిన సమయం ఆసన్నమైంది. తాజాగా అందిన ఫిర్యాదులపై పోలీసుల విచారణ ముమ్మరంగా కొనసాగుతోంది. జస్టిస్ హేమ కమిటీ నివేదిక పూర్తి వెర్షన్ కోర్టు ముందు ఉంది. దర్యాప్తు జరగనివ్వండి. నిందితులకు తగిన శిక్షలను న్యాయస్థానం నిర్ణయిస్తుంది. సినీ పరిశ్రమలో 'పవర్ సెంటర్' అనేది లేదు. అంతిమంగా సినిమా అనేది బతకాలి'' అని మమ్ముట్టి పేర్కొన్నారు. మలయాళ చిత్ర పరిశ్రమలో మహిళలు ఎదుర్కొంటున్న ఇబ్బందికర పరిస్థితులను తెలియజేస్తూ జస్టిస్ హేమ కమిటీ ఒక నివేదికను ప్రభుత్వానికి సమర్పించింది. ప్రస్తుతం ఇది అంతటా చర్చనీయాశంగా మారింది. దీనిపై మలయాళ చిత్రపరిశ్రమకు చెందిన అగ్ర నటులు స్పందించకపోవడాన్ని పలువురు తప్పుబట్టారు. ఈ క్రమంలోనే శనివారం అగ్ర నటుడు మోహన్‌లాల్ స్పందించారు. 'అమ్మ' అనేది ఒక ట్రేడ్ యూనియన్ కాదు. ఒక కుటుంబం లాంటిది. పరిశ్రమను సరైన దిశలో నడిపించడానికి ఎన్నో మంచి పనులు చేశాం. ప్రస్తుతం వస్తోన్న ఆరోపణల దృష్ట్యా కేవలం 'అమ్మ' సంఘాన్ని మాత్రమే లక్ష్యంగా చేసుకోవద్దు. హేమ కమిటీకి సంబంధించిన ప్రతి ప్రశ్నకు మొత్తం సినీపరిశ్రమ సమాధానం చెప్పాలి. మహిళలను వేధించిన దోషులను కచ్చితంగా చట్టం ముందు నిలబెట్టాలి. అందుకు పోలీసులకు సహకరిస్తాం. పరిశ్రమ ఎంతో మందికి జీవనోపాధిని కల్పిస్తోంది. నేను ఏ వర్గానికి సంబంధించిన వ్యక్తిని కాదు. పలువురిపై వచ్చిన ఆరోపణల గురించి దర్యాప్తు జరుగుతోంది. అందరినీ నిందిస్తూ.. పరిశ్రమను నాశనం చేయకండి'' అని హితవు పలికారు.

వయనాడ్‌లో పర్యాటకాన్ని పునరుజ్జీవింపజేసేందుకు కృషి

ప్రతిపక్షనేత రాహుల్‌గాంధీ పిలుపు

న్యూఢిల్లీ : ఇటీవలి కేరళలోని వయనాడ్‌లో కొండచరియలు విరిగిపడిన నేపథ్యంలో పర్యాటకాన్ని పునరుజ్జీవింపజేసేందుకు, ఆ ప్రాంతాన్ని సందర్శించేలా ప్రజలను ప్రోత్సహించడం అత్యవసరమని లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ ఆదివారం అన్నారు. కొంతమంది కేరళ కాంగ్రెస్ నాయకులు, కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ప్రియాంక గాంధీ వాద్రాతో జరిగిన వర్చువల్ సమావేశంలో రాహుల్ ఈ ప్రకటన చేశారు. వయనాడ్‌లో సహాయ, పునరావాస యత్నాలపై ఆన్‌లైన్ సమావేశం వీడియో క్లిప్ రాహుల్ ఎక్స్‌లో పోస్టు చేశారు. విషాదకరమైన కొండచరియలు విరిగిపడటం వలన సంభవించిన విధ్వంసం నుండి వయనాడ్ క్రమంగా కోలుకుంటున్నట్లు చెప్పారు. 'ఇంకా చాలా చేయాల్సి ఉందని, అన్ని సంఘాలు, సంస్థల నుండి ప్రజలు సహాయక చర్యలలో కలిసి రావడం సంతోషదాయకమన్నారు. వయనాడ్ ప్రజలకు గొప్పగా సహాయపడే ఒక కీలకమైన అంశాన్ని తాను లేవనెత్తాలనుకుంటున్నానన్నారు. టూరిజం. వర్షాలు ఆగిపోయిన తర్వాత, ఈ ప్రాంతంలో పర్యాటకాన్ని పునరుజ్జీవింపజేయడానికి, ప్రజలు సందర్శించేలా ప్రోత్సహించడానికి గట్టి ప్రయత్నం చేయడం అత్యవసరం రాహుల్ అన్నారు. 'వయనాడ్ ఒక అద్భుతమైన గమ్యస్థానంగా మిగిలిపోయింది. గతంలో మాదిరిగానే అందమైన వయనాడ్‌లో ఉన్న మన సోదర సోదరీమణులను ఆదుకునేందుకు మరోసారి కలిసి రావాలని ఆయన పిలుపునిచ్చారు. సమావేశంలో రాహుల్ మాట్లాడుతూ, పర్యాటకాన్ని ప్రోత్సహించడానికి ఇది సురక్షితమైన ప్రదేశం కాదనే భావనను తొలగించడం చాలా ముఖ్యమని, ఎందుకంటే ఇది 'ప్రమాదకరమైన ప్రదేశం' అని ప్రజలు భావిస్తే అది వయనాడ్ బ్రాండ్‌ను దెబ్బతీస్తుందన్నారు. మనం ఒత్తిడి తీసుకురావాల్సిన నాలుగైదు అంశాలు ఉన్నాయని, ఉపశమనం, పునరావాసంపై శాఖల మధ్య సమన్వయం, సరిపోని పరిహారం, తాను లేవనెత్తిన అద్దె సమస్య, చాలా మంది జీవనోపాధి కోల్పోవడం, చివరకు పర్యాటకంపై ప్రభావం వంటివి ఉన్నాయన్నారు.

ఆగస్టులో రూ. 1.75 లక్షల కోట్లు జిఎస్‌టి వసూళ్లు

న్యూఢిల్లీ : దేశంలో గత నెలకు సంబంధించిన వస్తు, సేవల పన్ను (జిఎస్‌టి) వసూళ్ల వివరాలను కేంద్రం వెల్లడించింది. ఆగస్టు మాసానికి రూ.1.75 లక్షల కోట్లు వసూళ్లు జరిగినట్లు పేర్కొంది. గతేడాది ఇదే నెలలో రూ.1.59 లక్షల కోట్ల వసూళ్లు నమోదవ్వగా.. అప్పటితో పోలిస్తే ఈసారి 10 శాతం మేర పెరగడం గమనార్హం. జులై మాసంలో రూ.1.82లక్షల కోట్ల మేర జీఎస్టీ వసూళ్లు వచ్చాయని తెలిపింది. ఆగస్టులో దేశీయ వ్యాపార కార్యకలాపాల ద్వారా స్థూల జిఎస్‌టి వసూళ్లు 9.2శాతం పెరిగి రూ.1.25 లక్షల కోట్లకు చేరాయి. దిగుమతుల ద్వారా జిఎస్‌టి ఆదాయం 12.1శాతం మేర పెరగడంతో రూ.49,976 కోట్లకు చేరింది. ఆగస్టులో రూ.24,460 కోట్ల విలువైన రీఫండ్‌లు జారీ అయ్యాయనీ.. గతేడాదితో పోలిస్తే ఇది 38 శాతం పెరుగుదల నమోదైనట్లు పేర్కొంది.

కోల్‌కతాలో పలు నిరసన ర్యాలీలు

రేపిస్టులకు ఉరిశిక్ష బిల్లుపై నేడు అసెంబ్లీ మీట్

కోల్‌కతా : ఆర్.జి.కార్ వైద్యకళాశాల–ఆసుపత్రిలో ఆగస్టు 9న విధి నిర్వహణలో ఉన్న వైద్యశిక్షణార్థి అభయపై అత్యాచారం, హత్య ఘటనపై కోల్‌కతాలో నిరసనలు కొనసాగుతున్నాయి. ఆదివారంనాడు కూడా కోల్‌కతా నగరంలో అనేక ప్రదర్శనలు జరిగాయి. బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని, నేరస్థులను శిక్షించాలనీ, వైద్య సిబ్బంది రక్షణకు ప్రత్యేక చట్టం రూపొందించాలని కోరుతూ పలు ర్యాలీలు జరిగాయి. ఆదివారం మధ్యాహ్నం కోల్‌కతా స్క్వేర్ నుండి సెంట్రల్ కోల్‌కతాలోని ఎన్‌ప్లనేడ్ వరకూ ''మహా మిచ్ఛి' (భారీ ర్యాలీ) నిర్వహించారు. సోషల్ మీడియా ద్వారా ఈ ర్యాలీకి వేలాదిగా జనసమీకరణ చేశారు. ఇది రాజకీయేతర ర్యాలీ అని నిర్వాహకులు చెప్పారు. అధికారపార్టీ తృణమూల్ కాంగ్రెస్ సహా ప్రతిపక్ష బిజెపి, వైద్యుల సంఘాలు, విద్యార్థులు కోల్‌కతా నగర వ్యాప్తంగా విభిన్నమైన డిమాండ్లతో పలు ర్యాలీలు నిర్వహించారు. రేపిస్టులకు ఉరిశిక్ష విధించే చట్టంలో సవరణలు చేయాలని ప్రదర్శకులు డిమాండ్ చేశారు. నేరస్తులనుశిక్షించాలని కోరుతూ ఆగస్టు 29న బిజెపి ప్రారంభించిన బైఠాయింపు నిరసన కార్యక్రమాలు ఆదివారంనాడు కూడా కొనసాగాయి. పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ ఈ అత్యాచారం, హత్య ఘటనకు బాధ్యత వహించి తన పదవికి రాజీనామా చేయాలని ప్రదర్శకులు అందరూ కోరుతున్నారని కేంద్ర మంత్రి, బిజెపి బెంగాల్ రాష్ట్ర అధ్యక్షుడు సుకాంత మజుందార్ తొలుత చెప్పారు.సోమవారంనాడు పశ్చిమ బెంగాల్ ప్రభుత్వం ఈ సమస్యపై ప్రత్యేకంగా అసెంబ్లీ సమావేశం ఏర్పాటు చేసింది. నేరం రుజువైన కేసుల్లో రేపిస్టులకు ఉరిశిక్ష విధించాలని కోరుతూ పశ్చిమ బెంగాల్ ప్రభుత్వం ఒక బిల్లును ఆమోదించడంకోసం సోమవారంనాడు ప్రత్యేకంగా అసెంబ్లీ సమావేశం నిర్వహిస్తున్నది. ఇంతకుముందు శనివారంనాడు కూడా కోల్‌కతాలో చదివిన వివిధ పాఠశాలలు, కళాశాలల పూర్వవిద్యార్థులు కూడా భారీ ప్రదర్శనలు చేశారు. ర్.జి.కార్ వైద్యకళాశాల–ఆసుపత్రిలో పోస్టుగ్రాడ్యుయేట్ శిక్షణార్థి హత్య, ఆమెపై అత్యాచార ఘటన దేశవ్యాపంగా సంచలనం సృష్టించడమే కాకుండా అంతర్జాతీయ మీడియా కూడా ఈ ఘటనపై ప్రత్యేకంగా నెలరోజులుగా దృష్టి కేంద్రీకరించి వార్తా ప్రస్తారాలు చేస్తున్నది.

ఐఎఎస్ అకాడమీకి రూ.5లక్షల జరిమానా

న్యూఢిల్లీ : సివిల్స్ పరీక్షల శిక్షణా సంస్థ శంకర్ ఐ ఎఎస్ అకాడమీకి జరిమానా పడింది. 2022 సివి ల్ సర్వీస్ పరీక్షకు సంబంధించి తప్పుదోవ పట్టిం చే ప్రకటనలు చేసినందుకు గానూ కేంద్ర వినియోగదారుల భద్రత సంస్థ (సిసిపిఎ) చర్యలు చేపట్టింది. ఈ అకాడమీకి రూ.5లక్షల జరిమానా విధించింది. తమ సక్సెస్ రేటు, సివిల్స్‌లో ఉత్తీర్ణత సా ధించిన అభ్యర్థులు తీసుకున్న కోర్సుల గురించి ఈ కోచింగ్ ఇనిస్టిట్యూట్ తప్పుడు ప్రకటనలు చే సిందని సిసిపిఎ గుర్తించింది. 2022 యుపిఎస్‌సి సివిల్ సర్వీస్ పరీక్ష కోసం శంకర్ ఐఎఎస్ అకాడ మీ ఓ యాడ్ ఇచ్చింది. అందులో ఆల్‌ఇండియా లెవల్‌లో ఎంపికైన 933 మందిలో 336 మంది త మ అకాడమీలో శిక్షణ తీసుకున్నట్లు పేర్కొంది. ఇ క, టాప్ 100లో తమ ఇనిస్టిట్యూట్ నుంచి 40 మంది అభ్యర్థులు ఉన్నట్లు ప్రచురించింది. దేశంలోనే ఉత్తమ ఐఏఎస్ అకాడమీ తమదేనంటూ ప్రకటనలో రాసుకుంది. దీనిపై ఫిర్యాదులు రావడం తో సిసిపిఎ దర్యాప్తు జరిపింది. శంకర్ ఐఎఎస్ అ కాడమీ ఉద్దేశిపూర్వకంగా ఆ ప్రకటన ఇచ్చినట్లు తెలిసింది. ఉత్తీర్ణత సాధించిన అభ్యర్థులు తీసుకు న్న కోర్సులను ఇనిస్టిట్యూట్ దాచిపెట్టినట్లు తేలింది. ఈ అకాడమీ నుంచి ఉత్తీర్ణత సాధించినట్లుగా చెబుతున్న 336 మందిలో 221 మంది.. కేవలం ఉచిత ఇంటర్వ్యూ గైడెన్స్ ప్రోగ్రామ్‌ను మాత్రమే తీసుకున్నారని దర్యాప్తులో వెల్లడైంది. మిగతావా రు కూడా షార్ట్‌టర్మ్ కోచింగ్‌కు తీసుకున్నవారేనని తెలిసింది. దీంతో ఈ వ్యవహారాన్ని సిసిపిఎ తీవ్రం గా పరిగణించింది. మన దేశంలో ఏటా 10లక్షల మందికి పైగా సివిల్స్ పరీక్షలకు హాజరవుతున్నార ని, ఇలాంటి తప్పుదోవ పట్టించే ప్రకటనలు వారి పై ప్రభావం చూపిస్తాయని పేర్కొంది. అందువల్ల ఈ అకాడమీకి రూ.5లక్షల జరిమానా విధిస్తున్న ట్లు వెల్లడించింది. ఈ అకాడమీ ప్రధాన కార్యాల యం చెన్నైలో ఉండగా.. దేశవ్యాప్తంగా అనేక రాష్ట్రాల్లో దీనికి కోచింగ్ సెంటర్లు ఉన్నాయి.

అసోం టిఎంసి అధ్యక్షుడు రాజీనామా

గువహటి : తృణమూల్ కాంగ్రెస్ (టిఎంసి) పార్టీకి అసోంలో ఎదురుదెబ్బ తగిలింది. అసోం టిఎంసి పార్టీ అధ్యక్షుడు రిపున్ బోరా ఆదివారం పార్టీకి రాజీనామా చేశారు. అసోం ప్రజలు టిఎంసి పశ్చిమ బెంగాల్‌లోని 'ప్రాంతీయ పార్టీ'గా పరిగణిస్తున్నారని, కానీ అసోంలో తమ పార్టీగా అంగీకరించడానికి ఇష్టపడటం లేదని ఆయన అన్నారు. అంతేకాదు అసోంలో టిఎంసికి ఆమోదయోగ్యంగా ఉండాలని పార్టీ అధినేత్రి, పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీకి పలు సూచనలు చేశామని గుర్తు చేశారు. అయినప్పటికీ వాటిపై ఎలాంటి చర్యలు తీసుకోలేదని తృణమూల్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి అభిషేక్ బెనర్జీకి రాసిన లేఖలో రిపున్ బోరా స్పష్టం చేశారు. టిఎంసి జాతీయ స్థాయిలో అస్సామీ నేతను చేర్చుకోవాలని, కోల్‌కతాలోని టోలీగంజ్‌లోని భారతరత్న డాక్టర్ భూపేన్ హజారికా నివాసాన్ని వారసత్వ ప్రదేశంగా ప్రకటించాలని కోరినట్లు తెలిపారు. కూచ్ బెహార్‌లోని మధుపూర్ సత్రాన్ని సాంస్కృతిక కేంద్రంగా మార్చాలని కూడా సూచించినట్లు తెలిపారు. ఈ సమస్యలను పరిష్కరించేందుకు గత ఏడాదిన్నర కాలంగా అభిషేక్ బెనర్జీ, మమతా బెనర్జీలను కలవాలని ప్రయత్నించినా సఫలం కాలేదని రిపున్ బోరా తెలిపారు. రెండేళ్లకు పైగా టిఎంసి రాష్ట్ర అధ్యక్షుడిగా ఉన్న ఆయన ఈ సమయంలోనే రాష్ట్రవ్యాప్తంగా ప్రజలతో సత్సంబంధాలు ఏర్పరచుకుంటున్నారు. ఈ నేపథ్యంలో కొన్ని పునరావృత సమస్యలు మా పురోగతికి ఆటంకం కలిగిస్తున్నాయన్నారు. మాజీ రాజ్యసభ సభ్యుడు, అసోంలో టిఎంసికి ఆమోదయోగ్యంగా ఉండాలని పార్టీ అధిష్టానానికి, పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీకి అనేక సూచనలు ఇచ్చామన్నారు. కానీ అవి కూడా అమలు కాలేదని చెప్పారు. తాను రెండేళ్లకు పైగా అసోం టిఎంసి రాష్ట్ర అధ్యక్షుడిగా పనిచేశానని, ఈ కాలంలో రాష్ట్రవ్యాప్తంగా ప్రజలతో విస్తృతంగా సంభాషించానని చెప్పారు. దురదృష్టవశాత్తూ అనేక అంశాల పెండింగ్ నేపథ్యంలో అసోంలోని చాలా మంది ప్రజలు టిఎంసిని పశ్చిమ బెంగాల్ ప్రాంతీయ పార్టీగా చూడడానికి దారితీశాయన్నారు. ఈ క్రమంలో అసోం ప్రజలు వేరే రాష్ట్రానికి చెందిన పార్టీని అంగీకరించడానికి ఇష్టపడటం లేదన్నారు. అనేక సవాళ్లకు తగిన పరిష్కారం లేకపోవడంతో తాను ఈ కఠినమైన నిర్ణయం తీసుకోవలసి వచ్చిందన్నారు.

దేశం గర్వించేలా చేశారు.. మోదీ

న్యూఢిల్లీ : పారిస్‌లో జరుగుతున్న పారాలింపిక్స్‌లో ఇప్పటి వరకు పతకాలు సాధించిన భారత అథ్లెట్లతో ప్రధాని నరేంద్ర మోదీ ఆదివారం టెలిఫోన్‌లో మాట్లాడారు. ఈ సందర్భంగా పతకాలు సాధించిన ప్రతి ఒక్కరినీ ప్రధాని మోదీ అభినందించారు. మనీశ్ నర్వాల్, మోనా అగర్వాల్, ప్రీతి పాల్, రుబీనా ఫ్రాన్సిస్‌తో ప్రధాని ముచ్చటించారు. మంచి ప్రదర్శన కనబర్చి దేశం గర్వించేలా చేశారని ప్రశంసించారు. షూటింగ్‌లో స్వర్ణం సాధించిన అవని లేఖరా ప్రధాని ఫోన్ చేసిన సమయంలో అందుబాటులో లేదు. అప్పుడామె మరో పోటీలో పాల్గొనడం వల్ల ప్రధానితో మాట్లాడలేకపోయింది. అవని లేఖరా రాబోయే పోటీల్లో విజయాలు సాధించాలని నరేంద్ర మోదీ ఆకాంక్షించారు. పారిస్ పారాలింపిక్స్‌లో భారత్ ఇప్పటి వరకు ఐదు పతకాలు సాధించగా అందులో ఒక స్వర్ణం ఉంది. మహిళల 10 మీటర్ల ఎయిర్ రైఫిల్ స్టాండింగ్ ఎస్‌హెచ్1 ఈవెంట్‌లో అవని లేఖరా భారత్‌కు బంగారు పతకాన్ని సాధించగా, మోనా అగర్వాల్ అదే ఈవెంట్‌లో కాంస్యం సాధించింది. పురుషుల 10 మీటర్ల ఎయిర్ పిస్టల్ ఎస్‌హెచ్1 ఈవెంట్‌లో మనీశ్ నర్వాల్ రజత పతకాన్ని గెలుచుకున్నాడు. అథ్లెటిక్స్ మహిళ

సాహితీ విహారి

మానవతా వాదానికి చిరుమానా గౌరీ లంకేశ్

మతం ఓ విశ్వాసం.. వ్యక్తిగతం. కానీ మత మౌఢ్యం భయానకం.. ప్రమాదకరం. మతతత్వానికి అధికారం అండగా నిలిస్తే, ప్రశ్నించే గొంతుకలను నులిమేస్తారు. వాస్తవాలను వెలికితీస్తే, నిలువుపాతరలు వేస్తారు. అలాంటి అరాచక పాలన కొనసాగినంత కాలం ప్రజాస్వామ్యం అపహాస్యమవుతుంది. మతోన్మాదం కదం తొక్కుతుంది. మత విద్వేషం వెర్రితలలు వేస్తుంది. ప్రజాస్వామ్యం ముసుగులో నిరంకుశ పాలన నడుస్తుంది. నిజాన్ని నిజమని చెప్పేవారిపై దాడులు చేస్తారు. మరీ అడ్డంకి అనుకుంటే, హత్య చేస్తారు. జర్నలిస్టుగా తాను నమ్మిన సిద్ధాంతాలకు కట్టుబడి, వృత్తి ధర్మాన్ని కొనసాగించే క్రమంలో, సామాజిక రుగ్మతలపై కలాన్ని ఝుళిపించిన నేరానికి గౌరి లంకేశ్ హత్యే ఇందుకు నిదర్శనం. ఆఫిపత్య శక్తులను ప్రశ్నించడం ఆమె చేసిన నేరం. అప్రజాస్వామిక విధానాలను విమర్శించడం ఆమె చేసిన ఘోరం. కోట్లాది మందిలో తానూ కలిసిపోయి, జీవచ్ఛవంగా బతికేస్తే, ఎన్ని పురస్కారాలు దక్కేవో? ఎన్ని అవార్డులు వరించేవో? ఎన్ని సత్కారాలు... ఎన్ని బిరుదులు... కానీ, అలాంటి జీవితాన్ని గౌరి కోరుకోలేదు. కళ్ల ముందు జరుగుతున్న ఘోరాలను చూసికూడా చూడనట్టు నటించలేదు. కళ్లు మూసుకొని ముందుకు సాగలేదు. తన వ్యాసాల్లో తప్పులను ఎత్తిచూపింది. తన రచనలతో పితృస్వామ్య వ్యవస్థపై తిరుగుబాటు బావుటా ఎగురవేసింది. బెదిరింపులకు బెదరలేదు. ఆశలకు లొంగలేదు. ప్రజాస్వామ్య దేశంలో భావ వ్యక్తీకరణ తప్పుకాదని త్రికరణ శుద్ధిగా నమ్మింది. 'నా దేశంలో నాకేం భయం' అనుకుందో ఏమోగానీ, భయపడి ఎక్కడికీ పారిపోలేదు. దొంగలా ఎక్కడో దాక్కోలేదు. నిర్భయంగా నలుగురి మధ్య తిరిగింది. తనపై కక్ష

కట్టిన మానవ మృగాలు నిత్యం గమనిస్తునే ఉంటాయని, అదను దొరికితే దాడి చేస్తాయని తెలిసినా జంకలేదు. గౌరి అంత నిర్భయంగా ఉంది కాబట్టే, ఆమె తన ఇంటి గేటు ముందే హత్యకు గురైంది. మతవాదం తత్కాలికంగా గెలిచింది. స్వాతంత్ర్యం సిద్ధించి దశాబ్దాలు గడుస్తున్నా, సామాన్యుడి బతుకు చిత్రం ఎందుకు మారలేదన్న ఆలోచన ఆమెను నిరంతరం తొలిచివేసేది. రాజకీయ పార్టీలు ఎప్పటికప్పుడు ఏకరువుపెట్టే కొత్త హామీలను నమ్మింది. అదే సమయంలో, వారు నమ్మకద్రోహం చేస్తే నిలదీసింది. ప్రజాస్వామ్యం, స్వేచ్ఛ, సంక్షేమం, అభివృద్ధి, సమ సమాజం, సమన్యాయం వంటి ఎన్నో పదాలు కేవలం ఉపన్యాసాలకు, ప్రకటనలకు, హామీలకు మాత్రమే పరిమితం కావడాన్ని గౌరి సహించలేకపోయింది. రచయిత్రిగా, జర్నలిస్టుగా ఆమె ఊహించుకున్న స్వతంత్ర భారత దేశం వేరు. కళ్ల ముందు కనిపిస్తున్న దేశ రూపం వేరు. తరాలు మారుతున్నా పేదల తలరాతలు ఎందుకు మారడంలేదని పాలకులను ప్రశ్నించింది. అమలుకాని హామీలు ఎందుకని నిలదీసింది. మనసు స్వచ్ఛంగా ఉంది కాబట్టే, ఆమె మాటల్లో వాడి తగ్గేది కాదు. చేష్టల్లో వేడి చల్లారేదికాదు. మహాత్మగాంధీ ఆశించిన దేశాన్ని ఆమె కలలు కన్నది. బిఆర్ అంబేద్కర్ రాజ్యాంగం ద్వారా చూపి మార్గంలో దేశం అభ్యుదయ పంథాలో అభివృద్ధి సాధిస్తుందని విశ్వసించింది. వారి రచనలతో ప్రేరణ పొందింది. దేశం ఎలా ఉండాలో ఊహించుకుంది. ప్రజలను కాయడానికే పాలకులుగానీ, పాలకులను మోయడానికి ప్రజలు లేరని నమ్మింది. దేశాన్ని అంతగా ప్రేమించబట్టే, కులం, మతం, ప్రాంతం పేరుతో చీలికలుపేలికలు కావడాన్ని జీర్ణించుకోలేకపోయింది. మూలాల నుంచే సమస్యను పెకళించేందుకు తనవంతు కృషిగా పెన్నునే ఆయుధంగా చేసుకుంది. పోరాడింది. లౌకిక వాదాన్ని బలంగా వినిపించింది. ప్రజాస్వామ్య మనుగడను గట్టిగా కోరుకుంది. ప్రజాపక్షం వహించి, పాలక, ఆధిపత్య శక్తులకు వ్యతిరేకంగా నిలబడింది. ఆమె సీనియర్ జర్నలిస్టు.. ఆపై ప్రజస్వామ్య పరిరక్షణ ఉద్యమకర్త. భావాలను కలం నిం డా.... ధిక్కారాన్ని మనసు నిండా నింపుకున్న మేధావి. కోట్లాది మంది ప్రజల ఆశలకు, ఆకాంక్షలకు ఆశాజ్యోతి. విలువలతో కూడిన సమాజాన్ని కోరుకున్న స్వాప్నికురాలు. పేదరికంతో బక్కచిక్కి, జీవచ్ఛవాల్లా బతుకుతున్న నిరుపేదల ప్రతినిధి. నిజం నిగ్గుతేలే వరకూ... దోపిడికి తెరపడేవరకూ.. సామాన్యుడి జీవితంలో వెలుగులు నిండేవరకూ విశ్రమించేది లేదని కంకణం కట్టుకున్న ఉద్యమకారిణి గౌరి. మానవతావాదానికి చిరునామా ఆమె. గౌరిని హత్య చేసిన మత మౌఢ్యం తన వికృత రూపాన్ని ప్రదర్శించుకుంది. ఆమెను బతుకను చిదిమేసినా, లక్షలాది గొంతుకలై ఆమె నిత్యం అన్యాయాలకు, అక్రమాలకు వ్యతిరేకంగా పోరాడుతునే ఉంటుంది.

– సత్యశ్రీ

అరుదైన ఫొటో

నేను కేవలం నామవాచకాన్ని కాదు... నేను ఓ క్రియను. నిత్య చలనం నా లక్షణం. మీరు ఎలా ఉండాలనుకుంటున్నారో మీకు తెలిస్తే, మీరు అనివార్యంగా మారతారు. ఫలానా విధంగా ఉండాలనుకోవడం ఒక రకంగా మీకు శిక్ష. అలాంటి ఆలోచన ఏదీ లేకపోతే, మీరు ఏమైనా కావచ్చు.. అది నిజం. అందుకే, సంకెళ్లు బిగించుకోకుండా, స్వేచ్ఛగా ఉండండి. మనిషి అంటే కేవలం నామవాచమో లేదా సర్వనామమో కాదు.. మనిషి ఒక నిరంతర చైతన్యంతో కూడిన సమగ్ర రూపం. నన్ను నేను ఏదో ఒక చట్రంలో ఇరికించుకోలేదు. నేను రాస్తాను. నటిస్తాను. తర్వాతి క్షణంలో ఏమి చేస్తానో నాకే తెలియదు. ఎప్పటికప్పుడు కొత్తతనాన్ని వెతుక్కుంటూ, నాకు నచ్చిన విధంగా బతుకుతూ, స్వేచ్ఛాజీవిగా ఉండడమే నాకు ఇష్టం. మీరు నన్ను ఒక నామవాచకంగా భావిస్తే పొరపాటు పడినట్టే అనుకోవాలి. మిమ్మల్ని మీరు అలా అనుకుంటే, మీరు సమాజంలోగాక, జైల్లో ఉన్నారని అర్థం

– ఆస్కార్ వైల్డ్

చరిత్రాత్మక గ్రంథాలయం

బెంగళూరు శివాజీ నగర్‌లోని ముస్లిం లైబ్రరీకి 110 సంవత్సరాల గొప్ప చరిత్ర ఉంది. 20వ, రెండవ దశాబ్దం ప్రారంభంలో, ఉర్దూ భాషను ప్రోత్సహించడానికి, ముస్లింలలో విద్యా అవగాహనను పెంపొందించడానికి బెంగళూరు నగరంలో మేధావులు, శ్రేయోభిలాషులచే 1912, మే 5న బెంగుళూరులో ముస్లిం లైబ్రరీని నెలకొల్పారు. 1929 జనవరిలో, ప్రముఖ కవి అల్లామా డాక్టర్ ముహమ్మద్ ఇక్బాల్ గౌరవార్థం ముస్లిం లైబ్రరీ పెద్దలు కవి అల్లామా ఇక్బాల్‌కు ప్రశంసా పత్రాన్ని అందజేశారు, 'ఇక్బాల్ ఫండ్' పేరుతో ముస్లిం లైబ్రరీ సభ్యులు డబ్బు సేకరించారు. ముస్లిం లైబ్రరీ వ్యవస్థాపక వార్షికోత్సవం 1937, మే 9న జరిగింది. లైబ్రరీ నిర్వహణకు ముస్లిం లైబ్రరీ ట్రస్టు బెంగళూరు పేరుతో ఒక ట్రస్టు ఏర్పడింది. ఆ తర్వాత ఈ లైబ్రరీకి ఒక భవనాన్ని కొనుగోలు చేశారు. నూటపది సంవత్సరాల ముస్లిం లైబ్రరీ చరిత్రలో, దేశం, రాష్ట్రానికి చెందిన అనేక మంది ప్రముఖులు, ప్రసిద్ధ వ్యక్తులు ముస్లిం లైబ్రరీ సందర్శించి శుభాకాంక్షలు తెలిపారు. వీరిలో సయ్యద్ సులైమాన్ నద్వీ, అల్లామా డాక్టర్ సర్ ముహమ్మద్ ఇక్బాల్, మౌలానా షౌకత్ అలీ (అలీ బ్రదర్స్), మౌలానా జాఫర్ అలీ ఖాన్ (డైరెక్టర్ జమీందార్, లాహోర్), బాబా ఉర్దూ మౌల్వీ అబ్దుల్ హక్, ప్రొఫెసర్ అబ్దుల్ వహాబ్ బుఖారీ, సాగర్ నిజామీ, హజ్రత్ జోష్ మలీహబాదీ ఉన్నారు. సీమాబ్ అక్బరాబాది, మీర్జా యాస్ యగానా చింగిజి, ఎజాజ్ సిద్ధిఖీ, హజ్రత్ జిగర్ మొరదబాది, హజ్రత్ హఫీజ్ జలంధ్రి, హజ్రత్ అమ్జాద్ హై దరాబాదీ, మౌలానా ముఫ్తీ ముహమ్మద్ అష్రఫ్ అలీ, ప్రొఫెసర్ బి. షేక్ అలీ వంటి ఎంతో మంది లబ్ధప్రతిష్టులు ఉన్నారు. రెండుఅంతస్తుల ముస్లిం లైబ్రరీలో వివిధ భాషలలో 30,000 కంటే ఎక్కువ పుస్తకాలు ఉన్నాయి. ఉర్దూ, పర్షియన్ భాషలలో విలువైన, అరుదైన రాతప్రతులను కూడా సేకరించి ఇక్కడ ఉంచారు. ముస్లిం లైబ్రరీలో వివిధ అంశాలపై అత్యంత అరుదైన, విలువైన పుస్తకాలు, పురాతన మ్యాగజైన్లు, 1980ల వార్తాపత్రికలు, హైదరీ శకంలోని రాతప్రతులు ఉన్నాయి. మొత్తం మాన్యుస్క్రిప్ట్‌ల సంఖ్య 29కి చేరింది. మౌల్వీ అబ్దుల్ హక్ బిన్ సైఫుద్దీన్ రచనలు 'కంప్లెషన్ ఆఫ్ ఫెయిత్ అండ్ తక్వెటీ ఆఫ్ ఫెయిత్'ను హఫీజ్ అహ్మద్ బిన్ ముహమ్మద్ మగ్రిబ్ సంకలనం చేశారు. డీవాన్ నజీరి (ఫారీ కలాం) నజీర్ నేషాపురి, కలియాత్ కమల్ (ఉర్దూ) కమల్ షా పీర్ (దఖినీ ఉర్దూ). అదనంగా, షాహీద్ టిప్పు సుల్తాన్ అనేకమంది స్నేహితులకు రాసిన, ఎంపిక చేసిన ఉత్తరాలు ఇక్కడ అందుబాటులో ఉన్నాయి. లైబ్రరీలో ప్రముఖ ప్రచురణకర్త మున్షీ కిషోర్ ప్రచురించిన అనేక అరుదైన పుస్తకాలు కూడా కనిపిస్తాయి. వాటిలో ముఖ్యమైనవి 1889లో ప్రచురించిన అజబ్ అల్ మఖ్లూకత్, 1895లో ప్రచురితమైన తల్బ్ అక్బరీ, వాల్యూం I, ఇస్లామిక్ వైద్యంపై మొయినుద్దీన్ ఫరూఖీ హకీమ్ రచించిన మఖ్జాన్ఎఅదావియా అనువాదం (రెండు సంపుటాలలో) రచనలను చూడవచ్చు. వైద్యానికి సంబంధించిన పురాతన, అరుదైన పుస్తకాలు. ముహమ్మద్ నూర్ కరీం పుస్తకాలు కూడా లైబ్రరీలో అందుబాటులో ఉన్నాయి. చారిత్రక ప్రాధాన్యం గల ఈ లైబ్రరీని మరింత అభివృద్ధి పరచి, పాఠకులకు అన్ని సౌకర్యాలతో అందుబాటులోకి తీసుకురావడానికి ప్రభుత్వం, సాహితీ అభిమానులు సమష్టిగా కృషి చేయాలి.

సంస్కృత భాష ఎప్పటిది?

దేవ భాషగా చెప్పున్న సంస్కృత భాష మూలాలు ప్రస్తుత పాకిస్తాన్‌లోని ఉత్తర పంజాబ్, స్వాత్‌కు చెందినవని అంటారు. ఈ సిద్ధాంతాన్ని దాదాపుగా భాషా శాస్త్రవేత్తలంతా అంగీకరిస్తున్నారు. అయితే, సంస్కృతానికి, మన దేశానికే సంబంధం లేదని ఒక పరిశోధనలో తేలిందని అంటున్నారు. వ్యాసుడు రాసిన మహాభారతం, గ్రీకు రచయిత హోమర్ రాసిన ఇలియాడ్ రెండూ దాదాపు ఒక సమయానికి చెందినవని అంటారు. అంటే, సుమారు క్రీస్తు పూర్వం 1000 సంవత్సరాల నాటివి. ఈ రెండు సమూహాల భాషా మూలాలు ఒకటేనని ఈ పరిశోధన వాదిస్తున్నది. అందుకే ఇండో యూరోపియన్ లాంగ్వేజ్ ఫ్యామిలీలో సంస్కృతాన్ని కూడా చేర్చారని ఈ సందర్భంగా గుర్తుచేస్తున్నారు. ఆర్యులకు, సింధు నాగరికతకు ఎలాంటి సంబంధం లేదని పలువురు చరిత్రకారులు చాలాకాలం క్రితమే స్పష్టం చేశారు. ఈ అభిప్రాయానికి ఇటీవల హర్యానాలో దొరికిన ఇండస్ వ్యాలీ సమాధి నుంచి తీసిన అస్థిపంజరపై జరిపిన ప్రయోగం బలాన్నిస్తున్నది. ఆర్యుల్లో మాత్రమే ఉండే ఆర్1ఎన్1 అనే జన్యువు సింధు నాగరికత పరఢవిల్లిన ప్రాంతాల్లోని ప్రజల్లో లేదని ఈ అస్థిపంరం డిఎన్ఎ పరిశోధనలు స్పష్టం చేశాయి. సింధూ నాగరికతను నాశనం చేసిన ఆర్యులు, అక్కడి ప్రజలను శూద్రులుగా, అంటరాని వారిగా విభజించారని, వేల సంవత్సరాల తర్వాత కూడా అదే పద్ధతి ఇప్పటికీ కొనసాగుతున్నదని పరిశోధకుల అభిప్రాయం. సింధు లోయ చాలా విశాలమైనది. పైన అఫ్గానిస్థాన్ సరిహద్దుల నుంచి కింద కోలార్ బంగారు గనుల వరకూ విస్తరించింది. ఈ నాగరికత ప్రజలు ద్రవిడ భాషా సమూహాలకు చెందిన వారు. ద్రవిడ భాషలన్నిటిలోకీ తెలుగు అత్యంత శక్తివంతమైనది. సింధు నాగరికత సుమారుగా క్రీస్తు పూర్వం 3500 సంవత్సరం నాటిదని కొందరు అంటుంటే, అంతకంటే పూర్వమే విరాజిల్లిందని మరికొందరి అభిప్రాయం. ఏదిఏమైనా ఇది ఈజిప్టు, మెసపటోమియా సమకాలీన నాగరికత. కాగా, సింధు నాగరికత ఇతిహాసాల్లో విస్తారంగా ప్రచారమైన మహాభారతం కంటే ముందే ఉండివుంటే, క్రీస్తు పూర్వం 1900 తర్వాత ఎందుకు ఎలా కనుమరుగైందనే ప్రశ్న తెరపైకి వస్తున్నది. సింధు నాగరికత సమయంలో వాడిన భాష సంస్కృతం కాదు. తమిళం కూడా కాదు. నిజానికి అది గుర్తుల రూపంలో ఉంది. దీనిని ఉర్దూ, అరబ్బీ మాదిరి ఎడమ నుంచి కుడికి రాశారు. ఈజిప్టు నాగరికతలో వాడిన భాషను అర్థం చేసుకోగలిగిన శాస్త్రవేత్తలు, సింధు లోయ నాగరికత భాషను ఇంత వరకూ అర్థం చేసుకోలేకపోయారు. దానిని విశ్లేషించగలిగితేనే ఇంత వరకూ అందరినీ వేధిస్తున్న ఎన్నో ప్రశ్నలకు జవాబు లభిస్తుంది. ఈ లిపి గురించిన అంశాన్ని పక్కకుపెడితే, కొన్ని యుగాల క్రితం నాటిదని చెప్పున్న సంస్కృతం సింధు నాగరికతలో ఎందుకు భాగం కాలేదో వితండవాదం చేసేవారు. రామాయణ, మహాభారతాలు కొన్ని యుగాల క్రితం నాటివైతే, అవి నాశనమై, భూగోళంపై జీవం మళ్లీ కొత్తగా పుట్టుకొచ్చినప్పుడు, ఆ రెండు ఇతిహాసాలు ప్రచారంలో ఎలా ఉన్నాయనేది బిలియన్ డాలర్ల ప్రశ్న.

తెలుగు నవలా ప్రపంచంలో మొట్టమొదటగా మనస్తత్వ శాస్త్రాన్ని ఆధారంగా చేసుకొని వచ్చిన నవల 'అల్పజీవి'. దీని రచయిత రాచకొండ విశ్వనాథ శాస్త్రి. వృత్తి రీత్యా న్యాయవాది. రావిశాస్త్రిగా ప్రసిద్ధుడైన ఆయన, కథల్లో కూడా న్యాయవాదే . నేటి సమాజంలో నిత్యమూ పై తరగతులవారి అన్యాయాలకు, దౌర్జన్యాలకు గురై చిత్ర హింసలు పడుతున్న దీన, హీన ప్రజల తరపున తన ప్రతి రచనలోను వకాల్తా పుచ్చుకుని సాంఘిక (ఆర్థిక)న్యాయం కోసం 'వాదించాడు'. సమాజం అట్టడుగు పొరల్లో, అనుక్షణం భయపడుతూ జీవించే అథోజగత్సహోదరుల సమస్యలను, వాటివలన కలిగే దుఖాన్ని సూటిగా గుండెలకు నాటేలా చెప్పి పై జీవితం పట్ల పాఠకుల సానుభూతి 'పిండ' గల ఏకైక ప్రతిభావంతుడు. శ్రీకాకుళం, విజయనగరం, విశాఖ జిల్లాల మాండలికంలో, అట్టడుగు వర్గాల భాషలో, సొగసుగా, ప్రతిభావంతంగా, ప్రభావవంతంగా, పాఠకుల హృదయాలకు హత్తుకుపోయేలా పదునైన రచనలు చేసాడు.



ప్రపంచంలో మొట్టమొదటి గ్రంథ ముద్రణ చైనాలో జరిగింది. వజ్ర సూత్ర అనే బౌద్ధ గ్రాంథాన్ని క్రీస్తుశకం 868వ సంవత్సరంలో ముద్రించారు. అప్పట్లో టాంగ్ సామ్రాజ్యం ఉండేది. దానితోపాటు గన్ పౌడర్ కూడా కనుగొనడంతో పారిశ్రామిక విప్లవానికి బీజాలు పడ్డాయి. బౌద్ధ జ్ఞానసిద్ధాంతం విజ్ఞాన శాస్త్ర అభివృద్ధికి ఎలా దోహదం చేసిందో చెప్పటానికి ఈ ఉదాహరణలు. ఇటువంటి అంశాలు చాలా వుండే వుంటాయి. పరిశోధకుల గ్రంథాలుచదివితే తెలుస్తాయి. అంతేగాని ఇదేదో జ్ఞానుల సంవాదం, మనకు అర్థం కాదు గదా వదిలేద్దాం అనుకోరాదు. అది పలాయన వాదం.

వామపక్ష సాహిత్యం అవసరం..

వామపక్ష ధోరణి సాహిత్యంలో, పదాల శక్తి సామాజిక నిబంధనలను సవాలు చేయడానికి, విమర్శనాత్మక ఆలోచనను రేకెత్తించడానికి, సామాజిక మార్పును ప్రేరేపించడానికి ఉపయోగపడుతుంది. ఈ తరానికి చెందిన రచయితలు అన్యాయాలపై వెలుగును ప్రకాశింపజేయడానికి, అట్టడుగున ఉన్న స్వరాలను విస్తరించడానికి, మరింత సమానమైన ప్రపంచాన్ని అనుసరించడానికి మార్గం చూపుతుంది. ఈ రచనల్లో స్పష్టత ఉంటుంది. ఉద్వేగభరితమైన కథలు, ఆలోచింపజేసే కథనాల ద్వారా, లెఫ్ట్ ఓరియంటేషన్ సాహిత్యం పాఠకులను యథాతథ స్థితిని ప్రశ్నించడానికి, అసౌకర్య సత్యాలను ఎదుర్కోవడానికి అవసరమైన స్ఫూర్తినిస్తుంది. న్యాయం, సమానత్వం ప్రబలంగా ఉన్న భవిష్యత్తును ఊహించడాన్ని ఆహ్వానిస్తుంది. ఇది వైవిధ్యం పాఠకులను వారి స్వంత ఎంపికలు, ప్రత్యేకాధికారాలను సాధించే మార్గంలో నడిపిస్తుంది. ఈ సాహిత్యం పరిధిలో కంటెంట్ సృష్టికర్తగా, పదాలు అపారమైన శక్తిని కలిగి ఉన్నాయి. ఆకట్టుకునే కథనాలను రూపొందించడంలో, సంక్లిష్టమైన ఆలోచనలను వ్యక్తీకరించడంలో, అర్థవంతమైన సంభాషణలను ప్రేరేపించడంలో ఈ సాహిత్యాన్ని మించిన ప్రక్రియ లేదు. మనిషి జీవితంపై అవగాహనలను ఈ సాహిత్యం రూపొందిస్తుంది. ఊహలను సవాలు చేస్తుంది. చర్యను ప్రేరేపిస్తుంది. శతాబ్దాలుగా మౌనంగా ఉన్న గొంతులను వామపక్ష సాహిత్యం మాత్రమే వినిపిస్తుంది.

ఈ వారం కవితలు

వటవృక్షం

భారతావనిని కలచి వేసిన
కంటతడి పెట్టించిన కలకత్తా (బెంగాల్)
దుర్ఘటన
ఆర్‌జీకర్ వైద్య కళాశాలలో శిక్షణ లేడీ డాక్టర్‌పై
దుర్మార్గుల రాక్షస ఆనందం అవనికే చేటైనది.....

మానవ మృగాల క్రౌర్య కృరత్వ
పాశావిక సంఘటనలను అరికట్టలేమా ?
ఈ ఘోరాలు, నేరాలు అనంతమేనా? అంతం లేదా !
ఈ దాడుల వెనుక ఉన్న లోపమెక్కడా ?

సృష్టి సహజ సిద్ధమైన అవయవాలతో
జన్మించడం స్త్రీలకు శాపమా ?
ప్రకృతిని చూసి పరవశించే మానవ జాతి.....
సృష్టి కర్తలు నేందుకు గౌరవించ లేక పోతున్నారు ?

ఆపాత్రనే లేకుంటే పుడమిపై
మగవాడిగా నీ ఉనికి ఎక్కడ ?
అందమే ఆమెకు ప్రతిభందకమైతే.....
మనిషి మనుగడకు రూపమేది ?

వైద్యులకేల వంకర చూపులు
నైతిక పుట్టుక నశించి, సంకరమైనందులకా ?
అతి విజ్ఞులైబుర్రలో ఉన్మాద దూలప్రకోపించడమా?

ఏమైనప్పటికీ .....
వైద్య కళాశాలలు, మృగశాలలుగా పెంపు
కావడం దేశమాతను చెర పట్టడమే
కన్నతల్లినే నగ్నంగా నిలబెట్టడమే అవుతుంది
నిజాన్ని గ్రహించకపోతే.....
వికృతే వటవృక్ష మౌతుంది

కొండ నాగేశ్వర్ రావు
8688553470

అయ్యా...ఓ పారి అచ్చిపోరా!

అయ్యా.... మీరోత్తండ్లని కబురందగానే
వొళ్ళలువకుండా ఉండేందుకు
మావోళ్ళు తెల్లారి తెల్లార్లకే రోడ్లు సగపెట్టింద్రు
మీ కళ్ళకానందంగా నదురియ్యదానికి
ఒక్క పూటల్నే చెట్లను పెంచింద్రు

మీరు మొక్కుకునే గుడి సుట్టూత
ఎలిగే కరెంటు దీపాల జిలుగులు సూత్తాంటే
నింగినుండో సుక్కల మండెనుదెచ్చి
ఈడ అలికినట్టుంద్రు
తొవ్వ తొవ్వంతా శెత్తను దీశి ముగ్గులు పోశింద్రు

మీ పాణానికి ఎప్పుడు ఏ ఆపద యెట్లత్తదోనని
పెద్దాసుపత్రిల జేశినట్టే
సకలం సవులతులు జేశింద్రు
గియన్ని ఆర్తల్లో ఇని జూశినంకా మాకాశబుట్టింది
అయ్యా...మీకు పున్నెముంటది బాంచన్
ఓ పారి మా గూడానికొచ్చిపోరాదుర్రి

గిట్లనన్నా...మూరెడు మూరెడు గుంతలుపడి
బురద మళ్లైన మా రోడ్లు సక్కపడుతయేమో
మా ఇంట్లబుట్టినోళ్ళలెక్కనే మమ్మంటుకునుండే
మురుగు కొన్ని దినాలన్నా మా నుండి దూరమైత
దేమో యెన్నడెలుగని మా గూడెంలో ఈది దీపాలు
మీరొచ్చే పున్నాన తళుకుతళుకులాడుతాయేమో
కక్కుడేరుగుల్లకే మందుబిళ్ళల్లేక సచ్చిన
మాసంటోల్లు

మీ పేరుమీదనన్నా నాలుగొద్దులెక్కువ బతుకుతరే
మో అయ్యా... మీరొత్తే మా గూడెంల
దసరా దీపాలి కలిపొచ్చినట్టే ఉంటది
మీకు పున్నెముంటదీ...

యాదాదికోపారన్నా మా గూడాలకొచ్చిపోండ్రి
ఎప్పుడు యే గాలికారిపోతయో తెల్వని
మా బతుకు దీపాంతలల్లా మీ తీరుబడి
యాత్రైనా...
మాకింత జీవ సమురైతదేమో....
మీకు పున్నెముంటది అప్పుడప్పుడూ మా గూడాల
పొంటి సూశిపోండ్రి బాంచెన్

దిలీప్.వి
8464030808

ఆయుధం అనివార్యమని తెలుసు...!!

ఆ యుధం అనివార్యమైన చోట
అస్త్ర సన్యాసం వట్టిమాట
రాయపూర్ ఎడతెగని చర్చంతా
నీ దోపిడీ కోసమే
మమ్మల్ని నిర్మూలించేందుకు
నీ కుప్పిగంతులు

ఐదుదశాబ్దాల క్రితమే
నక్సల్బరీ వసంత మేఘ ఘర్జనకు
మా చేతుల్లో ఆయుధాలు చిగురించాయి
మా నోళ్ళల్లో ప్రజాకవుల పాటలు పల్లవించాయి
కోరన్న మంగన్న వెంపటాపు

పంచాది పాణిగ్రాహిల
అమరత్వమే మమ్మల్ని సాయుధం చేసింది
రాజ్య హింసనేలిన నాటి నుంచే
ప్రజ ప్రతిహింసనేలుతుంది
ఏనాడో ఆయుధం మాదేహంలో భాగమైంది

ఇప్పుడు ఆయుధం
మా స్నేహితుడు
మా సహచరి
మా రక్షణకవచం
ఆయుధం పదగనీడలో

అధికారం చలాయిస్తున్న పాలకుడా
అస్త్రం తోడు లేకపోతే
అడుగేయలేని పిరికివాడివి
నీకు అణిచివేతకు ఆయుధం
మాకు ఆత్మరక్షణకు ఆయుధం

నీ రాజ్య యంత్ర నిర్వహణదారి
ఆయుధం
మాకు రాజ్యాధికారం కోసం ఆయుధం
పీడకుల భక్షణకు భరోసా నీ బందూక్
పీడితుల రక్షణకు రణభేరీ మారైఫిల్
తుపాకి గురిపెట్టడంలో

నీ లక్ష్యం నీది
మా లక్ష్యం మాది
నీ దోపిడి కోటలో జరిపే చర్చలతో
మమ్ము నిర్మూలించలేవని తెలుసు
రాయపూర్ మధనంమాటల వరకే
నీకుట్ర దాటవని తెలుసు
అందుకే ఎప్పటికైనా
ఆయుధం అనివార్యమని తెలుసు

శోభరమేష్
8978656327

జలదిగ్బంధంలో 'నల్లగొండ'

వాగులు, వంకలు పొంగిపొర్లడంతో ఇబ్బందులు పడ్డ ప్రజలు

పలు రహదారులకు రాకపోకల నిలిపివేత

ఇండ్లలోకి వర్షపు నీళ్లు

నీట మునిగిన వరిపొలాలు



ప్రజాపక్షం/సూర్యాపేటటౌన్, నల్లగొండప్రతినిధి, యాదాద్రిభువనగిరి/మునగాల: ఇటు బంగాళఖాతం, ఆటు వాయుగుండం రెండు తోడు కావడంతో రాష్ట్ర వ్యాప్తంగా కురిసిన భారీ వర్షాలకు ఉమ్మడి జిల్లాల్లోని పలు గ్రామాలు పూర్తిగా జలదిగ్బదంతో చిక్కుకున్నాయి. రెండు రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు మండలంలోని వాగులు, వంకలు పొంగి పోర్లడంతో రహదారులన్ని జలమయమయ్యాయి. దీంతో పలు రహదారులకు పూర్తిగా రాకపోకలు నిలిచిపోయాయి. మండలంలోని గణపవరం వాగు పొంగిపొర్లడంతో పలు గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. సూర్యాపేట జిల్లాలోని తాడ్వాయి గ్రామ సమీపంలోని గుర్రప్పవాగు పొంగిపోర్లడంతో తాడ్వాయి గ్రామం పూర్తిగా రాకపోకలను మునగాల పోలీసులు బంద్ చేశారు. దీంతో అధికారులు జలమయమైన గ్రామాలను పర్యవేక్షించారు. మండలంలోని అన్ని గ్రామాల్లో వరిపొలాలు నీట మునిగాయి. మరికొన్ని చోట్ల విద్యుత్ మోటార్లు నీటిలో మునిగిపోయాయి. దీంతో కొన్ని ప్రాంతాల్లో వరి కొట్టుకుపోవడంతో వరం పొలంపై ఇసుక మేటలు వేసింది. వరి పంట సాగుచేసిన రైతులు ఆర్థికంగా నష్టపోయారు.

విజయవాడ, ఖమ్మం వెళ్లే వారు ప్రయాణం వాయిదా వేసుకోవాలి

జిల్లా ఎస్‌పి సన్ ప్రీత్ సింగ్

సూర్యాపేట: రెండు రోజులుగా విస్తారంగా కురుస్తున్న భారీ వర్షాలతో ఆంధ్రప్రదేశ్‌లోని చిల్లకల్లు, మందిగామ వద్ద జాతీయ రహదారి 65పై, సూర్యాపేట నుండి ఖమ్మం వెళ్లే మార్గంలో నాయకనిగూడెం వద్ద రోడ్లపై పాలేరు వాగు ఉధృతిగా ప్రవహిస్తుండడంతో ఆ ప్రాంతాలకు వెళ్లే వారు తమ ప్రయాణాలను వాయిదా వేసుకోవాలని జిల్లాఎస్‌పి సన్ ప్రీత్‌సింగ్ సూచించారు. ఆదివారం కోదాడ, నడిగూడెం, పాలకవీడు ప్రాంతాల్లోని ముంపు ప్రాంతాలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు అత్యవసర పరిస్థితుల్లో తప్పా బయటికి రావద్దని సూచించారు. అత్యవసర సమయాల్లో ప్రజలు డయల్ 100కు, జిల్లా స్పెషల్ బ్రాంచ్ కంట్రోల్ రూంనెంబర్ 871268 6026కు ఫోన్ చేసి పోలీసుల సహాయం పొందాలన్నారు. కోదాడ పట్టణంలోని శ్రీరంగాపురం వద్ద వరదలో చిక్కుకున్న మూడు బస్సుల్లోని ప్రయాణికులను పోలీసుల సహాయంతో సురక్షితంగా కాపాడారు. పాలకవీడు మండలంలోని మిగడంపాడు తండాకు వెళ్లే రాఘవపురంలోని గాయత్రి పవర్ ప్లాంట్‌లో చిక్కుకున్న ఆరుగురు ఉద్యోగులను క్షేమంగా కాపాడారు. పోలీస్, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది ఉన్నారు.

ముంపు ప్రాంతాల పరిశీలన

సూర్యాపేటటౌన్: రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలతో జలమయమైన జిల్లా కేంద్రంలోని 29వ వార్డు సద్దుల చెరువు అలుగు ముంపు ప్రాంతం 29వ వార్డులో ఆదివారం జిల్లా అదనపు కలెక్టర్ బిఎస్ లత కౌన్సిలర్ అనంతుల యాదగిరి గౌడ్‌తో కలిసి పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ ముంపు ప్రాంతాల్లోని ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించాలని అధికారులను సూచించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ బి శ్రీనివాస్, సిఐ రాజశేఖర్, ఎస్ఐ లోకేష్, మున్సిపాలిటి శానిటరీ ఇన్ స్పెక్టర్ సురేష్, సతీష్, వార్డు ప్రజలు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

వర్ష ప్రభావిత ప్రాంతాల్లో పర్యటించినజిల్లా కలెక్టర్

సూర్యాపేటలెక్టరేట్: వాతావరణ శాఖ వెల్లడించిన ప్రకారం రెండు రోజులపాటు భారీ నుండి అతిభారీ వర్షాలు కురిసే అవకాశాలు ఉండడంతో జిల్లా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ అన్నారు. ఆదివారం అధిక వర్షాల కురవడంతో జిల్లాలోని కోదాడ, హూజూర్ నగర్, మట్టంపల్లి, సూర్యాపేట, తోగర్రాయి, ఖమ్మం సరిహద్దు ప్రాంతాల్లో పర్యటించారు.ఆయన మాట్లాడుతూ తుఫాన్ నేపథ్యంలో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున జిల్లాలో ఎలాంటి ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా ముందస్తు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. జిల్లా స్థాయిలో పర్యవేక్షణకు 24 గంటలు పర్యవేక్షిస్తూ కంట్రోల్ రూంఏర్పాటు చేసినట్లు తెలిపారు. 6281492368 నెంబర్‌ను ఎప్పటికప్పుడు సమాచారం ఇవ్వాలని కోరారు. ప్రజలకు సమస్యల ఉత్పన్నమైతే పై నెంబర్ ద్వారా తమకు సమాచారం ఇస్తే వెంటనే స్పందిస్తామన్నారు. ఆర్‌డిఓలు సూర్యనారాయణ, శ్రీనివాసులు, తహసీల్దార్, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఫోటో నెం: 01 నల్లగొండ 14

వర్షాల కారణంగా ప్రాణహాని జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలి

నల్లగొండ: ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాల కారణంగా తడిసిన పాత ఇండ్లు, మట్టి మిద్దెలు పడిపోయి ప్రాణహాని జరిగేందుకు అవకాశం ఉందని, అలాంటి ఇండ్ల నుండి ప్రజలను తక్షణమే కాళీ చేయించి సురక్షిత ప్రాంతాలలో ఉంచాలని జిల్లా కలెక్టర్ సి.నారాయణరెడ్డి అధికారులను ఆదేశించారు. భారీ వర్షాలపై ఆదివారం ఆయన జిల్లా ,మండల స్థాయి అధికారులతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. వర్షాల వల్ల రహదారులపై నీరు ప్రవహిస్తున్న చోట రవాణా పునరుద్ధరణ చేయాలని,అలాగే విద్యుత్,తాగునీటి కి ఇబ్బందులు ఏర్పడినచోట తగు చర్యలు తీసుకొని ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చూడాలని , లోతట్టు ప్రాంతాలలో నీరు నిలిచినస్థితే వెంటనే నీటిని బయటకు పంపించాలని ఆదేదించారు. సోమవారం భారీ, అతి భారీ వర్షాలు ఉన్నాయన్న వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో పూర్తి జాగ్రత్తలు తీసుకోవాల్సిందిగా ఆయా శాఖల అధికారులకు ఆయన ఆదేశాలు జారీ చేశారు .

ఎడతెరిపి లేని వర్షాలతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

కలెక్టర్ హన్మంతు కె.జండగే

మోటకొండూరులో : బంగాళా ఖాతంలో ఏర్పడిన వాయుగుండం ప్రబావంతో గత రెండు, మూడు రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న బారీ వర్షాలతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ హన్మంతు కె.జండగే అన్నారు. ఆయన ఆదివారం కొండాపురం బిక్కేరు వాగులో ప్రవహిస్తున్న వరద ప్రవాహం, అడ్డంగా వేసిన బారీకేడ్లను పరిశీలించి మాట్లాడారు. అధికారులు అప్రమత్తంగా ఉండాలని ప్రజలకు అత్యవసర సమయంలో సహకరించాలని తెలిపారు. తహసీల్దార్ శాంతిలాల్, ఎస్ఐ పాండు, ఆర్ఐ నరేష్, ఎంపిఒ చంద్రశేఖర్, పోలీసులు మదు, జాన్ రెడ్డి, పంచాయతీ సెక్రటరీలు తదితరులు పాల్గొన్నారు.

వరద ప్రాంతాలను పర్యటించిన ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి

మిర్యాలగూడ: భారీ వర్షాల కారణంగా నీట మునిగిన ప్రాంతాలను శాసనసభ్యులు బత్తుల లక్ష్మారెడ్డి వివిధ శాఖల అధికారులతో కలిసి ఆదివారం పర్యటించారు. పట్టణంలోని తాళ్లగడ్డ, షాబునగర్, బంగారుగడ్డ, రాం నగర్, సుందర్‌నగర్, విద్యానగర్ కాలనీలతో పాటు ఇతర ప్రాంతాలను విస్తృతంగా పర్యటించి ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. రోడ్లు, వీధులన్ని జలమయంగా మారాయి. వర్షపు నీటిలోనే ఎమ్మెల్యే నడుస్తూ లోతట్టు ప్రాంతాల్లో భారీ వర్షాల వల్ల ప్రజలు ఎదుర్కొన్న ఇబ్బందులను తెలుసుకోని పరామర్శించారు. తొలుత ఆర్డీవో కార్యాలయంలో వివిధ శాఖల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించి ప్రజా రక్షణ కోసం చేపట్టాల్సిన చర్యలను వివరించి సహాయక చర్యలను చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మ్యాన్ హోల్స్, కరెంట్ తీగలు తెగిపడి ప్రమాదాలు జరగకుండా చర్యలు చేపట్టాలన్నారు. ఆర్డీవో కార్యాలయంలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేయాలని అధికారులను కోరారు. వాగులు వంకలు పొంగి పొర్లే ప్రదేశాల్లో హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేయాలని, విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆయన వెంట తహసీల్దార్ హరిబాబు, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

బొడ్డుపలి చెరువును పరిశీలించిన ఇరిగేషన్ అధికారులు

దేవరకొండ : ఆదివారం బొడ్డుపల్లి చెరువుకు మరమత్తులను చేసేందుకు సంబంధిత ఇరిగేషన్ శాఖ అధికారులు పరిశీలించారు. గతంలో మరమత్తుల కొరకు చెరువు తూములు తుప్పుబట్టి విరిగిపోయాయని, చెరువు కొత్త తూము బిగించాలని అధికారులను కోరగా ఆదివారం పరిశీలనకు వచ్చినట్లు పాత్లావత్ తండా మాజీ సర్పంచ్ వాంకుడావత్ రాజ్ కుమార్ తెలిపారు. చెరువును పరిశీలించిన ఇరిగేషన్ ఈఈ ప్రభు కళ్యాణ్ చెరువుకు సంబంధించి మరమ్మత్తులు చేయనున్నట్లు తెలిపారు. ఆయన వెంట డీఈ కరుణసాగర్, ఏఈ నగేష్, మాజీ సర్పంచ్ రాజ్‌కుమార్, పుల్లారావు, భాస్కర్, రెడ్య, హతీరాం, చందు తదితరులు పాల్గొన్నారు.

అత్యవసరమైతే తప్ప బయటికి రావద్దు : జిల్లా కలెక్టర్

ప్రజాపక్షం /నార్కట్‌పల్లి : మూడు రోజులుగా తెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలతో వాగులు వంకలు పొంగిపొర్లుతున్న నేపద్యంలో ప్రజలు అత్యవసరమైతే తప్ప బయటకు రావద్దని జిల్లా కలెక్టర్ సి నారాయణ రెడ్డి తెలిపారు. వర్షాలతో మండలం పరిధిలోని అమ్మనబోలు గ్రామము నుండి శాలిగౌరారం వెళ్లేదారిలో వరద ఉధృతి పెరగడంతో వాగులు పొంగి పొర్లుతు రహదారికి అడ్డంగా నీటి వరద కొనసాగుతుంది. ఆదివారం అమ్మనబోలు సమీపాన గల రామంతపూర్ వెళ్లేదారిలో ఏడుమూట్ల బావి దగ్గర ఉన్న కల్వర్టు వర్షం కాలంలో ప్రజలకు రాకపోకలు నిలిచిపోయాయి విషయం తెలుసుకున్న కలెక్టర్. ఎస్పీ సంఘటనకు చేరుకొని పరిశీలించినారు మీరు వెంట తహసిల్దార్ వెంకటేశ్వరా రావు. ఎంపీడీవో సుధాకర్, సీఐ నాగరాజు, ఎస్ ఐ క్రాంతి కుమార్, ఆర్ ఐ తరుణ్ కుమార్ తదితరులు అధికారులు ఉన్నారు.

నాలాలపై అక్రమ నిర్మాణాలు

చోద్యం చూస్తున్న అధికారులు

ప్రజాపక్షం/మిర్యాలగూడ: భారీ వర్షాల నేపథ్యంలో జిల్లా కలెక్టర్ ఇప్పటికే అధికారులెవరూ కూడా సెలవులపై వెళ్లవద్దని అలర్ట్ చేశారు. పలువురు అధికారులు జిల్లా కలెక్టర్ ఆదేశాలను భేఖాతరు చేస్తున్నట్లు తెలుస్తుంది. శనివారం రాత్రి కురిసిన భారీ వర్షం కారణంగా పట్టణంలోని సబ్ జైల్ రోడ్డులోని నాలా ఉధృతంగా ప్రవహిస్తుంది. నాలాపై పలువురు చికెన్, మటన్ వ్యాపారస్తులు సముదాయాలను ఏర్పాటు చేసుకోని వ్యర్థాలను నాలాలోనే పడవేస్తున్నారు. దీని ఫలితంగా నాలా నీరు ప్రవహించకుండా సమీపంలోని ఉన్న ఇండ్లలోకి మురుగు కాల్వల ద్వారా చేరుతుంది. దీంతో తాము విష జ్వరాల భారిన పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మున్సిపల్ అధికారులు నాలాపై ఉన్న నిర్మాణాలను కూల్చివేయాలని ప్రజలు కోరుతున్నారు. ఓ వ్యాపారి ఏకంగా నాలాలో ఇసు బస్తాలను వేసి అతడి షాపు వద్దకు నీరు చేరకుండా కట్టడి చేసుకోవడం విస్మయానికి గురి చేస్తుంది.గత వారం మున్సిపల్ చైర్మన్ తిరునగరు భార్గవ్‌కు స్థానికులు ఫిర్యాదులు చేసినా పట్టించుకోలేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి నాలాపై ఉన్న నిర్మాణాలను తొలగించాలని స్థానికులు కోరుతున్నారు.

క్రీడల్లో విద్యార్థులు నైపుణ్యం సాధించాలి

ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్: చెస్ క్రీడల్లో విద్యార్థులు నైపుణ్యం సాధించి ఉన్నత స్థాయికి ఎదగాలని జిల్లా చెస్ అసోసియేషన్ అధ్యక్షులు గండూరి కృపాకర్ అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని టిటిడి కళ్యాణ మండలంలో ఉమ్మడి నల్గొండ జిల్లా స్థాయి అండర్ 9,11, 15 బాల బాలికల చెస్ పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. ఆయన మాట్లాడుతూ చదరంగంతో విద్యార్థుల్లో మేధాశక్తి పెంపొందుతుందని, చెస్ క్రీడాకారులను ప్రోత్సహించి వారిలోని ప్రతిభను వెలికి తీసేందుకు ఇలాంటి పోటీలు ఎంతగానో ఉపయోగపడుతాయన్నారు. ఈ కార్యక్రమంలో చెస్ అసోసియేషన్ ఉమ్మడి జిల్లా ప్రధాన కార్యదర్శి సతీష్ కుమార్, గండూరి శ్రీధర్, లింగారెడ్డి, మేడ సాయి కుమార్, అర్బిటల్ జానయ్య, భిక్షం, పాల్గొన్నారు.

రా రైస్ మిల్లర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడిగా గోవిందరావు

ప్రజాపక్షం/సూర్యాపేట: తెలంగాణ రాష్ట్రంలోని రారైస్ మిల్లర్స్‌ల సమస్యల పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వం సానుకూలంగా ఉందని రా రైస్ మిల్లర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు పాడిగణపతి రెడ్డి అన్నారు. ఆది వారం జిల్లా కేంద్రంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో ఏర్పాటు చేసిన సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ప్రభుత్వానికి రైతులకు మధ్య వారధిగా రైస్ మిల్లర్స్ వెల్ఫేర్ పని చేస్తుందని, ప్రభుత్వానికి రైతులకు వారధిగా ఉన్న ఈ వ్యవస్థను పాలకులు అన్ని విధాలుగా ఆదుకోవాలని కోరారు. అనంతరం రా రైస్ మిల్లర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడిగా కొండమీది గోవిందరావును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.రా రైస్ మిల్లర్లు సుందరి నాగేశ్వర్‌రావు, అనుప్‌రెడ్డి, అర్వపల్లి సుధాకర్, నాగరాజు, గజ్జి వెంకటేశ్వర్లు, మట్టారెడ్డి, నర్సింహ్మారావు, పరమాత్ముల మధు, సైదులు, ఉపందర్ పాల్గొన్నారు.

ఫీడర్ ఛానల్‌కు గండి..

ప్రజాపక్షం/చండూరు : చండూరు మండలం ఉడుతలపల్లి గ్రామంలోని ఊరు చెరువులోకి వెళ్లటానికి నిర్మించిన ఫీడర్ ఛానల్ కు గండి పండింది. చెరువులోకి వెళ్లవలసిన వరుద నీరు వృథాగా వాగులోకి వెళ్లిపోతుంది. చెరు వులో నీరు ఉంటే చుట్టుపక్కల రైతుల బోరు బావులు ద్వారా పంటలు పుష్క లంగా పండేవని రైతులు చెప్పుతున్నారు. శనివారం , ఆదివారం వచ్చిన భారీ వర్షం నీరు ఫీడర్ ఛానల్ ద్వారా చెరువులోకి వెళితే చెరువు నిండి భూ గర్భ జలాలు సంవృద్ధిగా ఉండేవని రైతులు ఆదోళన వ్యక్తం చేశారు. ఇరిగే షన్ ఆధికారులకు తెలిపిన కూడ స్పందించలేదని రైతులు చెప్పుకొచ్చారు. ఇప్పటికైన సంబంధిత అధికారులు వెంటనే స్పందించి ఫీడర్‌ఛానల్‌కు పడిన గండిని పూడ్చి రైతాంగాన్ని రైతులు అధికారులకు విజ్ఞప్తి చేశారు.

ఎడమ కాలువలో కాలుజారిపడి మహిళా మృతి

ప్రజాపక్షం/నిడమనూరు : నాగార్జునసాగర్ ఎడమ కాలువలో కాలకృత్యాలు తీర్చుకోవడానికి వెళ్లిన మహిళ కాలు జారిపడి మృతి చెందిన సంఘటన ఆదివారం వేంపాడు సమీపంలో చోటుచేసుకుంది, నిడమనూరు ఎస్సై జె గోపాల్ రావు తెలిపిన వివరాల ప్రకారం మిర్యాలగూడకు చెందిన జిల్లేపల్లి రాములమ్మ (61) గత ఆరు నెలల క్రితం వెంగన్నగూడెం గ్రామంలో తనను సాధుకుని పెంచి పెద్దచేసిన కటారి సత్తయ్య అనారోగ్యంతో ఉండడంతో సపరియాలు చేసేందుకు వచ్చిన రాములమ్మ ఆదివారం తిరిగి మిర్యాలగూడ వెళ్తుండగా వెంగన్నగూడెం స్టేజి సమీపంలోని వెంపాడు కాలువలో కాలకృత్యాలు తీర్చుకునేందుకు వెళ్లగా ప్రమాదవశాత్తు కాలుజారి కాలువలో పడినట్లు తెలిపారు, సమీపంలో కాలువలో చేపలు పడుతున్న వ్యక్తులు ఆమెను గమనించి కాపాడేందుకు కాలువలో నుండి బయటకు తీసేలోపే ఆమె మృతి చెందడం జరిగింది, మృతురాలి కుమారుడు జిల్లెపల్లి వీరయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

నల్ల బ్యాడ్జీలతో ఉద్యోగుల నిరసన

ప్రజాపక్షం/నల్లగొండటౌన్ : సెప్టెంబర్ 1న పెన్షన్ విద్రోహ దినోత్సవం సందర్భంగా గజిటెడ్, నాన్ గెజిటెడ్ ఉద్యోగులు,పెన్షనర్స్ ఉపాధ్యాయ సంఘాల జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం పట్టణంలోని పెద్ద గడియారం చౌరస్తాలు నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. వారు మాట్లాడుతూ.. 2004 నుండి అమలైన కొత్త పెన్షన్ విధానంలో ఉద్యోగులు, ప్రభుత్వ వాటా కలిపి స్టాక్ మార్కెట్లో గాని ఈక్విటీ ఫండ్లలో బాండ్ల రూపంలో కానీ పెట్టి వచ్చే లాభాలను ఉద్యోగుల పెన్షన్ గా నిర్ణయిస్తారని, స్టాక్ మార్కెట్లో ఒకవేళ నష్టాలు వస్తే మాత్రం ఉద్యోగి చాలా నష్టపోవాల్సి వస్తుందన్నారు. దీంతో పదవి విరమణ తర్వాత ఉద్యోగులకు వారి కుటుంబీకులకు పెన్షన్ వస్తుందా లేదా అనే ఆందోళనలో జీవనం గడపాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. పెన్షన్ అనేది ఉద్యోగి హక్కుని, అది బిక్ష కాదనే విషయాన్ని ప్రభుత్వాలు గుర్తుంచుకోవాలన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు తక్షణమే స్పందించి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. జెఎసి నాయకులు ముజీబ్, శేఖర్ రెడ్డి, శ్రీశైలం, వెంకట్రాంరెడ్డి, రాంబాబు, రాజశేఖర్ రెడ్డి, నాగమణి, ఎడ్ల సైదులు, పెరుమాళ్ళ వెంకటేశం, నర్రా శేఖర్ రెడ్డి, అరుణ, సోమనాదం, వీరమల్ల శ్రీనివాస్, భద్రయ్య, కృష్ణ, నరసింహాచారి, విజయకృష్ణ, ఫణికుమార్, నారాయణరెడ్డి, దశరథ, భాస్కర్, లక్ష్మయ్య, సైదులు నాయక్, ఆంజనేయులు, తదితరులు పాల్గొన్నారు.

చేనేత కార్మికులకు రుణమాఫీ కోసం ప్రభుత్వం సమాలోచనలు

ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్‌రెడ్డి

ప్రజాపక్షం/భూదాన్ పోచంపల్లి: రైతు రుణమాఫీ తరహాలో చేనేత కార్మికులకు కూడా రుణమాఫీ చేసేందుకు ప్రభుత్వం సమాలోచనలు చేస్తుందని సాధ్యాసాధ్యాలపై సమీక్షలు నిర్వహిస్తోందని త్వరలో చేనేత కార్మికులకు తీపి కబురు రాబోతుందని భువనగిరి శాసనసభ్యులు కుంభం అనిల్ కుమార్‌రెడ్డి స్పష్టం చేశారు. ఆదివారం పోచంపల్లి మండలం జూలూరు గ్రామంలో రాష్ట్రస్థాయి వెయిట్ లిఫ్టింగ్ పోటీలలో చివరి రోజు అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన క్రీడాకారులకు ఆయన బహుమతులను అందజేసి అనంతరం పట్టణ కేంద్రంలోని శ్రీ నల్ల పోచమ్మ దేవి బోనాల ఉత్సవంలో పాల్గొన్నారు. అనంతరం ఆయన బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు తడక వెంకటేశ్వర్లు నివాసంలో విలేఖరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం చేనేత పరిశ్రమను ఆదుకునేందుకు సంక్షోభంలోంచి బయటపడేందుకు అనేక ప్రణాళికలు రచిస్తుందని పేరుకుపోయిన చేనేత వస్త్రాల నిల్వలను 30 నుండి 40 శాతం వరకు ప్రభుత్వమే కొనుగోలు చేసేలా ప్రణాళికలు సిద్ధం చేస్తుందని తెలిపారు. అంతేకాకుండా ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ హ్యాండ్లూమ్ టెక్నాలజీని పోచంపల్లి పట్టణ కేంద్రంలోని ఏర్పాటు చేసి కార్మికుల జీవనోపాధి పెంపొందించేందుకు కృషి చేస్తుందన్నారు. త్వరలో చేనేత సమస్యల పరిష్కారానికి అన్నింటినీ పరిష్కరించేందుకు త్వరలో పెద్ద ఎత్తున చేనేత సదస్సులు ఏర్పాటు చేయబోతున్నట్లు తెలిపారు. బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు తడక వెంకటేశ్వర్లు, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు పాక మల్లేష్ యాదవ్, టౌన్ కాంగ్రెస్ అధ్యక్షుడు భారత లవకుమార్, జిల్లా కిసాన్ సెల్ అధ్యక్షులు మర్రి నరసింహారెడ్డి, అర్బన్ బ్యాంక్ చైర్మన్ తడక రమేష్, చేనేత కార్మిక సంఘం నాయకురాలు మెరుగు శశికళ, సీనియర్ నాయకులు తదితరులు ఆయన వెంట ఉన్నారు.

చెరువుల ఆక్రమణలపై విచారించాలి

ప్రజాపక్షం /భువనగిరిరూరల్: భువనగిరి, బీబీనగర్‌లలోని చెరువుల ఆక్రమణలపై విచారించి నిర్మాణాలను తొలగించాలని సిపిఐ జిల్లా కార్యదర్శి గోద శ్రీరాములు డిమాండ్ చేశారు. ఆదివారం భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ భువనగిరి పట్టణ, మండల సమితి సమావేశం బొమ్మాయిపల్లిలో కామ్రేడ్ చింతల పెంటయ్య అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఐ జిల్లా కార్యదర్శి గోద శ్రీరాములు మాట్లాడుతూ జిల్లాలో ప్రధానమైన చెరు వులు, కుంటలు ఆక్రమణలు జరిగినాయని, సంబంధిత నీటిపారుదల శాఖ డిపార్టుమెంటు ఏచెరువు ఎన్ని ఎక రాలు ఉన్నదో రీసర్వే చేసి హద్దులు ఖరారు చేయాలని డిమాండ్ చేశారు. ముఖ్యంగా జిల్లా కేంద్రంలోని భువనగిరి అలాగే బీబీనగర్ చెరువులపైన కూడా స్థానిక ప్రజలు ఆక్రమణలపై ఫిర్యాదులు చేసినప్పటికీ పట్టింపు లేదని అన్నారు. పట్టణాలలో నాళాలపై అక్రమ కట్టడాలను నిరోధించాలని అధికారులకు విజ్ఞప్తి చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన హైడ్రా హైదరాబాద్‌కే కాకుండా రాష్ట్రంలోని అన్ని ప్రాంతాలకు ఏర్పాటు చేసి చెరువులు, కుంటలు ఆక్రమణలకు గురికాకుండా రక్షణ కల్పించాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ సమావేశంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఏశాల అశోక్, సిపిఐ భువనగిరి మండల కార్యదర్శి మరిపెల్లి రాములు, భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు దాసరి లక్ష్మ య్య, మండల కౌన్సిల్ సభ్యులు కోట శంకర్, చొప్పరి సత్తయ్య, కడారి మల్లేష్, గుండెబోయిన స్వామి, ఏదినూరి శంకర్, బర్రె ప్రసాద్, షర్ఫుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

జనగాం క్రాస్ రోడ్డు బంకులో కల్తీ డీజిల్, పెట్రోల్ బంక్ సీజ్ చేయాలని డిమాండ్

ప్రజాపక్షం/సూర్యాపేటటౌన్: జిల్లా కేంద్రంలోని పెట్రోల్ బంకుల నిర్వహకుల నుండి అధికారులు నెలవారి ముడుపు తీసుకోని వాటిని పట్టించుకోవడం లేదని వినియోగదారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కల్తీ జరిగిన బంకులను అధికారులు తనిఖీలు చేయడం లేదని వాహనదారులను బహిరంగంగా ఆరోపిస్తున్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని జనగాం క్రాస్ రోడ్డులోని దుర్గాభవాని పెట్రోలియం కంపెనీ బంకులో కల్తీ పెట్రోల్, డిజీల్ వస్తుందని వాహనదాలులు, వినియోగదారులు ఆందోళనకు దిగారు. బంకులో ఉదయం కారులో డిజీల్ పోయించుకోగా కారు స్టార్ట్ కాకపోవడంతో వాహనదారులు కారులో పోసిన డిజీల్‌ను పరిశీలించారు. పలువురు వినియోగదారులు డిజీల్‌ను వాటర్ బాటిల్‌లో పోయించుకోగా తెల్లని నురుగగా నీళ్లులా ఉంది. ఈ బంకులో ఈ కల్తీ అదే మొదటి సారి కాదని గతంలో రెండు మూడు సార్లు ఇలానే జరిగిందని స్థానికులు ఆరోపిస్తున్నారు. సిబ్బంది సైతం వినియోగదారుల పట్ల దురుసుగా మాట్లాడడంతో వాగ్వివాదం జరిగింది. సూర్యాపేట రూరల్ పోలీసులు బంకు సిబ్బందిని మందలించి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. అనంతరం వాహనదారులు పోలీస్‌స్టేషన్‌తో ఫిర్యాదు చేసినట్లు తెలుస్తుంది.

అలుగు పోస్తున్న అడ్లూరు చెరువు

ప్రజాపక్షం/శాలిగౌరారం : గత మూడు రోజుల నుండి ఎడతెరపి లేకుండా కురుస్తున్న వర్షాలకు కుంటలు, చెరువులు జలకలతో సంతరించుకున్నాయి.తద్వారా వానాకాలం పంటలకి నీటి సమస్యలు ఉండవని మండల పరిధిలోని రైతు లు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.అడ్లూరు గ్రామంలోని చెరువు అలుగు పోస్తున్న దృశ్యాన్ని చూడడానికి గ్రామ ప్రజలు బారులు తీరి సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

ప్రజల రక్షణకు తక్షణ చర్యలు చేపట్టండి

మాజీ మంత్రి హరీష్‌రావు

ప్రజాపక్షం/దేవరకొండ : అకాల వర్షాల కారణంగా తెలంగాణ రాష్ట్రం వాయుగుండంలా మారి రాష్ట్ర ప్రజలు భారీ వర్షాల కారణంగా ఇబ్బందులు పడకుండా తక్షణ చర్యలు చేపట్టి ఆస్థి, ప్రాణ నష్టం జరగకుండా చూడాలని మాజీ మంత్రి హరీష్‌రావు ప్రభుత్వానికి సూచించారు. ఆదివారం నల్గొండ జిల్లా దేవరకొండలో మాజీ ఎంఎల్‌ఏ రవీంద్రకుమార్ నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం వెంటనే స్పందించి ఎక్కడికక్కడ అత్యవసర సేవలందించేందుకు బృందాలు ఏర్పాటు చేయాలని అన్నారు. అవసం అయితే సైన్యం సహాయం తీసుక

లోతట్టు కాలనీలు అప్రమత్తం

వాగు ఉధృతం.. అప్రమత్తం

ప్రజాపక్షం/పెద్దకొత్తపల్లి : గతరెండురోజులుగా కురుస్తున్న వర్షాల నేపథ్యంలో మండలంలోని కల్వకోల్ , కొండ్రావుపల్లి గ్రామాల మధ్య ఉన్న వాగు ఉధ్రిక్తత పెరగడంతో రెండు గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కల్వకోల్ గ్రామ బిఆర్ఎస్పార్టీ అధ్యక్షులు బంట్రోతుశ్రీను గ్రామాలప్రజలను కోరారు. రెండు గ్రామాల మధ్య ఉన్న వాగు ఉధ్రిక్తత పెరగడంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడిందని ఆయా గ్రామాల ప్రజలు చిన్న పిల్లలను వాగుదగ్గరికి వెళ్లకుండా చూడాలన్నారు. మరో రెండురోజులు భారీవర్షాలు ఉన్నందున అత్యవసరమైతే తప్ప గ్రామప్రజలు ఎవరు బయటకు వెళ్లరాదని అన్నారు.

పశువులకాపరులను కాపాడిన రెవెన్యూ, పోలీస్

ప్రజాపక్షం/పెద్దకొత్తపల్లి : గతరెండురోజులుగా భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో మండలంలోని చెన్నపురావుపల్లి గ్రామంలోని పెద్దవాగు మధ్యలో పశువులకాపర్లు చిక్కుకున్నారు. విషయం తెలుసుకున్న తహసీల్దార్ ఎస్ఐ సిబ్బంది సంయుక్తంగా ఆదివారం సహాయకచర్యలుచేపట్టి సోమశిల గ్రామంనుంచి చేపలపట్టిని తెప్పించి గ్రామప్రజల సహాయంతో వాగులో చిక్కుకున్న పశువులకాపరి రామస్వామిని అతని కుటుంబసభ్యులను బయటకు తీసుకొచ్చారు. ఈసహాయక చర్యల్లో తహసీల్దార్ ఎండి యూసుఫ్ఆలీ, ఎస్ఐ సతీష్, డిప్యూటి తహసీల్దార్ రమేష్నాయక్, రెవెన్యూ, పోలీస్ సిబ్బంది, గ్రామప్రజలు పాల్గొన్నారు.

శ్రీశైలం యాత్ర రద్దు

ప్రజాపక్షం/వెల్దండ : గత రెండురోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకారణంగా శ్రీశైలంవెళ్లే ప్రధాన రహదారి నల్లమల అటవీప్రాంతంలో అక్కడక్కడ డ్యామేజ్ అయినందున వాహనాలు వెళ్లడానికి అవకాశంలేకుండా భారీగా ట్రాఫిక్జామ్ కావడంతో జిల్లా ఎస్పిగైక్వాడ్ వైభవ్రఘునాథ్ ఆదేశాలమేరకు శ్రీశైలం పుణ్యక్షేత్రానికి యాత్రికులు ఎవరు రావద్దంటూ ఎస్ఐ కురుమూర్తి ఆధ్వర్యంలో మండలపరిధిలోని కొట్రజంక్షన్వద్ద ప్రత్యేక చెక్పోస్టును ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ హైదరాబాద్ వివిధ జిల్లాల నుంచి వయా కల్వకుర్తి, అచ్చంపేట మీదుగా శ్రీశైలం వెళ్లే భక్తులకు గత రెండురోజులనుండి కురుస్తున్న ముసురువర్షాలకు కొండచరియలు విరిగిపడే అవకాశం ఉన్నందున శ్రీశైలంఘాట్రోడ్లో ఇబ్బందులు తలత్తే అవకాశం ఉందని , శ్రీశైలం వెళ్లే కార్యక్రమాలను కొన్నిరోజులపాటు తాత్కాలికంగా వాయిదా వేసుకోగలరని కోరారు. జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాలమేరకు హైదరాబాద్ నుంచి వచ్చే వాహనాలను మండల కొట్రజంక్షన్, వంగూరు మండలం కోనేటిపురం దగ్గర నిలిపివేయనున్నట్లు తెలిపారు. శ్రీశైలం వెళ్లే భక్తులు వాహనదారులు ఇట్టి విషయంలో పోలీసువారికి సహకరించగలరని కోరారు.

వంగూర్ మండల ప్రజలు అప్రమత్తం

ప్రజాపక్షం/వంగూర్ : గత రెండురోజులనుంచి కురుస్తున్న భారీ వర్షాలకు ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మాజీ జడ్పిటిసి కెవిఎన్రెడ్డి అన్నారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ అత్యధికంగా వర్షాలు పడుతున్న సందర్భంగా పాత ఇండ్లలో నివాసం ఉండరాదని ఉధృతంగా ప్రవహిస్తున్న వాగులను, చెరువులను దాటరాదని ఆయన మండలప్రజలకు సూచించారు. అదేవిధంగా విద్యుత్స్తంభాలను తాకరాదని ఆయన పేర్కొన్నారు.

ప్రజలు అప్రమత్తం

జిల్లా కలెక్టర్ బదావత్సంతోష్

ప్రజాపక్షం/నాగర్కర్నూల్ప్రతినిధి : జిల్లాలో రాబోయే 48గంటలపాటు అతిభారీవర్షాలు కురుస్తున్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, అత్యవసర పరిస్థితుల్లో మాత్రమే బయటకురావాలని జిల్లా కలెక్టర్ బదావత్సంతోష్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. . వాతావరణశాఖ అందించిన సమాచారంమేరకు నాగర్కర్నూల్ జిల్లాలో మరో 48గంటలు అతిభారీవర్షాలు కురిసే అవకాశం ఉందని , పెద్ద ఎత్తున వరదలువచ్చే ప్రమాదం ఉందని కావున ప్రజలు ఎప్పటికప్పుడు జాగ్రత్తగా ఉండాలన్నారు. భారీవర్షాల నేపథ్యంలో సోమవారం అన్నిపాఠశాలకు సెలవు ప్రకటించినట్లు తెలిపారు. అదేవిధంగా ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణి సైతం రద్దుచేస్తున్నట్లు తెలిపారు. అతిభారీ వర్షాల నేపథ్యంలో అధికారులు ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉంటూ ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించాలని సూచించారు. అత్యవసర విభాగాల అధికారులు క్షేత్రస్థాయిలో ఉండాలని, ఎప్పటికప్పుడు సమాచారాన్ని కలెక్టరేట్ కార్యాలయానికి పంపాలని చెప్పారు. వరద ప్రభావిత ప్రాంతాల్లో అధికారులు వెంటనే స్పందించి తక్షణ సహాయక చర్యలు చేపట్టాలన్నారు. మత్స్యకారులు కృష్ణానదిలో , చెరువులు, కుంటల్లో చేపలవేటకు వెళ్లకూడదని కలెక్టర్ సూచించారు. కల్వకుర్తి మండలపరిధిలోని తర్నికల్ గ్రామంవద్దరోడ్డుపై ప్రవహిస్తున్న నదినీటిని పరిశీలించి నాగర్కర్నూల్ కల్వకుర్తికి ప్రయాణించే కార్లు, బైకులను అనుమతించొద్దని కలెక్టర్ సూచించారు. అదేవిధంగా తాడూరు మండలం సిర్సవాడ గ్రామానికి చెందిన ఆంజనేయులు, చిన్నమల్లయ్యలు దుందుభిన దిలో చిక్కుకుపోవడంతో వారిని సురక్షితంగా బయటికితీసేందుకు జిల్లా ఎస్పివైభవ్గైక్వాడ్ రఘునాథ్లతోకలిసి సహాయక చర్యలను పర్యవేక్షించారు. అధికారులు వారికి కేటాయించిన మండలాల్లోనే ఉండి మండలస్థాయిలో వివిధ విభాగాల సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ ఆదేశించారు.

సిపిఐ ధర్నా వాయిదా

ప్రజాపక్షం/నాగర్కర్నూల్ప్రతినిధి : నిత్యావసర వస్తువులు, ప్రజలు ఉపయోగించే ఇతర వస్తువుల ధరల పెరుగుదలకు వ్యతిరేకంగా సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంముందు నిర్వహించనున్న ధర్నా కార్యక్రమాన్ని భారీవర్షాలవలన వాయిదావేయడం జరిగిందని సిపిఐరాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఎం.బాల్నర్సింహ్మ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈకార్యక్రమం ఈనెల6న నిర్వహిస్తున్నామనికావున ప్రజలందరూ ఈధర్నాలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి, కలెక్టర్ విజయేందిరబోయి

ప్రజాపక్షం /మహబూబ్నగర్ ప్రతినిధి : భారీ వర్షాల నేపథ్యంలో మహబూబ్నగర్ పట్టణం సమీపంలో ఉన్న కొత్త చెరువు లోతట్టు కాలనీల ప్రజలను అప్రమత్తం చేయాలని జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి అధికారులను ఆదేశించారు. కొత్త చెరువుపై నుండి వర్షం నీరు వచ్చి చేరుతుండటం రానున్న 2 రోజులు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉండటం, కొత్త చెరువు నిండి మహబూబ్నగర్ పెద్ద చెరువుకు నీరు చేరే అవకాశం ఉన్నందున మహబూబ్నగర్ పట్టణంలోని లోతట్టు ప్రాంతాల ప్రజలను అప్రమత్తం చేయాలన్నారు. ఆదివారం ఆమె ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డితో కలిసి కొత్త చెరువును పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ , ఎమ్మెల్యేలు ఇంజనీరింగ్ అధికారులతో తీసుకోవాల్సిన చర్యలపై సమీక్షించారు. ఒకవేళ చెరువు నీరు నిండి మహబూబ్నగర్ పట్టణం గుండా పెద్ద చెరువుకు వస్తే పరిసర ప్రాంతాల కాలనీల ప్రజలను అప్రమత్తం చేయాలన్నారు. స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శివేంద్ర ప్రతాప్ , ఇరిగేషన్ డిఈ మనోహర్ , డిటి దేవేందర్ ఉన్నారు.

ప్రజలు అప్రమత్తం : ఎమ్మెల్యే

భారీగా కురుస్తున్న వర్షాలకు ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మహబూబ్నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి ప్రజలకు విజ్ఞప్తి చేశారు. మహబూబ్నగర్ , తాండూరు వెళ్లే దారిలో ఇబ్రహింబాద్ దగ్గర గత రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు తెగిపోయిన రోడ్డును జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి, అదనపు కలెక్టర్ శివేంద్ర ప్రతాప్ , ఆర్డీఓ నవీన్తో కలిసి ఆయన పరిశీలించారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ, పోలీసు అధికారులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు మహేందర్ , బుద్దారం సుధాకర్ రెడ్డి, వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

తెగిన బీమా కాలువ ... కొట్టుకపోయిన పంట పొలాలు

ప్రజాపక్షం / వీపనగండ్ల : గత రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాల వల్ల మండలంలో వాగులు, వంకలు, చెరువులు , కుంటలు పొంగి ప్రవహిస్తుండగా పంట పొలాల్ నుంచి వచ్చిన నీరు భీమా కాలువలో చేరి వీపనగండ్ల కాల్వరాల మధ్య భీమా కాలువ తెగిపోయి వరి పంట పొలాలకు నష్టం జరిగింది. వీపనగండ్లలో నారాయణ, కటిక శ్రీను, వెంకట్రావు కల్వరాలలో రంజిత్ , నర్సమ్మ, సత్యాన్న, పుల్గర్ చెర్లలో వడ్డే ఏలస్వామిలకు చెందిన మట్టి మిద్దెలు కూలిపోయాయి. ఇండ్లలో నివసించేవారు. ముందు జాగ్రత్తలు తీసుకోవడంతో ప్రాణ ఆస్తి నష్టం సంభవించలేదు. మండల కేంద్రంలోని వీపనగండ్ల వైకుంఠరెడ్డి నివాసంలో ఇంటి ఆడుగు భాగం నుంచి నీరు ఉబికి రావడంతో చిన్నపాటి మోటార్లను పెట్టి నీళ్లను బయటికి తోడేస్తున్నారు. భీమా కాలువ తెగిపోవడంతో ఆ నీటి ఉధృతికి గోపాల్ దిన్నె రిజర్వాయర్ పొంగి పొర్లుతుంది. దీంతో వీపనగండ్ల , గోవర్ధనగిరి గ్రామాల మధ్య ఉన్న బ్రిడ్జిలపై నుంచి నీరు ఎక్కిపారుతుండటంతో వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. తుముకుట వద్ద ఉన్న ఓంకారేశ్వర వాగు ఉధృతంగా ప్రవహిస్తుంది. రైతులు పంట పొలాలకు సాగునీటి కోసం వాగులో వేసుకున్న మోటార్లు కొన్ని కొట్టుకుపోయినట్లు రైతులు తెలిపారు. వీపనగండ్ల గ్రామ సమీపంలోని 16వ ప్యాకేజీ భీమా కాల్వకు పలుచోట్ల గండ్లు పడ్డాయి. తహసీల్దార్ వరలక్ష్మి గోవర్ధనగిరి సమీపంలో రోడ్డుపై పొంగిపొర్లుతున్న వరద ప్రవాహాన్ని పరిశీలించి వాహనాల రాకపోకలు నిలిపివేశారు. భారీ వర్షాలు కురుస్తుండటంతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, మట్టి మిద్దెలో నివసించకుండా సురక్షిత ప్రాంతాలకు తరలి వెల్లాలని సూచించారు. బొల్లారం ఉరకుంట నిండి కట్టపై నుంచి నీళ్లు పారడంతో కట్టకింద ఉన్న వరి పొలాలు మునిగిపోయాయి.

12 గ్రామాలకు నిలిచిపోయిన రాకపోకలు

ప్రజాపక్షం / గోపాలపేట : గోపాలపేట, రేవల్లి మండలంలోని 12 గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. రెండు రోజులుగా ఎడతెర్పుగా భారీగా కులుస్తున్న వర్షాలకు ప్రజలు ఇంటికే దిగ్బంధమయ్యారు. పగలు రాత్రి ఎడతెర్పుగా వర్షాలు కురవడంతో చెరువులు, కుంటలు అలుగులు పారుతున్నాయి. అంతేకాకుండా వర్షంతో పాటు ఈదురు గాలులకు చెట్లు ఎక్కడికక్కడే విరిగి రహదారులపై అడ్డంగా పడ్డాయి. రేవల్లి మండలంలోని కేశంపేట, నాగపూర్ , బండరాయిపాకుల , గొరీదేవిపల్లి , తలపనూరు గ్రామాలలో రహదారులపై నిర్మించిన వంతెనలపై నీరు పారుతుండటంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. ముఖ్యంగా గోపాలపేట, మండల కేంద్రంలో ఉన్న అయోధ్య కాలనీలో సుమారుగా 50 గృహాలలో నివాసం ఉంటున్న ప్రజలు బయటికి రాలేక ఇబ్బందులకు గురవుతున్నారు. రెండు రోజులుగా వర్షాలు కురవడం పట్ల ఈ అయోధ్య కాలనీ చుట్టూ మోకాళ్ల లోతు నీరు చేరాయి. కాలనీవాసులు బయటకు రాలేక అవస్థలకు గురవుతున్నారు. రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు వరి సాగు నీట మునిగింది.

సమస్యాత్మక ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి : ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి

ప్రజాపక్షం / వనపర్తి టౌన్ : ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాలకు పట్టణంలోని లోతట్టు ప్రాంతాలు, సమస్యత్మక ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారించాలని ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నారాల వద్ద సమస్యల పరిష్కారానికి చేపట్టిన పనులను ఆయన ప్రత్యేకంగా పరిశీలించారు. కాలువల వెంట వచ్చిన చెత్తాచెదారాన్ని, చెట్లను మిషన్లతో తొలగిస్తూ వరద నీరు ఎక్కడ ఆగకుండా వెళ్లేలా చర్యలు చేపట్టాలన్నారు. శ్వేతానగర్ , బసవన్న గడ్డ, పాతకోటలో ప్రాంతాలలో ఆయన పర్యటించారు. భారీగా కురుస్తున్న వర్షాల నేపథ్యంలో పట్టణంలోని లోతట్టు ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారించి ఎప్పటికప్పుడు సహక చర్యలు చేపట్టేలా ఉండాలని మున్సిపల్ చైర్మన్ పుట్టపాకల మహేష్ కు ఎమ్మెల్యే సూచించారు.

శ్రీరంగాపూర్

ప్రజాపక్షం / శ్రీరంగాపూర్ : ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు మండలంలో శేరుపల్లి దగ్గర పెబ్బేరు కొల్లాపూర్ రోడ్డు తెగి ప్రయాణికులకు తీవ్ర ఇబ్బందులు ఏర్పడ్డాయి. నిరంతరంగా కురుస్తున్న వర్షాల వల్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పాత ఇండ్లను మండల స్పెషల్ ఆఫీసర్ నూషిత అన్నారు. ఆదివారం అధికారులతో కలిసి ఆమె మండల పరిధిలోని తాటిపాముల గ్రామంలోని దెబ్బతిన్న మట్టి ఇండ్లను పరిశీలించి ప్రజలకు అవగాహన కల్పించారు. గ్రామ పంచాయతీ, ఇతర కమిటీ హాల్లోకి ఆ కుటుంబాలను తరలించారు. వర్షాలకు తాటిపాముల చెరువు నిండి అలుగు పారుతుంది. అధికారులు పరిశీలించి నీటి ప్రవాహం దగ్గర అప్రమత్తంగా ఉండాలని ప్రజలకు అవగాహన కల్పించారు. చిన్న పిల్లలు చెరువు దగ్గరికి వెళ్లకుండా చూడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రామ స్పెషల్ ఆఫీసర్ తహసీల్దార్ మురళి, ఎంపీఓ రాజు, ఆర్ఐ రాధకృష్ణ, పంచాయతీ సెక్రటరీ శివకుమార్ , గ్రామస్తులు పాల్గొన్నారు.

రంగసముద్రం గేట్లు ఎత్తివేత

మండల కేంద్రంలోని రంగసముద్రం రిజర్వాయ నీటిని ఎంపీ మల్లురవి , వనపర్తి ఎమ్మెల్యే మేఘారెడ్డి గేట్లు ఎత్తి నీటిని కిందకు వదిలారు. గత మూడు రోజులుగా కురుస్తున్నటువంటి వర్షాల వల్ల రంగసముద్రం రిజర్వాయర్ నిండుగా నీళ్లతో పరవల్లుతొక్కుతుంది. రంగసముద్రం రిజర్వాయర్ గేట్లు ఎత్తినీటిని వదలడం వల్ల దిగువన ఉన్న గ్రామాలకు ప్రమాదం పొంచి ఉందని ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి అన్నారు. శ్రీరంగాపురం , రంగసముద్రం రిజర్వాయర్ కింద ఉన్న టువంటి దిగువ ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వారికి ఎటువంటి సహాయసహకారాలు కావాలన్నా అధికారులకు తెలియజేయాలని వారు సూచించారు. ఈ కార్యక్రమంలో వనపర్తి డిసిసి అధ్యక్షులు రాజేంద్రప్రసాద్ , శ్రీరంగాపూర్ మండల నాయకులు బీరం రాజశేఖర్ రెడ్డి, నాయకులు శ్రీహరి, మండల ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శి ఆశన్న, వహిద్ , శ్రీరంగాపూర్ గ్రామ, మండల ప్రజలు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

నిండిన చెరువులు, కుంటలు

ప్రజాపక్షం / పెద్దమందడి : బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడటం వలన భారీ వర్షాలకు పెద్దమందడి మండలంలోని వివిధ గ్రామాలలో చెరువులు అలుగులు పంపులు పొంగిపొర్లు పారుతున్నాయి. గత మూడు రోజు నుండి భారీ వర్షాలు రావడం వలన మండంలోని వివిధ గ్రామాలలో చెట్లు విరిగి విద్యుత్ తీగలపై పడినందువలన గ్రామాలలో విద్యుత్ అంతరాయం కలిగింది. గ్రామాలలో డ్రైనేజ్ కాలుల నుండి రోడ్లపై నీరు పోవడం వలన పెద్దమందడి మండల కేంద్రంలోని షాపులలో వర్షపు నీళ్లు పోయావే వివిధ గ్రామాలలో యువకులు చర్యలు చేపట్టారు. చెరువులు , కుంటలు గండిపడిన చోట మరమ్మతులు చేపట్టారు. మండలంలోని చెరువులు , కుంటలు నిండుకుండలాగా కళకళలాడుతున్నాయి. అధికారులు, పోలీసు యంత్రాంగం భారీ వర్షాలు ఆల్పపీడనం ఏర్పడినందు వలన భారీ వర్షాలు వలన పడుతున్నందుకు అప్రమత్తంగా ఉండాలని హెచ్చరిస్తున్నారు.

ప్రజలందరూ అప్రమత్తం

ప్రజాపక్షం/పెద్దకొత్తపల్లి : రానున్న మరో రెండురోజుల్లో భారీ, అతిభారీవర్షాలు కురిసే అవకాశం ఉందని, వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో మండల ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని ఎస్ఐ సతీష్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. పురాతన ఇండ్లలో ఉండేవాళ్లు సురక్షితమైన ప్రదేశాల్లో ఉండాలని, వాగులుపొంగే అవకాశం ఉన్న నేపథ్యంలో రైతులు ముందస్తు జాగ్రత్తలు పాటించాలన్నారు. వర్షంలోతడిచిన విద్యుత్స్తంభాలు, బోరుమోటార్లు, స్విచ్బోర్డులు తడిచేతులతో ముట్టుకోరాదన్నారు. అత్యవసర పరిస్థితుల్లో 100కు డయల్చేయాలని మండలప్రజలకు పిలుపునిచ్చారు.

సరళసాగర్‌ను సందర్శించిన ఎమ్మెల్యే

ప్రజాపక్షం / కొత్తకోట : మదనపురం మండల కేంద్రంలో శంకరంపేట గ్రామ పరిధిలోని సరళసాగర్ ప్రాజెక్టు గేట్లు ఆటోమేటిక్ సైఫాన్ సిస్టం ఓపెన్ అవడంతో నేడు సరళసాగర్ ప్రాజెక్టును ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సైఫాన్ సిస్టం ఓపెన్ అవడం వల్ల పర్యాటకులు వస్తున్న సందర్భంగా సెల్ఫీలు దిగుతూ ప్రమాదాల భారిన పడే అవకాశం ఉండటం వల్ల బందోబస్తు నిర్వహించాలని కోరారు. సకాలంలో వర్షాలు కురిసి నియోజకవర్గంలో ప్రధాన జలాశయాలైన కోయిల్సాగర్ , సరళసాగర్ నిండటం నియోజ కవర్గంలో ఎక్కడికక్కడ చెరువులు, కుంటలు అలుగు పరడం వట్ల హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా భగవంతునికి కృతజ్ఞతలు తెలియజేశారు.

డాక్టర్ కె.ముత్యం సంస్మరణ సభ

ప్రజాపక్షం/హైదరాబాద్ : ప్రముఖ తెలుగు సాహిత్య పరిశోధకుడు డాక్టర్ కె.ముత్యం సంస్మరణ సభ నారాయణగూడ లోని భరత్ విద్యాసంస్థలో ఆదివారం జరిగింది. ఉస్మానియా ఆర్ట్స్ కాలేజ్ పూర్వ అధ్యక్షులుగా పని చేసిన డాక్టర్ ముత్యం బెనారస్ విశ్వవిద్యాలయంలో శ్రీకాకుళ ఉద్యం పై పరిశోధన చేసి డాక్టరేట్ పొందారు. తర్వాత శాతవాహన విశ్వవిద్యాలయ అద్యాపకునిగా పనిచేసి పదవీ విరమణ గావించారు. మరుగున పడిన చరిత్రలను వెలుగులోకి తెచ్చి పుస్తకాలు ప్రచురించారు. కార్యక్రంలో ఎంఎల్సి కోదండరాం, ప్రముఖ కవులు శివారెడ్డి, నంధిని సిధారెడ్డ్, ప్రొఫెసర్ వినాయక్ రెడ్డి, ఆర్ట్స్ కాలేజ్ పూర్వ అధ్యక్షులు తుల రాజేందర్, సూర ప్రభాకర్ రెడ్డి, భరత్ విద్యాసంస్థల అధినేత వేణుగోపాల్ రెడ్డి, మాజీ యంల్ ఏ పటోళ్ల శశిధర్ రెడ్డి, సుధాకర్, జూలూరు గౌరీశంకర్, బండ్ల మాధవ రావు, నాళేశ్వరం శంకర్ , సాధినేని వెంకశ్వర రావు, పోటు రంగారావు, కుటుంబ సభ్యులు అపర్ణ, ప్రత్యూష, వసంత్, గుల్మహర్ కాలనీ ప్రసిడెంట్ కాశీం, మాజీ సీటీవో అన్నర్ పాషా తదితరులు ముత్యంగార్ శిష్యులు రమేష్, అక్బర్, విజయ్, చైతన్య , జెఎన్టియు మాజీ రిజిష్ట్రార్ వినయ్ బాబు ఉన్నత విద్యామండలి చైర్మన్ , ప్రొఫెసర్ లింబాద్రి,కె. గోవర్ధన్, ఎం శ్రీనివాస్ ఇతర ప్రముఖులు పాల్గొన్నారు.

కలుషిత నీరు, సీవరేజి సమస్యలపై ప్రత్యేక దృష్టి

నగరంలో పర్యటించిన జలమండలి ఎం.డి. అశోక్ రెడ్డి

ప్రజాపక్షం/హైదరాబాద్ : ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాల వల్ల ప్రజలకు ఇబ్బంది లేకుండా అన్ని రకాలుగా ముందస్తు చర్యలు చేపట్టాలని, ఈఆర్టి బృందాలు అప్రమత్తంగా ఉండాలని జలమండలి ఎం.డి. అశోక్ రెడ్డి అధికారులను ఆదేశించారు. ఆదివారం అధికారులతో కలిసి నగరంలోని పలు ప్రాంతాల్లో ఆయన పర్యటించారు. డివిజన్ 3 పరిధిలోని మెహదీపట్నం ఎంఎన్ డిసి భవనం వద్ద సీవరేజ్ పూడికతీత పనులను పరిశీలించారు. ఈ సందర్భగా మాట్లాడుతూ వర్షాల నేపథ్యంలో సీవరేజి ఓవర్ఫ్లో సమస్యలు తలెత్తకుండా అప్రమత్తంగా ఉండాలని అధికారులను ఆదేశించారు. తాగునీరు సరఫరా అయ్యే సమయంలో కచ్చితంగా మంచినీటి నాణ్యతను పరీక్షించాలని అధికారులను ఆదేశించారు. ఎక్కడా తాగునీరు కలుషితం కాకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. బస్తీలు, లోతట్టు ప్రాంతాల పట్ల మరింత అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. క్లోరిన్ బిల్లలను ఇంటింటికి పంపిణీ చేసి, వాటిని వినియోగించి నీటిని శుద్ధి చేసుకునే తీరుపై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. అక్కడే నగరానికి మంచినీరు సరాఫరా చేసే గండిపేట కాండూన్ అమర్చిన ప్రెషర్ ఫిల్టర్లను పరిశీలించారు.

జంట జలాశయాల సందర్శన..

హిమాయత్ సాగర్, ఉస్మాన్ సాగర్ (గండిపేట) జంట జలాశయాలు ఎగువ ప్రాంతాల్లో భారీగా కురుస్తున్న వర్షాల వల్ల రిజర్వాయర్లకు వరద నీరు వచ్చి చేరడంతో జలమండలి ఎం.డి. అశోక్ రెడ్డి జంట జలాశయాలను అధికారులతో కలిసి సందర్శించారు. జంట జలాశయాలకు వరద మొదలైనందున రెవెన్యూ, సంబంధిత అధికారులను అప్రమత్తం చేశారు. ఎప్పటికప్పుడు వరద పరిస్థిని అంచనా వేస్తూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఎలాంటి పరిస్థితులనైనా ఎదుర్కోవడాననికి, అవసరమైన సహాయక చర్యలు చేపట్టేందుకు సన్నద్ధం కావాలని హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాల పరిపాలనా యంత్రాంగంతో పాటు, జిహెచ్ఎంసి, పోలీసు అధికారులను అప్రమత్తం చేశారు.

క్షేత్ర స్థాయిలో పర్యటించిన ఈడి..

భారీ వర్షాల నేపథ్యంలో జలమండలి ఈడి మయాంక్ మిట్టల్ సైతం నగరంలోని బండ్లగూడా, హనుమాన్ నగర్, గోడే కె ఖబర్ సెక్షన్ పరిధులలో సంబంధిత అధికారులతో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ నీరు నిలిచే ప్రాంతాల్లో ప్రత్యేక శ్రద్ధ పెట్టాలన్నారు. ఎక్కడైనా మాన్ హోల్ ధ్వంసమైన, కనిపించకుండా పోయినా వెంటనే కొత్త మాన్ హోల్ ఏర్పాటు చేయాలని సూచించారు. మంచినీరు, మురుగునీరు సంబంధించిన ఏమైనా ఉంటే జలమండలి కస్టమర్ కేర్ నెంబర్ 155313 కి ఫోన్ చేసి పిర్యాదు చెయ్యాలని సూచించారు.

ఎటువంటి విపత్కర పరిస్థితులనైనా ఎదుర్కొనేందుకు సిద్ధం

మున్సిపల్ ముఖ్యకార్యదర్శి దానకిషోర్

ప్రజాపక్షం/హైదరాబాద్: గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో భారీ వర్ష సూచన ఉందని వాతావరణ శాఖ హెచ్చరించిన నేపథ్యంలో ఎటువంటి విపత్కరమైన పరిస్థితినైనా ఎదుర్కొనేందుకు సర్వసన్నద్ధంగా ఉన్నామని పురపాలక శాఖముఖ్య కార్యదర్శి ఎం దానకిషోర్ తెలిపారు. జిహెచ్ఎంసి, హెచ్ఎండిఎ,జలమండలి,హైడ్రాకు చెందిన మొత్తం మొత్తం 610 అధికారిక బృందాలు క్షేత్ర స్థాయిలో అందుబాటులో ఉన్నాయన్నారు. హైదరాబాద్, హుసేన్సాగర్లోని పలు ప్రాంతాల్లో దానకిశోర్ ఆదివారం పర్యాటించారు. హుసేన్ సాగర్ క్షేత్ర పరిస్థితితో పాటు అశోక్ నగర్, విద్యానగర్, పద్మకాలనీ లలోని నాలాలను జిహెచ్ఎంసి అధికారులతో కలిసి ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా దాన కిషోర్ మీడియాతో మాట్లాడుతూ అల్లాపూర్, కూకట్ పల్లి మినహా గ్రేటర్ లో చిన్న చిన్న ఇబ్బందులు తప్ప ఎటువంటి పెద్ద ఘటనలు నమోదు కాలేదన్నారు. అల్లాపూర్, కూకట్ పల్లి ఏరియాలో 20 ఇల్లు నీట మునిగినట్టు సమాచారం వచ్చిందన్నారు. పురాతన, శిధిలావస్థకు చేరిన గోడలు కూలి ప్రజలు ప్రమాదాల బారిన పడే అవకాశం ఉన్న దృష్ట్యా అలాంటి ప్రదేశాలను గుర్తించాలని, జిహెచ్ఎంసి ఉప కమిషనర్లను, టౌన్ ప్లానింగ్ అధికారులను ఆదేశించారు. ఉస్మాన్ సాగర్, హిమాయత్ సాగర్ పూర్తి నిల్వ సామర్థ్యానికి ఇంకా 8 అడుగుల గ్యాప్ ఉన్నదన్నారు.

ఫోకస్

వాటర్ బాటిళ్లతో ప్రమాదమే

స్వచ్ఛమైన నీరు లేదా ఫిల్టర్ నీటిని తాగుతున్నామని అనుకుంటూ, వాటర్ బాటిల్స్‌ను కొనుక్కుంటున్న వారి సంఖ్య ఇటీవల కాలంలో విపరీతంగా పెరిగింది. మినరల్ వాటర్ పేరుతో మనకు లభిస్తున్న వాటర్ బాటిళ్లు కూడా మంచివికావని, వాటితోనే ప్రమాదం పొంచి ఉందని వైద్య నిపుణులు స్పష్టం చేస్తున్నారు. ఆస్ట్రియాలోని డానుబే విశ్వవిద్యాలయం మెడిసిన్ విభాగం జరిపిన పరిశోధనల ప్రకారం, బాటిళ్లలో నీరు తాగడం వల్ల అనేక రకాలుగా ఆరోగ్య సమస్యలు తలెత్తుతాయి. వాటిలో అధిక రక్తపోటు ఒకటి. బ్లడ్‌ప్రెషర్ (బిపి)ని పెంచే కారకాల్లో వాటర్ బాటిల్స్ కూడా చేరాయి. భూమి అనేక రకాలుగా కలుషితమైంది. వాటిలో ఒకటి మైక్రోప్లాస్టిక్స్. మన ఆహారం మరియు నీటి సరఫరాలో ఎక్కువ భాగం కనిపించే ప్లాస్టిక్ చిన్న కణాలు. ఇవి మానవులకు అత్యంత హానికరమైన పదార్థాలలో ఒకటిగా పేర్కొంటున్నారు. ఇది మన ఆరోగ్యాన్ని ప్రతికూలంగా ప్రభావితం చేస్తుంది. న్యూయార్క్ పోస్ట్ కూడా ఈ విషయాన్ని ధ్రువీకరించింది. మైక్రోప్లాస్టిక్లు రక్తప్రవాహంలోకి ప్రవేశించడం వల్ల ప్లాస్టిక్ సీసాల నుండి తాగడం వల్ల రక్త పోటు పెరుగుతుందని తేల్చిచెప్పింది.. ఇవి ఇప్పటికే గుండె ఆరోగ్యం, హార్మోన్ అసమతుల్యత, క్యాన్సర్‌తో ముడిపడి ఉన్నాయి. ప్లాస్టిక్ బాటిల్స్ వాడిన, వాడని వారిని పరీక్షించిన తర్వాత ఈ ఫలితాలు వచ్చినట్టు ఆస్ట్రియా, న్యూయార్క్ టైమ్స్ నివేదికలు పేర్కొంటున్నాయి. అధిక రక్తపోటుకు ఇప్పటికే పలు అంశాలు ఉత్ప్రేరకాలుగా ఉంటే, వాటర్ బాటిల్స్ కూడా ఆ జాబితాలోకి రావడం ఆందోళన కలిగించే అంశం.

ఎన్నో రుగ్మతలకు ఒత్తిడే కారణం



తీవ్రమైన ఒత్తిడి మానసిక, శారీరక రుగ్మతలకు కారణమవుతుంది. అందుకే, సాధ్యమైనంత వరకూ ప్రశాంతంగా ఉండాలని వైద్యులు సూచిస్తుంటారు. ఒత్తిడితో చిరాకు పెరుగుతుంది. చుట్టుపక్కల వారి ఉనికి అసహనాన్ని పెంచుతుంది. ఒంటరిగా ఉండానికి ఇష్టపడతారు. ప్రతికూలైన మాటలు, చేష్టల వెనుక ఉన్న మానసిక పరిస్థితిపై క్వీన్స్ లాండ్‌కు చెందిన 'గైడ్‌లైట్' మానసిక నిపుణుడు పీటర్ కోయల్ ఎన్నో పరిశోధనలు చేశాడు.ఆయన కనుగొన్న విషయాలను నివేదిక రూపంలో వెల్లడించాడు. ఆయన సిద్ధాంతం ప్రకారం, అనేక మంది ఒత్తిడుల మధ్య నలిగిపోతున్నారు. ఏదో ఒక విషయం నిరంతరం వారిని వెంటాడుతునే ఉంటుంది. కొంత మంది లేని సమస్యలను ఊహించుకుంటూ, బాధపడడాన్ని కూడా మనం చూస్తూ ఉంటాం. నిజానికి ఆందోళన, ఒత్తిడి ప్రతి మనిషిలోనూ ఉంటుంది. అందులో మినహాయింపులు లేవు. అయితే కొంత మంది తీవ్రమైన ఒత్తిడికి గురవుతారు. మరికొంత మంది సమస్యను అధిగమించగలమన్న ధీమాను వ్యక్తం చేస్తారు. ఎంతగా ఒత్తిడికి గురైతే, అంతగా పొరపాట్లు చేసే సందర్భాలు పెరుగుతాయన్నది నిజం. ఒత్తిడితూ బాధ పడే వారిలో యాభై శాతం మంది చికాకు, నిరాశతో తమలో తాము తెలియకుండానే వ్యతిరేక ధోరణితో మాట్లాడుకుంటారు. నలభై ఒక్క శాతం మంది వేళా పాళ లేకుండా ఆహారం తీసుకోవడం, ఎక్కువగా నిద్ర పోవడం, వంటివి చేస్తుంటారు. ముప్పై ఆరు శాతం మంది తమను తాము నిందించుకుంటారు. చాల మందిలో ఈ లక్షణాలన్నీ కలిసే ఉంటున్నాయి. ముప్పై తొమ్మది శాతం మంది ఐటీ బాగా కోపంగా కూడా వుంటారు. వ్యక్తిత్వం, మన చుట్టూ పక్కల పరిస్థితులతో పటు గందరగోల జీవన శైలి, కుటుంబం లో వున్నా వ్యక్తి గత జీవితం, సరిగ్గా లేకపోవటం, భావోద్వేగం తీవ్ర స్థాయి హెచ్చు తగ్గులు వంటివి ఒత్తిడికి కూడా ప్రధానమైన కారణాలేనాని ఆమె పేర్కొంటున్నారు. కాగా, మన దేశంలో ఒత్తిడికి గురవుతున్న వారిలో మహిళలే ఎక్కువని తాజా నివేదిక వెల్లడిస్తున్నది. బాధితులలో యాభై ఎనిమిది శాతం మందికి వైద్యం అవసరం వున్నా కేవలం ఆరు శాతం మంది మానసిక నిపుణులను స్వయంగా వెళ్లి సంప్రదిస్తున్నారు. వివాహమైన వారికంటే కానీ వారే ఒత్తిడిని సమర్ధంగా ఎదుర్కొంటున్నారని తెలుస్తోంది. తీవ్ర స్థాయి ఒత్తిడిని ఎదుర్కొంటున్న వారు తప్పకుండా మానసిక వైద్య నిపుణులను కలసి తమకి వున్నా సమస్యలను విపులంగా వివరించి వారి సూచనలు, సలహాల మేరకు నడచుకుంటే మంచిది.

ఆరోగ్యం

కంటికి మేలు విటమిన్ 'ఎ'

కంటి చూపును సవ్యంగా ఉంచడంలో విటమిన్ 'ఎ' పాత్ర ముఖ్యమైనది. వ్యాధి నిరోధక చర్యలు, చర్మ దృఢత్వానికి ఇది దోహదం చేస్తుంది. ఇది కొవ్వులో కరిగే విటమిన్. మన దేశంలో మూడు శాతం మంది పిల్లలు విటమిన్ 'ఎ' లోపం కారణంగా కంటిలో బిటాట్ స్పాట్ (తెల్లని క నుగుడ్డుపై నల్లటి మచ్చ)తో బాధ పడుతున్నారు. విటమిన్ ఎ లోపం తొలిదశ లక్షణాల్లో రేచీకటి మొదటిది. గర్భవతులకు విటమిన్ 'ఎ' లోపం లేకుండా జాగ్రత్తలు తీసుకోపోతే, కాన్పు సమయంలో సమస్యలు ఎదురవుతాయని వైద్యులు హెచ్చరిస్తున్నారు. ఆకుకూరలు, వివిధ రకాల పండ్లు, కూరగాయల్లో విటమిన్ 'ఎ' అధికంగా ఉంది. కొత్తిమీర, కరివేపాకు, మునగాకు, మెంతి కూర, క్యారెట్, మామిడి పండు, బొప్పాయి పండు, గుమ్మడికాయ , బొప్పాయి పండు తదితరాల్లో విటమిన్ 'ఎ' ఉంటుంది కాబట్టి, ఆహారంలో వీటిని చేర్చుకునే ప్రయత్నం చేయాలి.

సూక్ష్మ పోషకాలు....

మన శరీరానికి అతి సూక్ష్మమైన మోతాదులో అవసరమైన విటమిన్లు, ఖనిజాలను 'సూక్ష్మ పోషకాలు' అంటారు. వ్యాధులతో పోరాడటానికి, అంటు వ్యాధులు రాకుండా ఉండటానికి సూక్ష్మ పోషకాలు అవసరం. అంతేగాక మనం తీసుకొనే అహారం చక్కగా జీర్ణమై, శక్తిని యివ్వడానికి ఇవి తోడ్పడతాయి. ఆరోగ్య పరిరక్షణ, దీర్ఘాయువుకు ఇవి చాలా అవసరం.

శరీరం తయారు చేసుకునే విటమిన్!

విటమిన్లను మన శరీరం సొంతంగా తయారు చేసుకోలేదు. అయితే, ఆహారాన్ని విటమిన్ల రూపంలో మార్చుకుంటుంది. కానీ, శరీరం తయారు చేసుకోగలిగిన విటమిన్ ఎదైనా ఉందా అంటే అది విటమిన్ 'డి'. సూర్యరశ్మి ఎక్కువగా తగలకపోతే, ఈ లోపం వచ్చే ప్రమాదం ఉంది. శారీరక శ్రమ లోపించటం, పూబకాయం, మద్యం తాగడం వంటి కారణాలతో నానాటికీ మన శరీరంలో విటమిన్'డి' అవసరాలు పెరిగిపోతున్నాయి. సూర్యరశ్మి సహాయంతో దీన్ని చాలావరకూ మన శరీరమే తయారు చేసుకుంటుంది, చాలా కొద్దిభాగం మాత్రమే ఆహారం ద్వారా లభిస్తుంది. వాస్తవానికి విటమిన్‌డిలో డి1, డి2.. ఇలా 5 రకాలున్నాయిగానీ 'డి3'నే మనకు ఎక్కువగా ఉపయోగపడుతుంది. దీన్నే 'కోలీకాల్సిఫెరాల్' అంటారు. ఇది మన శరీరంలో ఏదో ఒక్కచోటే తయారయ్యేది కాదు. రకరకాల దశల్లో, వివిధ రూపాల్లో పరిణామం చెందుతుంది.

పోటీ కోసం ఇవి

(గ్రూప్స్‌కు సిద్ధమవుతున్న వారికోసం)

- కార్గిల్ యుద్ధంలో ఉపయోగించిన మిస్సైల్స్ ఏవి?
  పినాక
- ఇక్ష్వాకుల రాజలాంఛనం ఏది?
  సింహ
- అంతర్జాతీయ పర్యావరణ మొదటి సదస్సు ఎప్పుడు జరిగింది?
  1972
- వధువును డబ్బు ఇచ్చి కొనుక్కునే వివాహ పద్ధతి ఏది?
  అసుర
- 'ఘటిక' అనేది ఎవరి నివాస స్థావరం?
  బ్రాహ్మణ పండితులు
- ప్రపంచ ఆర్థిక వేదిక (డబ్ల్యూఈఎఫ్) వార్షిక సమావేశాలను ఏటా జనవరిలో ఎక్కడ నిర్వహిస్తారు?
  దావోస్
- 'రెటీనైటిస్ పిగ్మెంటోసా' అనే వ్యాధి శరీరంలోని ఏ భాగానికి సంబంధించింది?
  కళ్లు
- 49వ అక్షాంశ రేఖ ఏయే దేశాలను వేరుచేస్తుంది?
  అమెరికా, కెనడా
- ఇటీవల వార్తల్లోకి వచ్చిన ఖుషాబ్ న్యూక్లియర్ కాంప్లెక్స్ ఏ దేశంలో ఉంది?
  పాకిస్థాన్
- సునామీ అనేది ఎలాంటి విపత్తు?
  భౌగోళిక
- గ్రీకులు 'హైడస్పస్'గా పిలిచిన భారత నది ఏది?
  జీలం
- కర్ణాటక రాజ్య రాజధాని ఏది?
  ఆర్కాట్
- మానవుల జీర్ణవ్యవస్థలో ఉత్పత్తి అయ్యే ఆమ్లం ఏది?
  హైడ్రోక్లోరిక్ ఆమ్లం
- భారతదేశంలో మొదటి న్యూక్లియర్ పవర్ ప్లాంటును ఎక్కడ నెలకొల్పారు?
  తారాపూర్
- పెన్నానదికి ఎక్కడ ఆనకట్ట కట్టారు?
  నెల్లూరు
- అసంపూర్ణంగా విభజన చెందిన జఠరిక గల జంతువు ఏది?
  తొండ
- రైల్వే స్టేషనులో ఉపయోగించు త్రాసు
  ప్లాట్ ఫారమ్ కాటా
- తల్లి పాలను స్రవించడానికి ఉపయోగపడే హార్మోను పేరేమిటి?
  లాక్టోజనిక్ హార్మోను
- కాపర్ సల్ఫేట్ రంగు
  నీలము
- 'అక్షర సంక్రాంతి' పథకం దేనికి సంబంధించినది?
  అక్షరాస్యతను పెంపొందించడం
- మెదడును కప్పి ఉండే లోపలి పొర
  మృద్వి
- ఆంగ్లేయ విప్లవం ఏ సంవత్సరంలో సంభవించింది?
  1688
- క్రింది వానిలో ఏది ప్రాథమిక హక్కు కాదు
  ఆస్తి హక్కు
- మొదటి కర్ణాటక యుద్ధం?
  1746–1748

మధ్యాహ్న భోజన కార్మికులకు ఉద్యోగ భద్రత : ఉపేందర్

ప్రజాపక్షం/ సిర్పూర్(టి) : మధ్యాహ్న భోజన కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలని ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి భోగే ఉపేందర్ అన్నారు. ఆదివారం సిర్పూర్(టి) మధ్యాహ్న భోజన కార్మికుల (ఎఐటియుసి) సమావేశం శాంతమ్మ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా మధ్యాహ్న భోజన కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలని, కనీస వేతనం రూ. 26 వేలు ఇవ్వాలని, ఇఎస్ఐ,పిఎఫ్ సౌకర్యం కల్పించాలని, సెంట్రలైజ్డ్ కిచెన్ విధానాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. కార్మికులు అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారన్నారు. బిల్లులు సకాలంలో అందక కార్మికులు అప్పులు చేసి పథకాన్ని నిర్వహిస్తూ అనేక ఆర్థిక, మానసిక క్షోభకు గురవుతున్నారన్నారు. ఈనెల 9,10వ తేదీలలో జరిగే టోకెన్ సమ్మెను జయప్రదం చేయాలని అన్నారు. కార్యక్రమంలో ఎఐటియూసి జిల్లా అధ్యక్షుడు టి.దివాకర్, ఉపాధ్యాక్షుడు చిరంజీవి పాల్గొన్నారు.

సిర్పూర్ (టి) నూతన కమిటి ఎన్నిక ...సమావేశం అనంతరం నూతన కమిటిని ఎన్నుకున్నారు. అధ్యక్షురాలుగా ఇ.కాంతమ్మ, ఉపాధ్యక్షురాలుగా విజయ లక్ష్మి, ప్రధాన కార్యదర్శిగా బుజ్జమ్మ, సహాయ కార్యదర్శిగా సత్తమ్మ, ప్రచార కార్యదర్శిగా రమాదేవి, కోశాధికారిగా ఆశక్కలను ఎన్నుకున్నట్లు ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి భోగే ఉపేందర్ తెలిపారు.

పోడుభూములకూ రుణమాఫీ

రైతు సంఘం, సిపిఐ డిమాండ్

ప్రజాపక్షం/వెంకటాపూర్ : మండల కేంద్రంలో రైతు సంఘం సమావేశంలో ఆదివారం జరిగింది. సమావేశంలో రైతు సంఘం జిల్లా కన్వీనర్ ఎండి అంజద్ పాష, సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి జంపాల రవీందర్ మాట్లాడుతూ రైతాంగం సమస్యలు పరిష్కరించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వైఫల్యం చెందాయి అన్నారు. రుణమాఫీ పూర్తి చేశామని చెపుతున్న ప్రభుత్వం పహనీ నకల్ ద్వారా పొందిన రుణాలను మరియు పోడు భూముల పట్టాలకు 1భి లేదనే సాకుతో మాఫీ జరుగలేదు అన్నారు. దానితో పాటు రూ.2,50,000/రుణాలలో, రూ.50,000/,లు కడితేనే మాఫీ చేస్తామని చెప్పడం అన్యాయమన్నారు. అసలే పెట్టుబడుల సమయం ఈ సమయంలో ఎక్కడ తెచ్చి కడతారు అన్నారు. యాభైవేల రూపాయలను కొత్త రుణం రూపంలోకి మార్చి, రెండు లక్షలు మాఫీ చేయాలన్నారు. అన్నిరకాల భూములకు రుణమాఫీ చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిపిఐ మండల కార్యదర్శి బండి నర్సయ్య, రైతు సంఘం నాయకులు, భైకని మల్లయ్య, బొంతల మల్లయ్య, బొంతల విజేందర్, పెసరు యాదగిరి, మర్రి శ్రీనివాస్, నక్క లింగయ్య తదితరులు పాల్గొన్నారు.

పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించండి

కదం తొక్కిన ఉద్యోగ జెఎసి

నల్లబ్యాడ్జీలతో నిరసన

పాల్గొన్న ఉద్యోగ, ఉపాధ్యాయ పెన్షనర్లు

ప్రజాపక్షం/కరీంనగర్ప్రతినిధి : పాతపెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని డిమాండ్ చేస్తూ కరీంనగర్ ఎంప్లాయీస్ జెఎసి ఆధ్వర్యంలో ఉద్యోగ ఉపాధ్యాయ గెజిటెడ్ పెన్షనర్లు కదం తొక్కారు. 'సిపిఎస్ హటావో–ఓపిఎస్ బచావో' అంటూ నినదించారు. తెలంగాణ ఎంప్లాయీస్ జెఎసి ఆధ్వర్యంలో పెన్షన్ విద్రోహ దినం సంధర్భంగా ఆదివారం ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్లు కలెక్టరేట్ కార్యాలయం ఎదుట నల్ల బ్యాడ్జీలతో నిరసన ప్రదర్శన చేపట్టారు. ఈ సందర్భంగా టిఎన్‌జిఒ జిల్లా అధ్యక్షుడు, ఎంప్లాయీస్ జెఎసి చైర్మన్ దారం శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ దశాబ్దాల కాలం పాటు ప్రభుత్వ ఉద్యోగులుగా, ఉపాధ్యాయులుగా, గెజిటెడ్ ఆఫీసర్లుగా, పెన్సనర్లుగా పనిచేసి ప్రభుత్వ పథకాల అమలులో కీలక పాత్ర వహించే ఉద్యోగుల పట్ల ప్రభుత్వాల చిన్న చూపు తగదని, ఉద్యోగుల సంక్షేమం ప్రభుత్వాల బాధ్యత అని పేర్కొన్నారు. కాంట్రిబ్యూటరీ పెన్షన్ రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. టిఎన్‌జిఒ జిల్లా కార్యదర్శి సంగెం లక్ష్మ ణ్‌రావు, టిజిఒ నాయకులు కాళీచరణ్, విష్ణువర్ధన్, పెన్షనర్ల సంఘం అధ్యక్షుడు కేశవరావు, కార్యదర్శి లింగయ్య, ఎఎన్‌జిఒల సంఘం మాజీ అధ్యక్షుడు పర్రె రాజేశం, కేంద్ర సంఘం నాయకులు నాగుల నరసింహస్వామి, రాగి శ్రీనివాస్, ఉపాధ్యాయ సంఘాల నాయకులు రాజిరెడ్డి, రవీంద్ర చారి, దామెర మహేందర్ రెడ్డి, తిరుపతి రెడ్డి, విజయేందర్ రెడ్డి, వెంకన్న, విద్యాసాగర్, మోసం అంజయ్య, గాజుల నరసయ్య, బిక్షపతి, కొండయ్య, రాజేశ్ భరద్వాజ్, హర్మిందర్ సింగ్, కిరణ్, పోలు కిషన్, సతీష్,లవకుమార్, అక్బర్, అజ్గర్, సునీత, శైలజ, విజయలక్ష్మి , సుస్మిత, లలిత మేరి, రమణ తదితరులు పాల్గొన్నారు.

హనుమకొండ ప్రతినిధి : సెప్టెంబర్ 1పెన్షన్ విద్రోహ దినోత్సవాన్ని పురస్కరించుకొని హనుమకొండ జిల్లా కలెక్టరేట్ ఎదుట తెలంగాణ ఉద్యోగ సంఘాల జెఎసి ఆధ్వర్యంలో ఆదివారం పెద్దఎత్తున ఉద్యోగులు నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన కార్యక్రమాలను చేపట్టడం జరిగింది. ఈ సందర్భంగా టిఎన్‌జిఒ జిల్లా అధ్యక్షుడు ఆకుల రాజేందర్ మాట్లాడుతూ ప్రభుత్వలు కాంట్రిబ్యూటరీ పెన్షన్ విధానాన్ని రద్దు చేసి వెంటనే పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. తెలంగాణ గెజిటెడ్ అధికారుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు అన్నమనేని జగన్‌మోహన్‌రావు మాట్లాడుతూ నూతన పెన్షన్ స్కీమ్ రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేసేవరకు తమ ఉద్యమాన్ని ఆపేది లేదని పేర్కొన్నారు. పిఆర్‌టియు జిల్లా అధ్యక్షుడు తిరుపతి రెడ్డి మాట్లాడుతూ పాత పెన్షన్ విధానం అమలులోకి వచ్చు వరకు పోరాటం ఆపేది లేదన్నారు. ఓపిఎస్‌ని తిరిగి తీసుకురావాడమే తమ ప్రధాన డిమాండ్‌గా పేర్కొన్నారు. డిటిఎఫ్ రాష్ట్ర బాధ్యులు లింగారెడ్డి మాట్లాడుతూ పెన్షన్ అనునది ఉద్యోగుల ప్రాథమిక హక్కు అని పేర్కొన్నారు.ప్రభుత్వాలు సిపిఎస్ ని రద్దు చేయాల్సిందేనన్నారు. టిఎస్ యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి పెందెం రాజు మాట్లాడుతూ పెన్షన్ అనునది ఉద్యోగుల మానవ హక్కు అని దాని కోసం తమ పోరాటం నిరంతరం కొనసాగుతుందన్నారు. ఉద్యోగుల సంక్షేమం ప్రభుత్వాల బాధ్యత అని పేర్కొన్నారు. తెలంగాణ పెన్షినర్స్ అసోసియేషన్ అధ్యక్షులు సర్వర్ హుసేన్ మాట్లాడుతూ జేపీసీలో పెన్షనర్స్ కీలకపాత్ర పోషిస్తుంది అని, పాత పెన్షన్ విధానాన్ని వెంటనే పునరుద్ధరించాలని పేర్కొన్నారు. ప్రభుత్వ పెన్షనర్ల అధ్యక్షులు గోపాల్ రెడ్డి మాట్లాడుతూ పాత పెన్షన్ విధానం అమలులోకి వచ్చే వరకు పోరాటం ఆపేది లేదన్నారు. ఎస్ టియుజిల్లా అధ్యక్షులు రాంబాబు మాట్లాడుతూ ఓల్డ్ పెన్షన్ స్కీం కొరకు జరిగే ఉద్యమంలో ఎస్టియు కీలక పాత్ర పోషిస్తుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో టిఎన్‌జిఒస్ యూనియన్ జిల్లా అధ్యక్షులు ఆకుల రాజేందర్, గెజిటెడ్ అధికారుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు అన్నామనేని జగన్ మోహన్ రావు, పిఆర్‌టియు జిల్లా అధ్యక్షుడు తిరుపతిరెడ్డి, టిఎస్‌యుటిఎఫ్ కార్యదర్శి పెందెం రాజు, ప్రభుత్వ పెన్షనర్ల సంఘం అధ్యక్షులు గోపాల్‌రెడ్డి, తెలంగాణ పెన్షనర్ల సంఘం అధ్యక్షులు సర్వర్ హుస్సేన్, ఎస్‌టియు అధ్యక్షులు రాంబాబు, నాలుగవ తరగతి ఉద్యోగుల సంఘం అధ్యక్షులు దాస్య నాయక్, టిపిటిఎఫ్ అధ్యక్షులు రఘుపతి, డిటిఎఫ్ రాష్ట్ర నాయకులు లింగారెడ్డి, జిల్లా అధ్యక్షులు శ్రీనివాస్, జూనియర్ లెక్చరర్ల సంఘం అధ్యక్షుడు శ్రీనివాస్, పోలీస్ పెన్షనర్ల సంఘం అధ్యక్షులు మసూర్ హుస్సేన్, టిఆర్‌టిఎఫ్ అధ్యక్షులు రాజబాబు, ఉద్యోగ, గెజిటెడ్ అధికారుల, ఉపాధ్యాయ, పెన్షనర్ల సంఘాల నేతలు డాక్టర్ ప్రవీణ్, సదయ్య, పుల్లూరు వేణు గోపాల్, పనికెల రాజేష్,మాల కొండ రెడ్డి, శ్యాంసుందర్, కత్తి రమేష్, మోయిజ్, లక్ష్మి ప్రసాద్, శ్రీనివాస్, రాజమౌళి, బింగి సురేష్, సుధాకర్‌రెడ్డి, రాజేష్ ఖన్నా తదితరులు పాల్గొన్నారు.

ప్రమోషన్లను ఆపుతున్న యాజమాన్యం

ప్రజాపక్షం/నస్పూర్ : రాజకీయాలకు తలొగ్గి నర్సేస్ జనరల్ మజ్దూర్ ప్రమోషన్లను ఆపుతున్నారని సింగరేణి గుర్తింపు కార్మిక సంఘం సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ (ఎఐటియుసి) డిప్యూటీ ప్రధాన కార్యదర్శి కందికట్ల వీరభద్రయ్య, శ్రీరాంపూర్ బ్రాంచ్ కార్యదర్శి ఎస్కే బాజీ సైదా ఆరోపించారు. ఆదివారం స్థానికంగా జరిగిన సమావేశంలో మాట్లాడుతూ గత ప్రభుత్వాల వల్ల సింగరేణిలో రాజకీయ ప్రమేయం పెరిగి సింగరేణి ఆర్థికంగా దివాలా తీసిందన్నారు. ఇప్పుడున్న ప్రభుత్వం కూడా గత ప్రభుత్వం మాదిరే సింగరేణిలో రాజకీయ జోక్యం చేస్తుందని ఆరోపించారు. యాజమాన్యం అర్హత కలిగిన కార్మికులకు సర్వేస్ జనరల్ మజ్దూర్ ప్రమోషన్లు ఇవ్వకుంటే ఆందోళన చేపడతామని యాజమాన్యాన్ని హెచ్చరించారు. కార్యక్రమంలో మోత్కూర్ కొమురయ్య, బద్రి బుచ్చయ్య, ఆకుల లక్ష్మ ణ్, గునిగంటి నర్సింగరావు, సంఘం సదానందం, బీర రవీందర్, చింతల నవీన్‌రెడ్డి, మల్లికార్జున్, కుమారస్వామి, నాగేశ్వరావు, తిరుపతి, అప్రోజ్ ఖాన్, అనంతరెడి దామోదర్, సందీప్, సాయి రాజు తదితరులు పాల్గొన్నారు.

కటాక్షపురం మత్తడిపై హైలెవల్ బ్రిడ్జి నిర్మాణం

అధికారులు అప్రమత్తంగా ఉండాలి : మంత్రి సీతక్క

ప్రజాపక్షం/ఆత్మకూరు: జాతీయ రహదారిపై ఉన్న కటాక్షపురం మత్తడిపై హైలెవల్ బ్రిడ్జి త్వరగా పూర్తయ్యే విధంగా చర్యలు తీసుకుంటామని పంచాయతీరాజ్ శాఖ మంత్రి ధనసరి సీతక్క అన్నారు. ఆదివారం ఆత్మకూరు మండలంలోని కటాక్షపురం జాతీయ రహదారిని ఆనుకొని ఉన్న పెద్ద చెరువు మత్తడిని అధికారులతో కలిసి పరిశీలించారు. అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. జాతీయ రహదారి 136పై ఉన్న కటాక్షం పెద్ద చెరువు మత్తడిపై హైలెవల్ బ్రిడ్జి వెంటనే నిర్మాణం పూర్తి చేసే విదంగా చర్యలు తీసుకుంటున్నామన్నారు. వాహనదారులకు ప్రమాదాలు జరుగకుండా పలు జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులకు సూచనలు, సలహాలు ఇచ్చారు. అన్నిశాఖల అధికారులు ప్రజలకు అందుబాటులో ఉండి సేవలు అందించాలన్నారు. ఎవరూ నిర్లక్ష్యం చేయకుండా ప్రజలకు అప్రమత్తం చేస్తూ వర్షాలకు ఎవరి ఇబ్బందులు పడకుండా చూడాలన్నారు. మంత్రి సీతక్క వెంట హర్షం వరుణ్‌గాంధీ, హర్షం అశోక్, పొనుగోటి కోటి, గఫూర్, హర్షం రాజ్‌కుమార్, కాడబోయిన రవియాదవ్, కాడబోయిన రాజ్‌కుమార్, హల్వాల రవి పాల్గొన్నారు. కాగా మండలంలోని చలి వాగు, జర్రిపోతుల వాగు లు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. పెద్దాపురం, ఆత్మకూరు, పెంచికల్ పేట, నీరుకుల్లా మొదలగు గ్రామాల్లో గల చెరువుల్లో పూర్తిస్థాయి నీటిమట్టం సంతరించుకున్నాయి. జాతీయ రహదారికి పక్కనే గల కటక్షపురం పెద్ద చెరువు మత్తడి పోస్తుండడంతో మండల అధికారులు పోలీసు అధికారులు 24 గంటల పర్యవేక్షణలోకి వచ్చారు. వాహనదారులు అప్రమత్తంగా ఉండాలని వారు కోరారు.

మహానగరి

హైదరాబాద్ రంగారెడ్డి

'మధ్యాహ్న' కార్మికులకు ఉద్యోగ భద్రత

ఎఐటియుసి జిల్లా కార్యదర్శి పానుగంటి పర్వతాలు

ప్రజాపక్షం/కొత్తూరు: మధ్యాహ్న భోజన కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలని ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి పానుగంటి పర్వతాలు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మధ్యాహ్న భోజన కార్మికులకు కనీస వేతనంతో పాటు ఇఎస్ఐ, పిఎఫ్ సౌకర్యం కల్పించాలని ఆదివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. సెప్టెంబర్09, 10వ తేదిల్లో నిర్వహించే సమ్మెను జయప్రదం చేయాలని మధ్యాహ్న భోజన కార్మికులను కోరారు.

వనస్థలిపురం మహిళకు అవార్డు

ప్రజాపక్షం/వనస్థలిపురం : ఢిల్లీలో సేఫీ ఆధ్వర్యంలో నిర్వహించిన మహిళ మైండ్ అండ్ బాడీ ఫిట్నెస్ విభాగంలో వనస్థలిపురానికి చెందిన బాడీ కోచ్ ఆఫ్‌ది ఇయర్ అవార్డు ముబీనఖాన్‌కు లభించింది. హైదరాబాద్‌కు చెందిన సర్టిఫైడ్ ఎక్సర్‌సైజ్ వెల్‌నెస్ ప్రొఫెషనల్‌గా గుర్తింపు పొందినందుకు ముబీన ఖాన్ ఈ అవార్డు అందుకుంది. డిప్లోమా ఇన్ న్యూట్రిషనల్ స్పెషలిస్ట్ ఇన్ ఉమెన్ సెల్ పంక్షనల్ ఇన్ స్ట్రెంత్ ట్రైనింగ్ వంటి ధృవపత్రాలు అందుకున్నానని ముబీనఖాన్ తెలిపారు.

హైదరాబాద్‌కు రెడ్‌అలెర్ట్

అప్రమత్తమైన ప్రభుత్వ యంత్రాంగం

ప్రజాపక్షం/హైదరాబాద్ : వరుసగా కురుస్తున్న వర్షాలతో హైదరాబాద్ నగర జీవనం అస్తవ్యస్తమైంది. లోతట్టు ప్రాంతాల్లో ఇళ్లలోకి వరదనీరు చేరడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పలు ప్రాంతాల్లో ఈదురుగాలులకు చెట్లు, విద్యుత్ స్తంభాలు నెలకూలాయి. దీంతో పలు ప్రాంతాల్లో ట్రాఫిక్ స్తంభించిపోయింది. భారీ వర్షాల నేపథ్యం సోమవారం గ్రేటర్ హైదరాబాద్ ప్రభుత్వ, ప్రైవేట్ విద్యాసంస్థలకు ప్రభుత్వం సెలవు ప్రకటించింది. వర్షంతో వరదనీరు పోటెత్తడంతో చెరువులు, నాలాలు, వర్షపు నీటి డ్రెయిన్‌లలో వరదనీరు ఉధృతంగా ప్రవాహిస్తోంది. వరద ముంపు ప్రాంతాల్లో ప్రభుత్వ యంత్రాంగం సహాయక చర్యలు చేపట్టింది. జంటజలాశయాలైన ఉస్మాన్ సాగర్(గండిపేట్), హిమాయత్ సాగర్‌లకు భారీ ఎత్తున వరద నీరు వస్తుంది. మరోవైపు హుస్సేన్‌సాగర్ పూర్తి స్థాయి నీటిమట్టానికి చేరుకోవడంతో నిండుకుండలా మారింది. మున్సిపల్ శాఖ ముఖ్యకార్యదర్శి ఎం.దానకిషోర్ ప్రభుత్వ యంత్రాంగాన్ని అప్రమత్తం చేశారు. ఆయన హైదరాబాద్ నగరంలోని పలు ప్రాంతాల్లో పర్యటించి, వరద నీటి సమస్యలను పరిశీలించారు. డిప్యూటి మేయర్ శ్రీలత రెడ్డి, జిహెచ్ఎంసి కమిషనర్ ఆమ్రపాలి కాట, జలమండలి ఎండి అశోక్‌రెడ్డి, హైడ్రా కమిషనర్ ఎ.వి.రంగనాథ్, హెచ్ఎండిఏ కమిషనర్ సర్ఫరాజ్ అహ్మద్ వివిధ ప్రాంతాల్లో పర్యటించారు. వరద ముంపు నివారణ చర్యలను సమీక్షించారు. జిహెచ్ఎంసి అత్యవసర బృందాలు, ఈవిడిఎం యంత్రాంగం సహాయక చర్యలు చేపట్టాయి. నేలకూలిన చెట్లను తొలగించాయి.

పలు చోట్ల కూలిన చెట్లు, ప్రహరీగోడలు..

భారీవర్షాలతో మెహిదీపట్నం నుంచి లింగంపల్లి మార్గంలో లింగంపల్లి రైల్వే స్టేషన్ అండర్ పాస్ నీట మునిగింది. వర్షాలకు గాంధీభవన్ ప్రహరీ గోడ కూలింది. పార్కింగ్ చేసిన పలు వాహనాలు ధ్వంసమయ్యాయి. లిబర్టీలోని జిహెచ్ఎంసి ప్రధాన కార్యాలయం ముందు చెట్టు కూలి పలు కార్లు ధ్వంసమయ్యాయి. ఘటన జరిగిన సమయానికి అందులో ఎవరూ లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. హిమాయత్ నగర్‌లో రహదారిపై చెట్లకొమ్మలు పడటంతో ట్రాఫిక్ పోలీసులు తొలగించారు. ఓల్డ్ బోయిన్‌పల్లిలోని కళింగ ఎంక్లేవ్ వద్ద భారీ వృక్షం హై టెన్షన్ వైర్లపై కూలింది. అల్వాల్ మున్సిపల్ కార్యాలయం సమీపంలోని ప్రధాన రహదారిపై కూడా ఓ భారీ వృక్షం కూలింది.

నిండుకుండలా హుస్సేన్ సాగర్..

భారీవర్షాలతో హుస్సేన్ సాగర్ నిండుకుండలా మారింది. ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాల కారణంగా హైదరాబాద్ హుస్సేన్‌సాగర్‌లోకి భారీగా వరదనీరు వచ్చిచేరుతోంది. బుల్కాపూర్, కూకట్‌పల్లి, బంజరా, పికెట్ నాలాల నుంచి పెద్ద ఎత్తున వరదనీరు వస్తుండటంతో నీటిమట్టం పెరిగి హుస్సేన్ సాగర్ నిండుకుండలా మారింది. పూర్తి స్థాయి నీటిమట్టానికి చేరుకోవడంతో అధికారులు నాలుగు గేట్లు ఎత్తి దిగువకు నీటిని విడుదల చేశారు. దీంతో మూసీ పరీవాహక ప్రాంత ప్రజలను జిహెచ్ఎంసి అప్రమత్తం చేసింది. హుస్సేన్ సాగర్ ఫుల్ ట్యాంక్ లెవల్ 513.41 మీటర్లు కాగా, ప్రస్తుతం 513.43 మీటర్లుగా ఉంది. హుస్సేన్ సాగర్‌లో వరద నీటి పరిస్థితిని జిహెచ్ఎంసి అధికారులు ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్నారు. మున్సిపల్ శాఖ ముఖ్యకార్యదర్శి దానకిషోర్ కూడా సాగర్‌లోని నీటిమట్టంపై అధికారులను వివరాలడిగి తెలుసుకుంటున్నారు. 24 గంటలపాటు నీటి వనరులపై నిఘా పెట్టాలని ఆయన సూచించారు.

అన్ని శాఖలు అప్రమత్తంగా ఉండాలి.. ఇన్‌చార్జ్ మంత్రి పొన్నం ప్రభాకర్

భారీ వర్షాలు కురిసే అవకాశాలున్నాయన్న వాతావరణ శాఖ హెచ్చరికలతో జిహెచ్ఎంసి, హెచ్ఎండిఏ, జలమండలి, డిఆర్ఎఫ్, ఎన్‌డిఆర్ఆర్ఎఫ్, విద్యుత్ విభాగాల అధికారులు అప్రమత్తంగా ఉండాలని హైదరాబాద్ జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి పొన్నం ప్రభాకర్ ఆదేశించారు. లోతట్టు ప్రాంతాల్లో ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని అధికార యంత్రాంగాన్ని అప్రమత్తం చేశారు. 141 వాటర్ లాగింగ్ పాయింట్ల వద్ద సిబ్బంది వెంటనే వరద వెళ్లేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. పురాతన భవనాల్లో ఉన్నవారిని ఖాళీ చేయించాలన్నారు.

అధికారులు అందుబాటులో ఉండాలి మేయర్ గద్వాల్ విజయలక్ష్మి

వాతావరణ శాఖ గ్రేటర్ హైదరాబాద్ వ్యాప్తంగా రెడ్ అలార్ట్ ప్రకటించిన నేపథ్యంలో అధికారులు అప్రమత్తంగా ఉండి, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు చేపట్టాలని మేయర్ గద్వాల్ విజయ లక్ష్మి అధికారులను ఆదేశించారు. భారీవర్షాల నేపథ్యంలో జోనల్ కమిషనర్లు, చీఫ్ సిటీ ప్లానర్‌లతో ఆదివారం జిహెచ్ఎంసి మేయర్ విజయలక్ష్మి టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. లోతట్టు ప్రాంతాల ప్రజలను అప్రమత్తం చేయాలని అధికారులకు సూచించారు. శిథిలవస్థలో ఉన్న భవనాలు, కాంపౌండ్ వాల్స్ గుర్తించి తగిన జాగ్రతలు తీసుకోవాలన్నారు. నిర్మాణ కార్యాకలాపాలు నిలిపేయాలని, కార్మికులను సురక్షిత ప్రాంతాలకు తరలించాలని, నిర్మాణంలో ఉన్న భవనాల వద్ద అవాంచనీయ సంఘటనలు జరగకుండా తగిన జాగ్రత్తలు తీసుకునేలా టౌన్ ప్లానింగ్ అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని చీఫ్ సిటీప్లానర్ కె.శ్రీనివాస్‌ను మేయర్ ఆదేశించారు. ప్రజలు అవసరమైతే తప్ప బయటకు రావద్దని, ఆపద సమయంలో జిహెచ్ఎంసి కంట్రోల్ రూమ్ ఫోన్ నెంబర్ 040 21111111కు కానీ, మైజిహెచ్ఎంసి యాప్‌కు ఆన్‌లైన్‌ద్వారా కానీ, డిఆర్ఎఫ్(హైడ్రా)ఫోన్‌నంబర్ 9000 113667 లో సంప్రదించవచ్చని మేయర్ సూచించారు.

వర్షంలో ప్రజలు బయటకు రావద్దు జిహెచ్ఎంసి కమిషనర్ ఆమ్రపాలి

వర్షాల నేపథ్యంలో ప్రజలు ఎవ్వరూ కూడా బయటకు రావద్దని జిహెచ్ఎంసి కమిషనర్ ఆమ్రపాలి కోరారు. లేక్ వ్యూ గెస్ట్‌హౌస్ వద్ద రేన్ వాటర్ హార్వెస్టింగ్ స్ట్రక్చర్(సంపు) నిర్మాణ పనులను ఆమే పరిశీలించారు. వాతావరణ శాఖ గ్రేటర్ హైదరాబాద్ వ్యాప్తంగా రెడ్ అలర్ట్ గా ప్రకటించిన నేపథ్యంలో ప్రజలు అత్యవరమైతేనే బయటకు వెళ్ళాలన్నారు. 22 చెరువులు పూర్తి స్థాయి నీటిమట్టానికి చేరుకున్నాయని, అన్ని చెరువుల గేట్‌లు తెరిచామన్నారు. హుస్సేన్ సాగర్ గేట్ లు తెరిచామని, లోతట్టు ప్రాంతాల ప్రజలను అప్రమత్తం చేశామని, వారిని సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. .

లోతట్టు ప్రాంతాల్లో పర్యటించిన హైడ్రా కమిషనర్ రంగనాథ్

నగరవ్యాప్తంగా భారీవర్షాల నేపథ్యంలో హైడ్రా కమిషనర్ ఎ.వి. రంగనాథ్ క్షేత్ర స్థాయిలో పర్యటించారు. షేక్‌పేట, టోలిచౌకీలోని వరద ప్రభావిత ప్రాంతాల్లో పర్యటించి సిబ్బందిని అప్రమత్తం చేశారు. టోలిచౌకి వద్ద రహదారిపై భారీగా నిలిచిన వరద నీటిని దగ్గరుండి సిబ్బందితో నాలాలోకి మళ్లించారు. అలాగే బేగంపేట ముంపు ప్రభావిత ప్రాంతాలతోపాటు ప్రమాదకరంగా ప్రవహిస్తున్న నాలాను, పరివాహక ప్రాంతాలను పరిశీలించారు. అక్కడి సమస్యలను స్థానికులను అడిగి తెలుసుకున్నారు. ముంపు ప్రాంతాల్లో డిఆర్ఎఫ్ సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని ఆయన ఆదేశించారు.

అవసరమైతేనే ఇంటినుంచి బయటకు

జిహెచ్ఎంసి కాంగ్రెస్ పార్టీ ఫ్లోర్ లీడర్ రాజశేఖర్‌రెడ్డి

ప్రజాపక్షం/చంపాపేట: నగరంలో ఎడతెరపి లేకుండా కురుస్తున్న వర్షాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, అత్యవసరం అయితేనే ప్రజలు ఇంటి నుంచి బయటకు రావాలని జిహెచ్ఎంసి కాంగ్రెస్ పార్టీ ఫ్లోర్ లీడర్ దర్పల్లి రాజశేఖర్‌రెడ్డి అన్నారు. గత రెండు రోజుల నుండి కురుస్తున్న వర్షాలకు లింగోజిగూడ డివిజన్ పరిధిలోని లోతట్టు కాలనీలు శాతవాహనన గర్, మైత్రినగర్, అల్తాఫ్‌నగర్, ధర్మపురికాలనీ, సాయినగర్, జనప్రియకాలనీ, వడ్డెరబస్తీ, తపోవన్‌కాలనీలలో ఆయన ఆదివారం పర్యటించి స్థానికుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. మాన్‌సూన్ సిబ్బందితో మ్యాన్ హోల్స్, ఓపెన్ నాలాలో చెత్తాచెదారం తొలగించే పనులను పర్యవేక్షించారు. ఈ సందర్భంగా దర్పల్లి రాజశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ ఎగువ ప్రాంతాల నుంచి వచ్చే వరదతో ప్రమాదం పొంచి ఉందని,విద్యుత్తు స్తంభాలను తాకరాదని, శిథిలావస్థకు చేరిన భవనాల కింద, లోతట్టు ప్రాంతలలో ఉండకూడదని సూచించారు. స్థానికులు వర్షం కారణంగా ఇబ్బందులు ఎదురైతే, తనకు లేదా అధికారులకు సమాచారం ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో నాయకులు ప్రవీణ్‌రెడ్డి, నరేష్, శ్రీపతిరావు, రవికుమార్ పాల్గొన్నారు.
ఫోటో: 1 cpt01 a,b, లలో: లింగోజిగూడ డివిజన్ లోతట్టు కాలనీలు, బస్తీ వాసుల సమస్యలను తెలుసుకుంటున్న దర్పల్లి రాజశేఖర్‌రెడ్డి

అధికారులు అందుబాటులో ఉండాలి

కార్పొరేటర్ వంగ మధుసూదన్‌రెడ్డి

ప్రజాపక్షం/చంపాపేట: వర్షాల కారణంగా ప్రజలు ఇబ్బందులు పడకుండా జీహెచ్‌యంసీ, విద్యుత్తు, జలమండలి అధికారులు సిబ్బంది అందుబాటులో ఉండాలని కార్పొరేటర్ వంగ మధుసూదన్‌రెడ్డి అన్నారు. ఆయన ఆదివారం చంపాపేట డివిజన్ పరిధిలోని పలు కాలనీల్లో సర్కిల్ అధికారులు సిబ్బందితో కలిసి పరిశీలించారు. కూలిపోయిన చెట్లను తొలగించారు. ఒరిగిన విద్యుత్తు స్తంభాలను తొలగించి కొత్తవి ఏర్పాటు చేసి విద్యుత్తు సరఫరా పునరుద్ధరించారు. కార్యక్రమంలో నాయకులు మల్లేష్ గౌడ్, అవినాష్‌రెడ్డి, వేణుగౌడ్, సందీప్, తదితరులు పాల్గొన్నారు.

వరద నీటిలోనే కాలనీలు

ప్రజాపక్షం/వనస్థలిపురం: బిఎన్‌రెడ్డి నగర్, వనస్థలిపురం, హస్తినాపురం, హయత్‌నగర్ డివిజన్‌లో పలు కాలనీలు వరదనీటిలో చిక్కుకున్నాయి. భారీవర్షాలు కురుస్తుండడంతో ప్రజలు, కాలనీ వాసులు ఇంట్లోనే పరిమితమయ్యారు. కాలనీలు, చెరువులు, కుంటలు పూర్తి నిండుకుండాల మారి చెరువులకు తలపిస్తున్నాయి. కాలనీ వాసులు విద్యుత్ స్తంబాల నుంచి దూరంగా ఉండాలని, శిథిలా వ్యవస్థకు చెరిన ఇల్లుల్లో ఉండరాదని జిహెయ్ఎంసి అధికారులు చెపుతున్నారు. ప్రజలకు ప్రాణ ఆస్తి, నష్టాలు జరగకుండా ప్రభుత్వం సహాయక చర్యల కోసం ప్రత్యేక కంట్రోల్ రూంలు ఏర్పాటు చేసింది. ఆపాదలో ఉన్న వారు కంట్రోల్ రూంకు కాల్ చేయాలని కోరారు. జిహెచ్ఎంసి కంట్రోల్ రూం నెంబరు 9704601866 కు సంప్రదించాలని తెలిపారు.

వనస్థలిపురం డివిజన్‌లో... లోతట్టు ప్రాంత కాలనీవాసులు అప్రమత్తంగా ఉండాలని వనస్థలిపురం కార్పొరేటర్ రాగుల వెంకటేశ్వర్‌రెడ్డి అన్నారు. వరదలు భారీ వస్తుండడంతో ప్రజలు అత్యవసరమైతనే రావాలని, లేకపోతే ఇంటికే పరిమితం కావాలన్నారు. నాలాలు ఒపెన్ ఉంటే వాహనదారులు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

హయత్ నగర్‌లో... వరద ప్రభావం ఉన్న కాలనీ వాసులు చాలా అప్రమత్తంగా ఉండాలని హతయ్ నగర్ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్‌రెడ్డి అన్నారు. స్వగృహ ఎంక్లేవ్ కాలనీ వర్సంతో జలమయమైన కాలనీలకు జిహెచ్ఎంసి అధికారులతో సందర్శించి సహాయక చర్యలు చెపట్టారు. కాలనీల్లో నీరు భారీగా చేరడంతో జెసిబి సహాయంతో వస్తున్న వరదకు పక్కదారి మళ్లించడం జరిగిందన్నారు. దిగువకు నీరు వెళ్లే విధంగా తాత్కలిక చర్యలు తీసుకుంటున్నామని కార్పొరేటర్ తెలిపారు. కురుస్తున్న వర్షాలకు ప్రజలు జాగ్రతలు తీసుకోవాలని సూచించారు. ఆస్తి, ప్రాణ నష్టం జరిగితే జిహెచ్ ఎంసి టోల్ ఫ్రీ నెంబరుకు తెలియ చేయాలని వారు గర్తు చేశారు. ఈ కార్యక్రమంలో జిహెచ్ఎంసి డీఈ దామోదర్, ఏఈ హేము నాయక్, వర్క్ ఇన్స్పెక్టర్ సురేష్ తదితరులు పాల్గొన్నారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని మహిళకు తీవ్రగాయాలు

ప్రజాపక్షం/వనస్థలిపురం : గుర్తు తెలియని వాహనం ఢీ కొని మహిళకు తీవ్ర గాయాలయిన సంఘటన ఆదివారం వనస్థలిపురం పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఎన్జీవోస్ కాలనీ మైయిన్‌రోడ్డులో రోడ్డు మార్గంగా వెళుతున్న మహిళ సోని(21) ని గుర్తు తెలియని అతివేగంగా వస్తున్న కారు ఢీకొనడంతో తీవ్రగాయాలయ్యాయి. స్థానికుల గమనించి ఆమెను చికిత్స కోసం ప్రైవేటు అసుపత్రికి తరలించారు. సంఘటనపై పోలీసులు సిసి కెమెరాల ద్వారా కారు డ్రైవర్ కోసం గాలింపు చర్యలు చేపట్టారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు వనస్థలిపురం సర్కిల్ ఇన్స్పెక్టర్ అశోక్‌రెడ్డి తెలిపారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి

ప్రజాపక్షం/రంగారెడ్డి ప్రతినిధి: భారీ వర్షాల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి అన్నారు. ఆదివారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ మహేశ్వరం నియోజకవర్గంలో ఎటువంటి అత్యవసర పరిస్థితి ఎదురైనా ఇబ్బందులు తలెత్తితే మీర్పేట్ ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో అందుబాటులో ఉంటాననితెలిపారు. లోతట్టు ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, ముంపు ప్రాంతాల్లో నివసించే కాలనీవాసులు సురక్షిత ప్రాంతాలకు వెళ్లేలా చర్యలు తీసుకోవాలని, అధికారులను స్పష్టమైన ఆదేశాలు ఇవ్వటం జరిగిందని తెలిపారు. భారీవర్షాల కారణంగా స్కూల్ పిల్లలు, వృద్ధులు, మహిళలు అత్యవసర పరిస్థితుల్లో తప్ప బయటకు రావద్దని కోరారు. వర్షాలకు వాగులు వంకలు చెరువులు నిండి పలు గ్రామాలకు చెరువుల నుండి వాగుల ద్వారా భారీగా నీరు వచ్చే ప్రమాదం ఉన్నదని, చెరువులు కల్వర్టు (బ్రిడ్జి)ల వద్ద అప్రమత్తంగా ఉండాలని, లోతట్టు ప్రాంత ప్రజలు మరియు పురాతనమైన శిథిలమైన భవనాలలో నివసించే వారు సురక్షితమైన ప్రాంతాలకు వెళ్లేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. విద్యుత్ స్తంభాలు ట్రాన్స్ఫార్మర్లు పట్ల రైతులు ఎలాంటి ప్రమాదాలు జరగకుండా జాగ్రత్తగా ఉండాలని కోరారు.

హేళన చేసిన ఉపాధ్యాయురాలిని సస్పెండ్ చేయాలి

రాష్ట్ర ఎస్‌సి, ఎస్‌టి కమిషన్ చైర్మన్ వెంకయ్య

ప్రజాపక్షం/రంగారెడ్డి ప్రతినిధి : కస్తూర్బా గాంధీ బాలిక విద్యాలయ విద్యార్థినిలను కులం పేరుతో దురుసుగా మాట్లాడి, హేళన చేసిన ఉపాధ్యాయురాలిపై అట్రాసిటీ కేసు నమోదు చేసి, వెంటనే సస్పెండ్ చేయాలని రాష్ట్ర ఎస్‌సి, ఎస్‌టి కమిషన్ చైర్మన్ బక్కి వెంకయ్య ఆదేశించారు. రంగారెడ్డి జిల్లా శంషాబాద్ మండలం పాలమాకులలోని కస్తూర్బా గాంధీ బాలిక విద్యాలయ (కెజిబివి) పాఠశాలను ఆదివారం ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా చూర్మన్ వెంకయ్య విద్యార్థినులతో మాట్లాడారు. వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థినులకు అందిస్తున్న ఆహారాన్ని, నాణ్యతను పరిశీలించి, వారికి కల్పిస్తున్న సౌకర్యాల గురించి అడిగి తెలుసుకున్నారు. విద్యార్థినులు తెలిపిన సమస్యల పరిష్కారానికి సత్వర చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అనంతరం విద్యార్థినులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థినిలు లేవనెత్తిన సమస్యలను తెలుసుకున్న అనంతరం కుల వ్యతిరేకంగా కుల వివక్షకు చూపించిన ఉపాధ్యాయురాలిని వెంటనే సస్పెండ్ చేయాలని జిల్లా విద్యాశాఖ అధికారి సుసింధర్ రావును ఆదేశించారు. అనంతరం పోలీస్ ఇన్స్పెక్టర్‌తో మాట్లాడుతూ విద్యార్థినిలను కులం పేరుతో దురుసుగా మాట్లాడి, విద్యార్థినిలను హేళన చేసిన ఉపాధ్యాయురాలిపై ఎస్‌సి, ఎస్‌టి కమిషన్ కింద కేసు నమోదు చేయాలని సూచించారు. హాస్టల్ పరిసరాలలో పెరిగిన పిచ్చి మొక్కలను, పచ్చి గడ్డి వంటివి వెంటనే తొలగించాలని, శుభ్రం చేయించి, పరిసరాలను శుభ్రంగా ఉంచేలా బ్లీచింగ్ చేయించాలని పంచాయతీ సెక్రెటరీకి తెలిపారు. ప్రతి రెసిడెన్షియల్ హాస్టల్లో చదువుతున్న ఎస్‌సి, ఎస్‌టి విద్యార్థులలో దాగిన ప్రతిభ చాటే విధంగా వారికి కావలసిన మౌలిక వసతులను, సౌకర్యాలను వెంటనే ఏర్పాటు చేయాలని జిల్లా విద్యాధికారికి ఆదేశించారు. ఈ కార్యక్రమం జిల్లా విద్యాశాఖ అధికారి సుశిందర్‌రావు, జిల్లా సోషల్ వెల్ఫేర్ ఆఫీసర్ రామారావు, రాజేంద్రనగర్ ఆర్‌డిఒ వెంకటరెడ్డి, శంషాబాద్ తహసీల్దార్, మండల విద్యాశాఖ అధికారి , స్పెషల్ ఆఫీసర్లు, సంబంధిత శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

ఉధృతంగా ప్రవహిస్తున్న వాగులు..నిండుతున్న చెరువులు

పలు గ్రామాలకు రాకపోకలు బంద్.. నేల కూలిన ఇళ్ళు

ప్రజాపక్షం/షాద్‌నగర్: రెండు రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు షాద్‌నగర్ నియోజకవర్గంలోని కొత్తూరు, నందిగామ, ఫరూఖ్‌నగక్, కేశంపేట, కొందుర్గు, జిల్లేడు చౌదరిగూడ మండలాల పరిధిలో ఉన్న వాగులు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. నందిగామ మండల పరిధిలోని అప్పారెడ్డిగూడ వాగు ఉధృతంగా ప్రవహిస్తుండటంతో రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి. నందిగామ సిఐ ప్రసాద్ వాడు వైపు ఎవరిని వెళ్ళనీవ్వకుండా పోలీస్ బందోబస్తును ఏర్పాటు చేశారు. నర్సప్పగూడ మద్య ఉన్న అక్కమ్మ చెరువు వాగుల వద్ద పోలీసులు ప్రమాద హెచ్చరికల బోర్డులు ఏర్పాటు చేశారు. ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని అయ్యవారిపల్లి వాగు ఉధృతంగా ప్రవహిస్తుండటంతో షాద్‌నగర్ సిఐ విజయ్ కుమార్ హెచ్చరికల బోర్డులను ఏర్పాటు చేశారు. కొందుర్గు మండల పరిధిలోని గంగన్నగూడ వాగు, విశ్వనాథ్‌పూర్‌తంగళ్ళపల్లి మద్య వాగు, వెంకిర్యాల వాగులు ఉధృతంగా ప్రవహిస్తుండటంతో పోలీసులు ఆయా ప్రాంతాల వద్ద ప్రమాద హెచ్చరికల బోర్డులను ఏర్పాటు చేశారు. వాగుల వైపు ఎవరిని వెళ్ళనివ్వకుండా పోలీసులు చర్యలు తీసుకుంటున్నారు. ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని వెల్‌జర్ల గ్రామంలో కురుస్తున్న వర్షాలకు చింతకొండపల్లి సత్తయ్యకు చెందిన ఇళ్ళు కూలింది. మున్సిపల్ పరిధిలోని బొబ్బిలి చెరువు వర్షపునీటితో నిండటంతో చైర్మెన్ కొందూటి నరేందర్ పరిశీలించారు. జిల్లేడు చౌదరిగూడ మండల పరిధిలోని చేగిరెడ్డి ఘణపూర్ గేట్ వద్ద వరద ఉధృతి పెరగడంతో వరి, జొన్న పంటలు పూర్తిగా నీట మునిగిపోయాయి.

ప్రజలందరు అప్రమత్తంగా ఉండాలి మున్సిపల్ కమిషనర్ చీమ వెంకన్న

ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలను దృష్టిలో పెట్టుకొని ప్రజలు ఇళ్ళల్లో నుండి బయటకు రాకుండా ఉండాలని, ఇబ్బందులు ఉంటే తమ దృష్టికి తీసుకువస్తే పరిష్కరించేందుకు మున్సిపల్ అధికారులు, సిబ్బంది సిద్ధంగా ఉన్నారని కమీషనర్ చీమ వెంకన్న వివరించారు. ఈ సందర్భంగా కమిషనర్ వెంకన్న మాట్లాడుతూ ఇళ్ళల్లోకి నీరు రాకుండా లోతట్టు ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. వర్షాల కారణంగా ఇబ్బందులు పడుతున్న ప్రజలు తక్షణమే మున్సిపల్ కార్యాలయానికి సమాచారం అందించాలని కమీషనర్ కోరారు. వార్డులు, కాలనీల వారిగా సమస్యలను ఎప్పటికప్పుడు తెలుసుకోవడం జరుగుతుందని పేర్కొన్నారు.

పలు ప్రాంతాల్లో దెబ్బతిన్న మట్టి ఇళ్ళు

షాద్‌నగర్ డివిజన్‌లోకి కొత్తూరు, నందిగామ, ఫరూఖ్‌నగర్, కేశంపేట, కొందుర్గు, జిల్లేడు చౌదరిగూడ మండల కేంద్రాలతోపాటు వివిధ గ్రామాల్లో మట్టితో నిర్మించిన ఇళ్ళు పాక్షికంగా దెబ్బతిన్నాయి. ఫరూఖ్‌నగర్ మండలం వెల్‌జర్ల గ్రామంలో కురుస్తున్న వర్షాలకు మట్టితో నిర్మించిన ఇళ్ళు కూలిపోయింది.

షాబాద్ : షాబాద్‌లో బారీ వర్షాల కారాణంగా మండలంలోని వివిధ గ్రామాలలో సాగు చేసిన పంట పొల్లాలో వరదనీరు భారీగా వచ్చి చేరింది. దీంతో రైతులు పంటలను కాపాడేందుకు పొలం గట్ల ద్వారా నిలిచిన నీరును తొలగిస్తున్నారు. రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు మండలంలోని అన్ని గ్రామ పంచాయతీలోని చెరువులు, కుంటలు నిండు కుండలా మారాయి.

కేశంపేట: కేశంపేట మండలంలోని గ్రామాల్లో వర్షాలకు వాగులు సాగి చెరువులు నిండి నిండుకుండలను తలపిస్తున్నాయి. శని, ఆదివారాల్లో ఎడతెరిపి లేకుండా కురిసిన భారీ వర్షాలకు చెరువుల్లోకి నీరు చేరి వాగులు సాగాయి. భారీ వర్షాలకు తొమ్మిది గ్రామాల్లో పాత ఇండ్లు కూలిపోగా తహసీల్దార్ ఆజం అలీ, రెవెన్యూ, పంచాయితీ అధికారులు వెళ్లి పరిశీలించారు. వర్షాలకు ప్రజలు బయట తిరగకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను ప్రజలకు సూచించారు.

మహానగరి

మేడ్చల్ మల్కాజ్‌గిరి వికారాబాద్

ధరూర్ మండల వ్యవసాయ మర్కెట్ పాలకు వర్గంన ఏకగ్రీవ ఎన్నిక

ప్రజాపక్షం/వికారాబాద్ ప్రతినిధి : వికారాబాద్ నియోజకవర్గంలోని ధరూర్ మండల వ్యవసాయ మర్కెట్ పాలకు వర్గం ఏకగ్రీవ ఎన్నిక ఆదివారం జరిగింది. అధ్యక్షుడిగా విజయ భాస్కర్‌రెడ్డి, వైస్‌చైర్మన్‌గా అశోక్ ముదిరాజు, డైరెక్టర్లుగా కె..రవీందర్, జోగుశోభ, బి.సాయన్న, తంగేడిపల్లి రాము, ముదినిజైపాల్, గాజుల వాణిశ్రీ, వై.అంజయ్య, వి. బాబ్యా నాయక్, ప్రతాప్, షమీం నరసింహారెడ్డి, అమరేశ్వర్‌పటేల్ కలిసి ధారూర్ మార్కెట్ పాలక వర్గంని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

పోలీసు శాఖను అప్రమత్తం- చేశాం

ప్రజాపక్షం/మల్కాజిగిరి: భారీ వర్షాల కారణంగా ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా ఉండేందుకు పోలీసు శాఖ అప్రమత్తంగా ఉండేలా ఏర్పాట్లు చేశామని రాచకొండ కమిషనర్ సుధీర్‌బాబు పేర్కొన్నారు. రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శాంతికుమారి, డిజిపి జితేందర్‌రెడ్డిలతో కలిసి రాష్ట్ర స్థాయి జిల్లా ఎస్‌పిలు, కమిషనర్లు, కలెక్టర్లతో ఆదివారం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్సులో ఆయన పాల్గొని తాము రాచకొండ కమిషనరేట్ పరిధిలో తీసుకొంటున్న చర్యల గురించి వివరించారు.

ఆటోరంగ కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి

ప్రజాపక్షం/జగద్గిరిగుట్ట : కుత్బుల్లాపూర్ నియోజకవర్గం ఐడీపీఎల్ క్రాంతి ఆటో యూనియన్ ఏఐటీయూసీ అనుబంధం సమావేశం ఆదివారం గాంధీనగర్ యూనియన్ కార్యాలయంలో నియోజకవర్గ అధ్యక్షులు ఉజ్జిని హరినాథ్‌రావు ఆధ్వర్యంలో నిర్వహించారు. ముఖ్య అతిథిగా జిల్లా ఆటో యూనియన్ ఇన్‌చార్జి బెజ్జలకృష్ణ మూర్తి, జిల్లా ఎఐటియుసి కార్యదర్శి శ్రీనివాసులు పాల్గొ న్నారు. అనంతరం వారు మాట్లాడుతూ, ప్రభుత్వం ఏన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ఆటో కార్మికులకు రూ.12వేలు ఇవ్వా లని, అసంఘటిత రంగంలో పనిచేస్తున్న ఆటోరంగ కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని, 2014 నుండి ఆటో మీటర్ చార్జీలు పెంచకపోవడంతో కార్మికులు నష్టపోవాల్సి వస్తుందని, కార్మికులందరూ ఏకతాటిపై నిలచి పోరాటాలకు సన్నద్ధం కావాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో క్రాంతి ఆటో యూనియన్ అధ్యక్షుడు రాజ్ కుమార్, కార్యదర్శి ఎల్లస్వామి, కోశాధికారి కుమార్, సతీష్, ఆటో కార్మికులు పాల్గొన్నారు.

వర్షాలకు ఇంటిపై పడిన వేపచెట్టు

ప్రజాపక్షం/శామీర్‌పేట : ఇటీవల భారీగా కురుస్తున్న వర్షాలకు వాగులు పొంగి పొర్లుతున్నాయి. పలు చోట్ల చెట్లు విరిగి నెలకొరిగాయి. చెట్లు విరిగి నెలకొరగడంతో పలు రోడ్లుకు రాకపోకలు నిలిచిపోయాయి. మూడుచింతల పల్లి మండలం లక్ష్మాపూర్‌లో దప్పు రాములు ఇంటిపై భారీ వేప చెట్టు పడింది. దీంతో ఇంటికి బీటలు వచ్చాయి. అప్రమత్తమైన మండల తహాశీల్దార్ వెంకటనర్సింహారెడ్డి సిబ్బందిని పంపించి చెట్టును తొలగించారు. ఇల్లు శిథిలావస్థకు చేరడంతో గ్రామపంచా యతీలోకి పంపించారు. అలాగే నారాయణపూర్ రోడ్డు మార్గంలో చెట్లు నెలకొరియని, లక్ష్మాపూర్ చెరువుకు వెళ్లే రోడ్డు మార్గంలోచెట్లు విరిగి పడిపోయాయి. తెలంగాణ క్రీడాప్రాంగణం బోర్డు కూలిపోయింది. శామీర్‌పేటలోని చైనిస్ శ్మశాన వాటిక ఎదుట చెట్టు కూలి స్తంభం నెలకొరిగింది. స్పందించిన రెవెన్యూ అధికారులు నెలకొరిగిన చెట్లను పక్కకు తీసివేయించారు. రోడ్డు మార్గాల వద్ద ఉన్న చెట్లను తొలగించి ప్రయాణికులకు ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకున్నారు.

ప్రజలు అప్రమత్తం కావాలి

శామీర్‌పేట ఇన్‌స్పెక్టర్ శ్రీనాథ్

ప్రజాపక్షం/శామీర్‌పేట : భారీగా కురుస్తున్న వర్షాలకు ప్రజలు అప్రమత్తంగా ఉండాలని శామీర్‌పేట ఇన్‌స్పెక్టర్ శ్రీనాథ్ తెలిపారు. మండలంలోని పలు చెరువులు నిండి పొంగిపొర్లుతున్న నేపథ్యంలో ప్రజలకు పలు సూచనలు సలహాలు చేశారు. వర్షాలు కురుస్తున్నందున ప్రతి ఒక్కరు ఇం ట్లోనే ఉండాలని, మరో రెండు రోజులు వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ తెలిపిందని చెప్పారు.వర్షాల వలన తడిసిన కరెంట్ స్తంబాలను, విద్యుత్ తీగలను ఇనుప స్తంబాలను తాకకుండా ప్రజలు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఇంట్లో వాడే విద్యుత్ పరికరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని, ముఖ్యంగా పిల్లలు, వృద్ధులు వర్షంలో బయటకు రాకుండా చూసుకోవాలన్నారు. రైతులు పొలాల్లో విద్యుత్ తీగలకు దూర ంగా ఉండాలన్నారు. ఉధృతంగా పారుతున్న వాగులు, చెరువుల వద్దకు వెళ్లకుండా ఉండాలని వాటిని దాటే ప్రయత్నం చేయకూడదన్నారు. శిథిలావస్థలో ఉన్న ఇండ్లల్లో ఉండే ప్రజలు జాగ్రత్తలు తీసుకోవాలని ఏదైన అత్యవసరమైతే డయల్ 100కు కాల్ చేయాలని చెప్పారు. చెరువుల వద్ద పరిస్థితి అదుపులో ఉందని అన్నారు. ముఖ్యమైన చెరువులు, వాగుల వద్ద పోలీస్ సిబ్బంది పెట్రోలింగ్ చేస్తున్నారని చెప్పారు.

ఉధృతంగా ప్రవహిస్తున్న వాగులు

-అప్రమత్తంగా ఉండాలని అధికారుల సూచనలు

ప్రజాపక్షం/కోట్‌పల్లి : రాష్ట్ర వ్యాప్తంగా ఎడతెరపి లేకుండా రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు మండలంలోని ఆయా గ్రామాల్లోని వాగులు, కాలువలు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి.కోట్‌పల్లి మండల కేంద్రంతో పాటుగా పక్కనున్న గ్రామాల ప్రజలకు రాకపోకలకు తీవ్ర అంతరాయం ఎర్పడింది.భారీ వర్షాలకు మండల కేంద్రంలోని వాగు ఉధృతంగా ఊరకలేస్తుంది. మండలంలోని మోత్కుపల్లి, రాంపూర్, నాగసాన్‌పల్లి, అన్నాసాగర్, బుగ్గాపూర్, ఎన్నారం గ్రామాల్లోని వాగులు ఉప్పొంగి పోతున్నాయి. మరో రెండు రోజులుగా భారీ వర్షాలు ఉంటాయని వాతావరణ శాఖ హెచ్చరికలు జారీ చేశారు. ప్రజలు వర్షాలకు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

జిల్లాలో విరామం లేని వాన
స్తంభించిన జనజీవనం



జిల్లా యంత్రాంగం అప్రమత్తం, కంట్రోల్ రూమ్‌ల ఏర్పాటు సోమవారం విద్యా సంస్థలకు సెలవు విరిగిన స్తంభాలు, ఏరులై పారిన కాలనీలు, ప్రధాన రహదార్లు, నేలకొరిగిన చెట్లు

ప్రజాపక్షం/మేడ్చల్ ప్రతినిధి: మేడ్చల్ జిల్లావ్యాప్తంగా ఎడతెరిపి లేకుండా వర్షాలు కురుస్తున్నాయి. శనివారం ఉదయం ప్రారంభమైన వర్షం ఆగకుండా రాత్రంతా కుంభవృష్టిగా నిమిషం కూడా గడువివ్వకుండా ఆదివారం సైతం కొనసాగింది. జవహర్‌నగర్, లాలాగూడ, మౌలాలి, బోయినపల్లి, ఫిర్జాదిగూడ, తార్నాక, ఉప్పల్, నాగోల్, కూకట్‌పల్లి, ఆల్విన్ కాలనీ, నిజాంపేట, జీడిమెట్ల, ఆల్వాల్ తదితర ప్రాంతాల్లో రహదార్లపై నీరు నిలిచిపోయింది. పలు కాలనీల్లో సైతం శనివారం నుండి కురుస్తున్న ఎడతెరిపి లేని వర్షాలతో నీరు నిలిచిపోయి టూవీలర్, కార్లు కదలటానికి సైతం ఇబ్బందులు ఎదుర్కొన్నారు. మోకాళ్ల లో తు వరకు నీరు నిలిచి పోయి అపార్ట్‌మెంట్ల సెల్లార్‌లలోకి నీరు చేరటంతో మోటార్ల సాయంతో వె లికి తీయటం పలు చోట్ల కనపడింది. పలు ప్రాం తాల్లో చెట్ల కొమ్మలు, స్థంభాలు విరిగి నేల కొరి గాయి. వర్షపు నీటి ఉధృతికి మ్యాన్‌హోల్లు తెరచుకొని కాలనీలు, రహదార్ల వెంట సెలయేళ్లలాగా పొంగి ప్రవహించాయి. మున్సిపల్ సిబ్బంది, డిఆర్‌ఎఫ్ సిబ్బందితో పాటు ట్రాఫిక్ సిబ్బంది నిలిచిపోయిన నీటిని తొలగించటంలో ఎక్కడికక్కడ రంగంలోకి దిగి వర్షంలో తడుస్తూ శ్రమ పడ్డారు.

జిల్లాలో కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటు చేసాం : కలెక్టర్ గౌతం

భారీ వర్షాల కారణంగా జిల్లా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, అత్యవసర సేవలకు గాను జిల్లా కలెక్టర్ కార్యాలయంతో పాటు అన్ని మున్సిపల్ కార్యాలయాలు, ఎంపిడిఒ కార్యాలయాల్లో 13 ప్రాంతాల్లో కంట్రోల్ రూంలను ఏర్పాటు చేసి ఒక్కో కంట్రోల్ రూంలో 24 గంటలు అందు బాటులో ఉండే విధంగా సిబ్బందిని నియమించామని జిల్లా కలెక్టర్ గౌతం పేర్కొ న్నారు. ఎక్కడ ఎలాంటి ప్రమాదకర పరిస్థితులు వచ్చిన ఏర్పాటు

చేసిన కంట్రోల్ రూంలోని 9492409781 నంబరును సంప్రదించవచ్చని తెలిపారు. మరో 24 గంటల పాటు భారీ వర్షాలు ఉన్నాయన్న వాతావరణ శాఖ హెచ్చరికల కారణంగా మేడ్చల్ జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రయివేటు విద్యా సంస్థలకుసెలవు ప్రకటించారు. భారీ వర్షాల కారణంగా జిల్లా అప్రమత్తమై రెస్క్యూ ఆపరేషన్లు నిర్వహిస్తున్న కారణంగా సోమవారం నిర్వహి ంచే ప్రజావాణిని రద్దు చేస్తున్నామని కలెక్టర్ తెలి పారు.వర్షాల కారణంగా ఇప్పటి వరకుఎక్కడా ఎలాంటి సంఘటనలు,ప్రాణాపాయాలు చోటు చేసుకోలేదని ఆయన పేర్కొన్నారు. 24గం టల్లో జవహర్‌నగర్ మున్సిపల్ ప్రాంతంలో 55.6 సెంటీ మీటర్లతో అత్యధిక వర్షపాతం నమోదైంది.

కుండపోత వర్షంతో కుత్బుల్లాపూర్ అతలాకుతలం

లోతట్టు ప్రాంతాలు జలమయం విరిగిన చెట్లు, ట్రాఫిక్ జామ్

ప్రజాపక్షం/నిజాంపేట్ : కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలో కుండపోత వర్షంతో ప్రజలు అతలాకుతలమయ్యారు. శనివారం నుండి ఎడతెరపి లేకుండా కురుస్తున్నా భారీ వర్షానికి లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. నియోజకవర్గం పరిధిలోని నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్, కుత్బుల్లాపూర్, గాజులరామారంసర్కిళ్లతో పాటు దుండిగల్, కొంపల్లి మున్సిపాలిటీలలోని పలులోతట్టు ప్రాంతాలు వరద నీటితో రోడ్లన్నీ జలమయమయ్యాయి. ఆదివారం నుండి కుండ పోతగా వర్షం కురుస్తుండడంతో ప్రజలు ఇళ్లకే పరిమితమయ్యాయి. పలు కాలనీలు, బస్తీల్లో వరద నీరు చేరింది. మియా పూర్ నుండి గండిమైసమ్మ వెళ్లే రహదారి లోనిబొరంపేట్ చౌరస్తాలో చెట్లువిరిగి రహదారిపై పడిపోవడంతో ట్రాఫిక్ అంతరాయం కలిగింది. వాహనదారులు కాస్త ఇబ్బందులకు గురయ్యారు. మరో రెండు రోజుల పాటు భారీ వర్షాలు కురుస్తుండడంతో రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే ప్రైవేటు, ప్రభుత్వ పాఠశాలలకు సెలవును ప్రకటించారు. అత్యవసరమైతే తప్ప ప్రజలు బయటికి రాకూడదని సూచిస్తున్నారు. లోతట్టు ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉం డాలని జిల్లా యంత్రాంగం కంట్రోల్ రూమ్, టోల్ ఫ్రీ నెంబర్లను ప్రకటించారు.

మల్కాజిగిరిలో స్థంభించిన జనజీవనం

ప్రజాపక్షం/మల్కాజిగిరి: మల్కాజిగిరి నియోజకవర్గంలో శనివారం ఉదయం నుండి కురుస్తున్న వర్షంతో జనజీవనం స్థంభించి పోయింది. పలు చోట్ల వర్షం కారణంగా రోడ్లపై నీరు నిలిచి పోవటం, చెట్ల కొమ్మలు విరిగి పోవటం, విద్యుత్ స్థంభాలు నేలకొరిగి పోవటంతో వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. నేరేడ్‌మెట్ నుండి తిరుమలగిరి వెళ్లే రహదారిలోని నిత్యం వందల సంఖ్యలో వాహనాలు సంచరించే ఆర్‌కె పురం ఫ్లైఓవర్ బ్రిడ్జి వద్ద విద్యుత్ స్థంభం విరిగి పడటంతో ట్రాఫిక్ రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు తలెత్తాయి. వెంటనే అప్రమత్తమైన రాచకొండ పోలీసులు విద్యుత్ శాఖాధికారులకు సమాచారం అందించి ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా చేసారు.

అధికారులను అప్రమత్తం చేశాం : కలెక్టర్,ఎస్‌పి

ప్రజాపక్షం/వికారాబాద్ప్రతినిధి : వికారాబాద్ జిల్లాలోవిస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి గడిచిన మూడు రోజులుగా వాన పడుతోంది.దీంతో వరి పంటలు వేసిన రైతులకు మేలు చేస్తున్నాయి. శుక్రవారం నుండి అధికార వరకు ముసు వర్షం కురిసింది. జులైలో ఒకసారి భారీ వర్షం వరుణుడు కనుమరుగై పోగ మళ్లీ నెల తర్వాత ఇప్పుడు ఎడతెరపి లేని వాన పండింది. వంకలు పొంగి పోర్లుతున్నాయి. చెరువుల్లోకి నీరు చేరుతోంది. కొడంగల్‌లో 122.6, మి,మీ దౌల్తబాద్ 109.2మిల్లీమీటర్లు,యలాల్ 107.మి.మీ ,బాసీరాబాద్ 106.4 నవబోపేట్‌లో 34.2 తకువ వర్షపతం నామోదు అయినట్లు తెలుస్తుంది. భారీ వర్షలతో వరినాట్లు వేసుకునే సీజన్ కావడంతో రైతుల్లో అనందం వ్యక్తమవుతోంది. ప్రస్తుత వర్షాలతో బోరుబావులు, చెరువల్లోకి మరింత నీరు చేరివరినాట్లు ఉపందుకకోనున్నాయి. జిల్లా వర్షాలు తక్కువగా పడటంతో 50శాతం కూడా నాట్లు వేయలేదు చెరువులో నీరుచేరడంతో సాగు విస్తీర్ణం పెరిగే అవకాశం ఉంది. గత అనుభవాల నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ ప్రతిక్‌జైన్, జిల్లా ఎస్‌పి నారాయణరెడ్డి అధికారులను అదేశించారు. జిల్లాలోని అధికార యంత్రాంగం నిఘాను పటిష్టం చేసింది. వర్షాలు తగ్గే వరకు పోలీస్ ,రెవెన్యూ శాఖలు అప్రమత్తంగా ఉండాలని అదేశించారు. జిల్లాలోని చెరువులు, కుంటలు ప్రాజెక్టుల్లోకి నీరు చేరుతుంది.

వికారాబాద్ తాండూర్, పరిగి, పట్టణాల్లోని లోతట్టు ప్రాంతాలు వర్షపునీరు చిన్నపాటి కుంటలను తలపిస్తున్నాయి. రోడ్లన్నీ బురదమయంగా మారాయి,పరిగి ,వికారాబాద్ ,కొడంగల్ నియో జకరవ్గంలో వగులు వంకలు పొంగి పోర్లుతున్నాయి. పట్టణంలో భరీ వర్షాల నేపథ్యంలో కల్వర్ట్ ద్వారా వరద ఉధృతిని జిల్లా కలెక్టర్ ప్రతీక్‌జైన్, జిల్లా ఎస్‌పి నారాయణరెడ్డి తో కలిసి పరిశీలించారు. ఉదయం కొడంగల్ పట్టణంలో ఆర్ అండ్‌బి మున్సిపల్, ఇరిగేషన్, రెవెన్యూ అధికారులతో రోడ్లపై నీటిని శుభ్ర చేయించారు. కలెక్టర్ మాట్లాడుతూ రానున్న రెండు రోజులు భారీ వర్షాలు కురిసే అవ కాశం ఉందని, వాతవరణ సూచనల మేరకు అధికార యంత్రాగం అప్రమత్తంగా ఉండాలని ,ప్రజలకు ఎలాంటి ఇబ్బంది కలుగకుండా తగిన జగ్రత్తలు తీసుకోవాలని అదేశించారు. కొడంగల్ చెరువులో కలిసి నాలాలను, నమ్మల్ వాగును, పర్సపూర్ వెళ్లే వాగుల వరద ఉధృతిని పరిశీలించారు.

దూలపల్లి సహకార సంఘం
నిధులు గోల్‌మాల్

ప్రజాపక్షం/దుండిగల్: కోట్ల రూపాయల నిధులు గోల్‌మాల్ మేడ్చల్ జిల్లా కుత్బుల్లాపూర్ నియోజకవర్గం కొంపల్లి మున్సిపాలిటీ పరిధిలో జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం దూలపల్లి (ప్యాక్స్)ప్రైమరీ అగ్రికల్చర్ కోఆపరేటివ్ సొసైటీ బ్యాంకులో కోట్ల రూపాయల ప్రజల సొమ్ము, బ్యాంకు నిధులు, లోన్ల రూపంలో నిబంధనలకు విరుద్ధంగా ఇష్టా నుసారంగా ఇచ్చారని, భారీగా అవకతవకలు జరిగాయని ఆడిట్లో మేడ్చల్ జిల్లా సహకార సంఘం అధికా రులు గుర్తించారు. ఈ అవకతవకలపై వివరణ ఇవ్వాలని సొసైటీ చైర్మన్ గరిసె న రేంద్ర రాజుతో పాటు, 12 మంది డైరెక్టర్లకు అధికారులు మేడ్చల్ జిల్లా సహకార సంగం అసిస్టెంట్ రిజిస్టర్ నాగేశ్వర్రావు ఆగస్టు 8వ తేదీన సమన్లు, నోటీసులు ఇచ్చారు. ఆగష్టు 27వ తేదీన వరకు చైర్మన్ తో పాటు డైరెక్టర్లు అవకతవకలపై

వివరణ ఇవ్వాలనీ సమన్లు ఇచ్చి 20 రోజులు దాటినా కాలయాపన చేస్తున్నారు. సొసైటీ నిధులు దాదాపు 50 నుండి 100 కోట్ల టర్న్ ఓవర్ వరకు ఉండడం ఇదే అదునుగా భావించిన కొంత మంది అవినీతి సామ్రాట్లు మొతాదుకు మించి లోన్లు తీసుకుని కట్టకుండా బకాయిలు పడ్డారు. కొంత మంది రైతులు తమకు లోన్ కావాలని దూలపల్లి ప్యాక్స్ సహకార బ్యాంకుకు వెళ్లగా నిధులు లేవని సీఈఓ సమాధానం ఇచ్చారు. దీంతో అసలు విషయం బయట పడింది. బ్యాంకు సొసైటీ చైర్మన్ నిబంధనలకు విరుద్ధంగా కోట్ల రూపాయలు లోన్స్ తన మనుషులకు, భీనామీలకు ఇచ్చారని అవి వసూల్ కావటం లేదని తేలింది.

మేడ్చల్ జిల్లా డిసిఒ వివరణ

దూలపల్లి పాక్స్‌లో జరిగిన లోన్లు గోల్‌మాల్‌పై డిసిఓ వెంకట రెడ్డిని వివరణ కో రగా తాను వచ్చి వారం రోజులు అవు తుందని రాగానే తమ విభాగంలో ఏసీబీ దాడులు జరిగి బిజీగా ఉన్నామని. దూ లపల్లి స్కాంపై విచారణ జరుపుతామని తెలి పారు. సొసైటీ ఆక్ట్ ప్రకారం ఎవరు తప్పు చేసినా లోన్లు పొంది బకాయిలు చెల్లించకుకుండా ఉన్నా వారివద్ద పైసతో సహా వసూలు చేస్తామని. చట్టపరంగా చర్యలు తీసుకుంటామనిడిసిఓ వెంకటరెడ్డి తెలిపారు.

సిపిఎస్ ను రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని కొనసాగించాలి

టిఎన్‌జిఒఎస్ జిల్లా అధ్యక్షులు ఎ.శివకుమార్

ప్రజాపక్షం/వికారాబాద్ ప్రతినిధి: ఉద్యోగుల పాలిట శాపంగా మారిన సిపిఎస్ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని కొన సాగించాలని టిజిఈజిఎస్ చైర్మన్ శివకుమార్ అన్నారు. జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో సిపిఎస్ విమోజన దినోత్సవ సందర్భంగా వివిధ సంఘలకు చెందిన ఉద్యోగ ,ఉపాధ్యాయ, కార్మిక పెన్షనర్లు పెద్ద ఎత్తున నల్ల బాడ్జీలు ధరించి ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సిపిఎస్‌ని రద్దు చేసి ఒపిఎస్‌ని పునరుద్ధరించాలాని ఈ సిపిఎస్ ఉద్యోగులకు పాలిటశాపంగా మారిందన్నారు. ఈ విధానం వల్ల చాలా కుటుంబాలు రోడ్డు పాలు అవుతున్నార న్నారు. ఎవరైన ఉద్యోగి విధినిర్వహణలో మరణించిన వారి కుటుంబానికి రెండు వేలు పెన్షన్ కూడా రావట్లేదు అని, ఉద్యోగి రిటైర్డు అయితే కుటుంబా పోషన భారంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. అందువల్ల సిపిఎస్‌ను రద్దు చేసి పాత పెన్షన్‌ను వెంటనే అమలు చేయాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, స్పీకర్ ప్రసాద్‌కుమార్‌లు చర్యలు తీసుకోవాలని ఈ సందర్భంగా కోరారు. ఎన్నికల మేని ఫెస్టోలో కూడా దీనిని ప్రస్తావించారని గుర్తు చేశారు. ఈ కార్యక్ర మంలో అజ్మత్ పాషా, విజేయందర్ ,నర్సింలు రమేష్ ,హిరలాల్, హజి ,రత్నం , చంద్రశేఖర్ , బాలకృష్ణ, మధుకర్ తదితరులు పాల్గొన్నారు.

కమ్యూనిటీ హాల్‌లో
ప్రభుత్వ ఆసుపత్రి ఇంకెన్నాళ్లు?

ప్రజాపక్షం/అల్వాల్ : అల్వాల్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం అల్వాల్ చుట్టుపక్కల నుంచి కాకుండా రోగులు వందలాదిమంది వస్తుంటారు. అయినా అల్వాల్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం గత సంవత్సరం అంబేద్కర్ భవన్‌లో ప్రజలకు వైద్యం నిర్వహించడం జరుగుతుంది. ఒకపక్క పట్టణ ప్రజలను వైరల్ ఫీవర్ వనికిస్తున్నాయి. అల్వాల్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో నాలుగు డెంగీ కేసులు నమోదయ్యాయి. ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో కనీస సౌకర్యాల కల్పనలో అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారు.ఆస్పత్రిలోతాగునీరు సమస్య తీవ్రంగా ఉంది. మరుగుదొడ్ల నిర్వహణ సక్రమంగా లేక రోగులు సిబ్బంది తీవ్ర ఇబ్బ ందులు పడుతున్నారు.ఒక కోటి 56 లక్షలతో నిర్మించిన అల్వాల్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సి ద్ధంగా ఉన్న నూతన భవనాన్ని ప్రారంభించి ప్రజలకు మెరుగైన వైద్యం అందజే యాలని ప్రజలు కోరుతున్నారు.

విష జ్వరాల పట్ల నివారణ చర్యలు చేపడుతున్నాం

డాక్టర్ యుగేందర్ రెడ్డి

ప్రతి డివిజన్‌లోని ఇంటింటికి తిరుగుతూ జ్వరాల సర్వే నిర్వహిస్తున్నా ము. మలేరియా లక్షణాలున్న వారి నుంచి నమూనాలు సేకరించి పరీక్షలు చేస్తున్నా ం. పాజిటివ్ నమోదై న వారికి చికిత్స అం దిస్తున్నాం. వ్యాధుల పట్ల ప్రజలు తగు జాగ్రత్తలు తీసుకోవాలి ఏ సమస్య ఉన్న వెంటనే వైద్యులను సంప్రదించాలి.

మెరుగైన వైద్యం అందక ఇబ్బందులు

తెలంగాణ ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సురేందర్ రెడ్డి

పేద ప్రజలకు మెరుగైన వైద్యం అందక నానా ఇబ్బందులు పడుతూ అల్వాల్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం శిథిలావస్థలో ఉన్న భవనాన్ని కూల్చివేసి నూతన భవనాన్ని నిర్మించారు. వెంటనే ప్రభుత్వ ఆసుపత్రిగా నిర్మించిన భవనంలోకి వైద్య సేవలు అందించాలని ప్రభుత్వాన్ని కోరుతున్నాము.

క్రీడ

క్రిస్ గేల్ ప్రపంచ రికార్డును నికోలస్ పూరన్ బ్రేక్

వెస్టిండీస్ పవర్ హిట్టర్ నికోలస్ పూరన్ టి20 క్రికెట్‌లో సరికొత్త ప్రపంచ రికార్డు నెలకొల్పాడు. ఒక క్యాలెండర్ ఇయర్‌లో అత్యధిక సిక్స్‌లు కొట్టిన క్రికెటర్‌గా ఘనత సాధించాడు. కరేబియన్ ప్రిమియర్ లీగ్ 2024 (సిపిఎల్)లో ట్రిన్‌బాగో నైట్ రైడర్స్ తరపున ఆడుతున్న పూరన్.. సెయింట్ కిట్స్ నెవిస్ పేట్రియాట్స్‌తో జరిగిన మ్యాచ్‌లో చెలరేగాడు. 43 బంతుల్లోనే 7 ఫోర్లు, 9 సిక్సర్ల సాయంతో 97 పరుగులు చేశాడు. ఈ ఇన్నింగ్స్ విండీస్ బ్యాటింగ్ దిగ్గజం క్రిస్ గేల్ పేరిట ఉన్న ప్రపంచ రికార్డును పూరన్ బద్దలు కొట్టాడు. గేల్ 2015లో 36 టీ20లు ఆడి 135 సిక్సర్లు బాదాడు. పూరన్ ఈ ఏడాది ఇప్పటివరకు 58 మ్యాచ్‌లు ఆడి 139 సిక్స్‌లు కొట్టాడు. పూరన్ విధ్వంసానికితోడు కీసీ కార్టీ (73; 35 బంతుల్లో 9 ఫోర్లు, 3 సిక్స్‌లు) చెలరేగడంతో ట్రిన్‌బాగో నైట్ రైడర్స్ 4 వికెట్ల నష్టానికి 250 పరుగులు చేసింది. లక్ష్యఛేదనలో సెయింట్ కిట్స్ నెవిస్ పేట్రియాట్స్ జట్టు 206/8కి పరిమితమైంది. 2024లో నికోలస్ పూరన్ ఎస్ఏ20లో దర్బన్ సూపర్ జెయింట్స్, ఐపీఎల్‌లో లఖ్‌నవూ సూపర్ జెయింట్స్, మేజర్ లీగ్ క్రికెట్(ఎంఎల్‌సి)లో ఎంఐ న్యూయార్క్ , ఐఎల్‌టీ20లో ఎంఐ ఎమిరేట్స్, ది హండ్రెడ్ లీగ్‌లో నార్తర్న్ సూపర్‌చార్జర్స్, బీపీఎల్ లో రంగ్‌పూర్ రైడర్స్ జట్లకు ఆడాడు. ప్రస్తుతం జరుగుతున్న సీపీఎల్‌లో ట్రిన్‌బాగో టీమ్‌కు ఆడుతున్నాడు.

టీ20ల్లో ఒక క్యాలెండర్ ఇయర్‌లో అత్యధిక సిక్సర్లు

139* – నికోలస్ పూరన్ (2024)
135 – క్రిస్ గేల్ (2015)
121 – క్రిస్ గేల్ (2012)
116 – క్రిస్ గేల్ (2011)
112 – క్రిస్ గేల్ (2016)
101 – క్రిస్ గేల్ (2017)
101 – ఆండ్రీ రస్సెల్ (2019)
100 – క్రిస్ గేల్ (2013)

భద్రతపై భరోసా ఇవ్వాలి

ఛాంపియన్స్ ట్రోఫీ2025 కోసం టీమిండియా.. పాకిస్థాన్‌కు వెళ్లాలంటే భద్రతపై పూర్తి భరోసా ఇవ్వాలని దిగ్గజ స్పిన్నర్ హర్భజన్ సింగ్ అన్నాడు. ఆటగాళ్ల భద్రత చాలా ముఖ్యమని అభిప్రాయపడ్డాడు. 1996 వన్డే ప్రపంచకప్ తర్వాత ఓ ఐసిసి టోర్నీకి పాకిస్థాన్ ఆతిథ్యం ఇవ్వనుండటం ఇదే తొలిసారి. అయితే ఛాంపియన్స్ ట్రోఫీ కోసం తాము పాకిస్థాన్‌కు వెళ్లలేమని, తమ మ్యాచ్‌లను తటస్థ వేదికల్లో నిర్వహించాలని బిసిసిఐ డిమాండ్ చేస్తోంది. మరోవైపు ఐసిసి కూడా ఛాంపియన్స్ ట్రోఫీ బడ్జెట్‌లో అదనపు బడ్జెట్‌ను కేటాయించింది. కానీ పిసిబి మాత్రం పాకిస్థాన్ పర్యటనకు భారత్ రావాలని డిమాండ్ చేస్తోంది.మరోవైపు ఇరు దేశాల మధ్య నెలకొన్న రాజకీయ విభేదాల కారణంగా.. పాకిస్థాన్‌లో పర్యటించేందుకు టీమిండియాకు కేంద్ర ప్రభుత్వ అనుమతివ్వాల్సి ఉంది. షెడ్యూల్ ప్రకారం పాకిస్థాన్ వేదికగా ఫిబ్రవరి మార్చిలో ఛాంపియన్స్ ట్రోఫీ జరగాల్సి ఉంది. ఒకవేళ భారత్ జట్టు పాక్ గడ్డపైకి వెళ్లేందుకు ఇష్టపడకపోతే ట్రోఫీలో టీమిండియా ఆడే మ్యాచ్‌లన్నీ దుబాయ్ లేదా శ్రీలంక లాంటి తటస్థ వేదికల్లో నిర్వహించే అవకాశం ఉంది. 2008 నుంచి భద్రతా కారణాలరీత్యా టీమిండియా పాకిస్థాన్‌లో పర్యటించడం లేదు. తాజాగా ఇదే వాదనతో ఏకీభవించిన హర్భజన్ సింగ్.. ప్లేయర్లకి భద్రత చాలా ముఖ్యమని స్పష్టం చేశాడు.'పాకిస్థాన్ మాజీ ఆటగాళ్లకు వాళ్లు చెప్పేది సరైన వాదనగానే అనిపించవచ్చు. కానీ మనం ఆ టగాళ్ల భద్రత గురించి ఆలోచించాలి. భారత ఆటగాళ్ల భద్రతకు పాకిస్థాన్ భరోసా ఇవ్వకపోతే.. అ క్కడికి వెళ్లాలని నేను కోరుకోవట్లేదు. జట్లకు పూర్తి భద్రత కల్పిస్తామని, ట్రోఫీ సమయంలో ఎలాంటి ఇబ్బంది ఉండదని వారు భరోసా ఇవ్వాల్సిన అవసరం ఉంది. అంతిమంగా క్రికెట్ గురించే కాకుండా చాలా అంశాల గురించి ఆలోచించి భారత ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాల్సి ఉంది. ఒక క్రికెటర్‌గా క్రికెట్ గురించి మాత్రమే నేను చెప్పగలను'అని హర్భజన్ సింగ్ చెప్పుకొచ్చాడు.

ప్రతీ పరుగుకు ఓ కథ ఉంటుంది

ఇంగ్లాండ స్టార్ బ్యాటర్ జో రూట్ ప్రస్తుతం టెస్టుల్లో జోరుమీదున్నాడు. సుదీర్ఘ ఫార్మాట్ క్రికెట్‌లో స్థిరంగా రాణిస్తూ ఇటీవల కాలంలో సెంచరీల మీద సెంచరీలు బాదేస్తున్నాడు. ప్రస్తుతం శ్రీలంకతో జరుగుతున్న టెస్టు సిరీస్‌లో దూసుకుపోతున్నాడు. రెండో మ్యాచ్‌లో రెండు ఇన్నింగ్స్‌ల్లోనూ శతకాలతో సత్తా చాటాడు. ఈ క్రమంలో టెస్టుల్లో అతడి సెంచరీల సంఖ్య 34కు చేరింది. దీంతో టెస్టు క్రికెట్‌లో ఇంగ్లాండ తరపున అత్యధిక సెంచరీలు చేసిన ప్లేయర్‌గా రికార్డు కొట్టాడు. ఇదివరకు ఈ రికార్డు మాజీ ప్లేయర్ ఆలిస్టర్ కుక్ (33) పేరిట ఉండేది. ఈ క్రమంలోనే క్రికెట్ దిగ్గజం సచిన్ తెందూల్కర్ టెస్టు రికార్డులవైపు ఒక్కో అడుగు వేస్తూ ముందుగు కదులుతున్నాడు. దీంతో టెస్టుల్లో సచిన్ రికార్డులు రూట్ బ్రేక్ చేబేక్ ఛాన్స్‌లు ఉన్నాయంటూ పలువురు మాజీలు అభిప్రాయపడుతున్నారు. ఈ నేపథ్యంలో మాజీ ప్లేయర్ అలిస్టర్ తాజాగా కుక్ జో రూట్ ను ఇంటర్వ్యూ చేశాడు. అందులో జో రూట్ పలు ఆసక్తికర విషయాలను షేర్ చేసుకున్నాడు. అవేంటంటే?

'కుక్ కెప్టెన్సీలో మొదటి టెస్టు ఆడడం నా కల'

తాను టెస్టుల్లో అరంగేట్రం అలిస్టర్ కుక్ కెప్టెన్సీలోనే చేశానని జో రూట్ ఇంటర్వ్యూలో తెలిపాడు. అదొక వైల్డ్ రైడ్ అని, కుక్ కెప్టెన్సీలో మొదటి మ్యాచ్ ఆడడం తన కల అని చెప్పుకొచ్చాడు. టీమ్ ఇండియాపై రూట్ సాధించిన 10, 31వ సెంచరీ గురించి కుక్ ప్రస్తావించాడు. రాంచీలో రూట్ ఆడిన ఇన్నింగ్స్ ఎప్పటికీ ప్రత్యేకమైనదని కుక్ వ్యాఖ్యానించాడు. అందుకు బదులుగా రూట్, కేవలం రికార్డుల కోసం తాను ఆడట్లేదని పేర్కొన్నాడు. ప్రతి పరుగుకు ఒక కథ ఉంటుందని చెప్పుకొచ్చాడు. ఇంగ్లాండ టీమ్ ఎప్పుడూ తనకు మద్దతు ఇస్తుందని అన్నాడు.

కుక్ ప్రశ్న: రూట్ మీరు ఇంగ్లాండ కెప్టెన్, బ్యాటర్‌గా డ్యూయల్ రోల్ ఎలా నిర్వహిస్తారు?

రూట్ జవాబు: అవును అది సవాల్‌తో కూడుకున్న విషయమే. అది ఎలా ఉంటుందో మీకు కూడా తెలుసు. కెప్టెన్‌గా ఉన్నప్పుడు ధైర్యంగా ముందుకు సాగాల్సి ఉంటుంది. టీమ్‌కు ధైర్యాన్ని ఇవ్వాలి. బ్యాటర్‌గా, కెప్టెన్‌గా తదుపరి బంతిపై దృష్టి పెట్టాలి.

కుక్ ప్రశ్న: మీ భవిష్యత్తు ప్రణాళికలు ఏంటి?

రూట్ జవాబు: క్రికెట్ అభివృద్ధి చెందుతూనే ఉంటుంది. నేను కూడా అలానే ఉండాలి. భవిష్యత్తులో సాధించడానికి ఇంకా చాలా ఉంది. మీరు మంచి రికార్డులను నెలకొల్పారు. వాటిని అందుకోవడానికి ప్రయత్నిస్తున్నా. తర్వాతి తరాలకు స్ఫూర్తినివ్వాలనుకుంటున్నాను.

రీల్

వాయిదా పడిన 'కంగువా'

కోలీవుడ్ స్టార్ హీరో సూర్య ప్రధాన పాత్రలో, దర్శకుడు శివ దర్శకత్వంలో తెరకెక్కుతున్న కంగువా చిత్రం వాయిదా పడింది. ఈ చిత్రం అక్టోబర్ 10 కి రిలీజ్ కావాల్సిన విషయం అందరికీ తెలిసిందే. ఇదే విషయాన్ని హీరో సూర్య నిన్న జరిగిన ఒక ఈవెంట్ లో వెల్లడించారు. అయితే సూర్య కంగువా చిత్రాన్ని సూపర్ స్టార్ రజినీకాంత్ యొక్క వేట్టైయాన్ తో పాటుగా రిలీజ్ చేయాలని భావించడం లేదు. కంగువా చిత్రం కోసం తాము ఎంతో హార్డ్ వర్క్ చేశామని, అభిమానులు అందరూ కూడా వాయిదా పడటం పట్ల అర్థం చేసుకోవాలని సూర్య కోరారు. త్వరలో కొత్త రిలీజ్ డేట్ ను ప్రకటించనున్నారు మేకర్స్. అయితే సూపర్ స్టార్ రజినీకాంత్ నటిస్తున్న వేట్టైయాన్ చిత్రానికి బెస్ట్ విషెస్ తెలిపారు సూర్య. రజినీకాంత్ ప్రధాన పాత్రలో నటిస్తున్న వేట్టైయాన్ చిత్రానికి టీ.జే. జ్ఞానవేల్ రాజా దర్శకత్వం వహిస్తున్నాడు. అమితాబ్ బచ్చన్, ఫహద్ ఫాసిల్, రానా దగ్గుబాటి, మంజు వారియర్ తదితరులు ఈ చిత్రంలో కీలక పాత్రల్లో కనిపించనున్నారు. రాక్ స్టార్ అనిరుధ్ రవి చందర్ సంగీతం అందిస్తున్న ఈ చిత్రం కోసం అందరూ ఎంతో ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు.

3 రోజుల్లో 52 కోట్లతో 'సరిపోదా శనివారం'

నాచురల్ స్టార్ నాని హీరోగా నటించిన సరిపోదా శనివారం చిత్రం బాక్సాఫీస్ వద్ద భారీ వసూళ్లతో దూసుకు పోతుంది. ఈ చిత్రం కేవలం మూడు రోజుల్లోనే వరల్డ్ వైడ్ గా 52.18 కోట్ల రూపాయలు వసూళ్లు రాబట్టింది. దర్శకుడు వివేక్ ఆత్రేయ దర్శకత్వంలో తెరకెక్కిన ఈ చిత్రంలో ప్రియాంక మోహన్ హీరోయిన్ గా నటించగా, విలక్షణ నటుడు ఎస్ జే సూర్య విలన్ పాత్రలో నటించాడు. ఈ చిత్రానికి వస్తున్న రెస్పాన్స్ పట్ల చిత్ర యూనిట్ సంతోషం వ్యక్తం చేస్తోంది. డీవీవీ ఎంటర్టైన్మెంట్ పతాకంపై డీవీవీ దానయ్య నిర్మించిన ఈ చిత్రానికి జేక్స్ బెజోయ్ సంగీతాన్ని అందించాడు. దసరా, హాయ్ నాన్న చిత్రాల తర్వాత మరోసారి నాని 50 కోట్ల క్లబ్ లో చేరడం పట్ల అభిమానులు సంతోషం వ్యక్తం చేస్తూ, విషెస్ తెలుపుతున్నారు. ఈ చిత్రం లాంగ్ రన్ లో మరింత వసూళ్లను రాబట్టే అవకాశాలు కనిపిస్తున్నాయి.

రిలీజ్ కు ముందే రూ.4 కోట్లతో గబ్బర్ సింగ్

పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ టైటిల్ రోల్ లో, హరీష్ శంకర్ దర్శకత్వంలో తెరకెక్కిన గబ్బర్ సింగ్ చిత్రం థియేటర్లలో రిలీజ్ అయ్యి ప్రేక్షకులను, అభిమానులని బాగా అలరించింది. పవన్ కళ్యాణ్ పుట్టిన రోజు సందర్భంగా మళ్ళీ విడుదల కి రెడ్డి అవుతోంది ఈ చిత్రం. ఈ చిత్రం ప్రీ సేల్స్ తోనే సెన్సేషన్ క్రియేట్ చేస్తుంది. ఇప్పటి వరకూ 4 కోట్ల రూపాయల వసూళ్లను రాబట్టి, రిలీజ్ కు ముందే సెన్సేషన్ క్రియేట్ చేస్తోంది. స్టార్ హీరోయిన్ శృతి హాసన్ హీరోయిన్ గా నటించిన ఈ చిత్రాన్ని బండ్ల గణేష్ నిర్మించాడు. రాక్ స్టార్ దేవి శ్రీ ప్రసాద్ సంగీతం అందించిన ఈ చిత్రం బాలీవుడ్ లో హిట్ మూవీ అయిన దబంగ్ చిత్రానికి రీమేక్. ఈ చిత్రం రీరిలీజ్ ఎలాంటి రెస్పాన్స్ ను సొంతం చేసుకుంటుందో చూడాలి.

విద్యుత్ సిబ్బంది చర్యలు భేష్

ట్విట్టర్‌లో టిజి ఎన్‌పిడిసిఎల్ ట్వీట్

ప్రజాపక్షం / హైదరాబాద్ : తెలంగాణ వ్యాప్తంగా దాదాపు అన్ని జిల్లాల్లో కుండపోత వర్షం కురుస్తోంది. భారీ వర్షాల కారణంగా పలు చోట్ల విద్యుత్ అంతరాయం ఏర్పడింది. ఈ నేపథ్యంలోనే వర్షాన్ని సైతం లెక్క చేయకుండా విద్యుత్ సిబ్బంది విధులు నిర్వహిస్తున్నారు. వర్షంలో కరెంట్ పోల్స్ ఎక్కి విద్యుత్ పునరుద్ధరణ చర్యలు చేపట్టారు. దీనికి సంబంధించిన వీడియోలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. ఈ క్రమంలో టిజి ఎన్‌పిడిసిఎల్ ఒక ఆసక్తికర ట్వీట్ చేసింది. తమ వినియోగదారులకు ఎలాంటి అసౌకర్యం కలగవద్దని, భారీ వర్షాలను సైతం లెక్కచేయకుండా, రాత్రి పగలను లెక్క చేయకుండా, చెరువుల గుండా ఈదుకుంటూ వెళ్లి తమ విధులు నిర్వహిస్తున్న టిజి ఎన్‌పిడిసిఎల్ సిబ్బంది అంకిత భావానికి జోహార్లు అని పేర్కొంది. జనగామ జిల్లా పాలకుర్తి మండలం గూడూరు గ్రామంలో ప్రతికూల వాతావరణంలో పునరుద్ధరణ చర్యలు చేస్తున్న సిబ్బంది.. అంటూ పేర్కొంది.

ఇక స్వస్తి చెప్పాలి

(మొదటి పేజీ తరువాయి)

కేసులు, రోజు రోజుకూ పేరుకుపోతున్న కేసులు మనందరికీ అతిపెద్ద సవాలుగా మారుతున్నాయి'' అని రాష్ట్రపతి తన ప్రసంగంలో ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సమస్యను పరిష్కరించాలంటే కేసుల వాయిదాల సంస్కృతికి చరమ గీతంపాడాలన్నారు. ''ఈ వాయిదాల పర్వం సంస్కృతిలో మార్పు తీసుకువచ్చేందుకు వీలైనరీతిలో అవకాశం ఉన్నంత వరకూ అన్ని ప్రయత్నాలు, తగిన కృషి జరగాల్సిన అవసరం ఉంది'' అన్నారామె. న్యాయాన్ని రక్షించే బాధ్యత దేశంలోని న్యాయమూర్తులపైనే ఉందని ముర్ము అన్నారు. న్యాయస్థానం గదుల తీరుతెన్నుల కారణంగా కక్షిదారులు, బాధితులలో ఒత్తిడిస్థాయి తీవ్రంగా పెరిగిపోతోందని ఇదొక అసాధారణ విషయంగా మారరిందని, న్యాయవాదులంటే వారిలో భయాందోళన పెరిగిందని, ''బ్లాక్ కోట్ సిండ్రోమ్'' వచ్చిందని ఈ విషయంపై అధ్యయనం జరగాల్సిన అవసరం ఉందని అన్నారు. దేశవ్యాప్తంగా ఇటీవలికాలంలో మహిళా జ్యుడీషియల్ ఆఫీసర్ల సంఖ్యలో పెరుగుదల ఏర్పడం ఆహ్వానించదగిన విషయని ఆమె హర్షంప్రకటించారు. ఈ డిస్ట్రిక్ట్ జ్యుడీషియరీ జాతీయ సదస్సు ముగింపు సభలో భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డి.వై.చంద్రచూడ్, కేంద్ర న్యాయశాఖ సహాయమంత్రి (ఇండిపెండెంట్ ఛార్జి) అర్జున్ రామ్ మేఘావాల్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్రపతి సుప్రీంకోర్టు చిహ్నంగా ఒక పతాకాన్ని కూడా లాంఛనంగా విడుదల చేశారు.

భార్యా భర్తలు ఆత్మహత్య

(మొదటి పేజీ తరువాయి)

దంపతులు. వీరికి రిషికాంత్ (11), విహాంత్ (03)లు సంతానం. గాజులరామారం, బాలాజీ లే అవుట్‌లోని ఓ అపార్ట్‌మెంట్‌లో నివాసిస్తున్న వెంకటేష్ ప్రైవేటు ఉద్యోగం చేస్తుంటాడు. ఆర్థిక సమస్యల కారణంగా ఆదివారం ఇద్దరు పిల్లలతో సహా వెంకటేశ్, వర్షిణిలు ఆత్మహత్య చేసుకున్నారు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని క్షుణ్ణంగా పరిశీలించారు. క్లూస్ టీమ్, డాగ్ స్క్వాడ్‌తో తనిఖీలను చేశారు. ఇటీవల ఆన్‌లైన్ బెట్టింగ్‌లో వెంకటేశ్ నష్టపోవడంతో ఆర్థిక సమస్యలు తలెత్తినట్లు తెలుస్తోంది. అయితే పెరిగిన ఆర్థిక సమస్యలు తాళలేక వెంకటేశ్ దంపతులు పిల్లలను చంపి ఆత్మహత్య చేసుకున్నారని పోలీసులు భావిస్తున్నారు. ఈ మేరకు పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మార్చురీకి తరలించి కేసునమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

విజయవాడ-హైదరాబాద్ మధ్య ఆర్‌టిసి బస్సులు దారి మళ్లింపు

ప్రజాపక్షం / హైదరాబాద్ : ఉత్తర బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం ప్రభావంతో తెలుగు రాష్ట్రాల్లో గత రెండు రోజులుగా కుండపోతగా వానలు కురుస్తున్నాయి. వాగులు, వంకలు పొంగిపొర్లుతుండడం ఒకటైతే రోడ్లపైకి నీరు చేరుతుండడం మరో కారణం అవుతోంది. ఈ క్రమంలో వాగుల ఒడ్డున ఉన్న గ్రామాల మధ్య రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. విజయవాడహైదరాబాద్ హైవేపై ఐతవరం వద్ద వరద నీరు భారీగా ప్రవహిస్తున్న క్రమంలో విజయవాడ నుంచి గుంటూరు, పిడుగురాళ్ల మీదుగా హైదరాబాద్‌కు బస్సులు దారి మళ్లించారు. వర్షాలు ఎన్నిరోజులు కురిస్తే అన్ని రోజులూ విజయవాడహైదరాబాద్ మధ్య తిరిగే ఆర్టీసీ బస్సులను దారి మళ్లిస్తామని అధికారులు చెబుతున్నారు.

30 రైళ్లు రద్దు .. 25 రైళ్లు దారి మళ్లింపు

కాగా టిజి ఆర్‌టిసి తరహాలోనే దక్షిణ మధ్య రైల్వే కూడా కీలక నిర్ణయం తీసుకుంది. ఇప్పటి వరకు సుమారు 30 రైళ్లు రద్దు కాగా 25 రైళ్లను దారి మళ్లించినట్లు రైల్వే అధికారులు తెలిపారు. ఇప్పటికే తెలంగాణలోని వరంగల్ జిల్లా కాజీపేట సమీపంలో రైల్వే ట్రాక్ దెబ్బతినడంతో రైళ్ల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. దీంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ క్రమంలోనే హైదరాబాద్ విజయవాడ మధ్య నడిచే పలు రైళ్లను దక్షిణ మధ్య రైల్వే రద్దు చేయడం గమనార్హం. విజయవాడ సికింద్రాబాద్, గుంటూరు సికింద్రాబాద్ మధ్య నడిచే పలు రైళ్లు కూడా రద్దయ్యాయి. కొన్ని రైళ్లను విజయవాడ, గుంటూరు, నల్గొండ, పగిడిపల్లి మీదుగా దారి మళ్లించామని రైల్వే అధికారులు చెప్పారు. రద్దయిన, దారిమళ్లించిన రైళ్ల వివరాలను దక్షిణ మధ్య రైల్వేశాఖ వెబ్‌సైట్‌లో పొందుపరిచామని పేర్కొన్నారు. ప్రయాణికుల సహాయం కోసం రైల్వేస్టేషన్లలో హెల్ప్‌లైన్లు నంబర్లు ఏర్పాటు చేశామని అధికారులు వివరించారు. అటు ఎపిలోని విజయవాడ రైల్వే స్టేషన్‌లో ప్రయాణికుల ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. హైదరాబాద్‌కు వెళ్లే రైళ్ల రద్దుతో ప్రయాణికులు అవస్థలు పడుతున్నారు. గంటల తరబడి స్టేషన్లో వేచి చూడాల్సి వస్తోందని వారు అసహనం వ్యక్తం చేశారు. నల్గొండ మీదుగా హైదరాబాద్ వెళ్లేలా ప్రత్యేక రైళ్లు నడపాలని డిమాండ్ చేస్తున్నారు. మరోవైపు ఖమ్మం జిల్లా చింతకాని మండలం గాంధీనగర్ వద్ద విశాఖకాచిగూడ ఎక్స్‌ప్రెస్‌ను రైల్వే అధికారులు నిలిపివేశారు. శనివారం అర్ధరాత్రి 2:30 గంటల నుంచి అర్ధాంతరంగా రైళ్లను నిలిపి వేయడంతో ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారు. మరోవైపు సిర్పూర్ కాగజ్ నగర్, బీదర్, సికింద్రాబాద్ మణుగూరు ఫాస్ట్ ప్యాసింజర్‌లను రద్దుచేశారు. షాలిమార్‌హైదరాబాద్, మధురైజబల్పూర్, బెంగళూరుదన్పూర్, మధురైనిజాముద్దీన్, ఎర్నాకులంపాట్నా, సికింద్రాబాద్‌గూడూరు, లక్నోయశ్వంతపూర్, విశాఖపట్నం, హైదరాబాద్ – నరసాపూర్ వెళ్లే రైళ్లను దారి మళ్లించారు.

విజయవాడలో ట్రాప్‌పైకి నీరు...

విజయవాడ రాయనపాడు రైల్వే స్టేషన్ వద్ద ట్రాక్ పైకి వరద నీరు వచ్చి చేరుతోంది. దీంతో అధికారులు హైదరాబాద్ నుంచి విశాఖ వెళ్లే గోదావరి ఎక్స్‌ప్రెస్, హైదరాబాద్ నుంచి చెన్నై వెళ్లే చార్మినార్ ఎక్స్‌ప్రెస్ రైళ్లను నిలిపివేశారు. రైళ్ల నిలిపివేత నేపథ్యంలో సుమారు 50 బస్సుల్లో ప్రయాణికులను తరలిస్తున్నారు. వారిని విజయవాడ స్టేషన్‌కు తరలించి అక్కడి నుంచి విశాఖ, చెన్నైకి ప్రత్యేక రైళ్లలో పంపనున్నట్లు అధికారులు వెల్లడించారు.

4న కోదండరామ్‌కు పౌర సన్మానం: టిజెఎస్

ప్రజాపక్షం/హైదరాబాద్: టిజెఎస్ అధ్యక్షుడు, ఎంఎల్‌సి ప్రొఫెసర్ ఎం.కోదండరామ్‌కు టిజెఎస్ గ్రేటర్ హైదరాబాద్ కమిటీ ఆధ్వర్యంలో ఈనెల 4న చిక్కడపల్లి త్యాగరాయగాన సభలో 'ఆత్మీయ పౌర' సన్మానం నిర్వహించనున్నట్టు టిజెఎస్ నాయకులు తెలిపారు. సన్మాన కార్యక్రమానికి సంబంధించిన వాల్‌పోస్టర్‌ను హైదరాబాద్‌లోని టిజెఎస్ రాష్ట్ర కార్యాలయంలో ఆవిష్కరించారు. టిజెఎస్ గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షుడు ఎం.నర్సయ్యగౌడ్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు బద్రుద్దీన్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు ధర్మార్జున్, టైరి రమేష్, పల్లె వినయ్‌కుమార్, నాయకులు మారం లక్ష్మారెడ్డి, కొత్తరవి, హనుమంత్ రెడ్డి, బట్టల రామచందర్, జశ్వంత్ కుమార్, రాజు,మానేపల్లి లక్ష్మణ్, పునిరెడ్డి జైపాల్ రెడ్డి, సురేష్ కుమార్, మెరుగు శ్రీనివాస్ యాదవ్ , పుష్పలత తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అణగారిన వర్గాలతో పాటు అనేక రంగాకు చెందిన సమస్య పరిష్కారానికి కోదండరామ్ అనేక పోరాటాలు చేశారన్నారు. తెలంగాణ ఉద్యమంలో అగ్రభాగాన నిలబడ్డారని, రాష్ట్రం ఏర్పడిన తర్వాత కూడా ప్రజా సమస్యలు, ఉద్యమకారుల ఆకాంక్షల అమలుకు పోరాటం చేశారన్నారు.

ఆగని అత్యాచారాలు

(మొదటి పేజీ తరువాయి)

నార్త్ 24పరగణాల జిల్లా మధ్యంగ్రామ్‌లోని నిందితుడి ఇంటి ముందునిరసన చేపట్టారు. ఆగ్రహించిన ఆందోళనాకారులు ఆగ్రహంతో ఊగిపోతూ నిందితుడి ఇంటిని, అతడి బంధువుల ఇంటిని కూడా ధ్వంసం చేశారు. గ్రామపంచయతీ సభ్యురాలి భర్త అయిన టిఎంసి నాయకుడు ఒకరు ఆందోళనకారుల వద్దకు వచ్చి ఈ విషయం మాట్లాడి పరిష్కరించుకుందాం అనడంతో ఆందోళకారులు అతడి ఇంటిపై దాడికిపాల్పడ్డారు. సమాచారం అందుకున్న పోలీసులు, ర్యాపిడ్ యాక్షన్ ఫోర్స్ (ఆర్‌పిఎఫ్) బలగాలు తరలివచ్చి అక్కడే మోహరించాయి. ఈ నిరసన సిపిఐ(ఎం) కార్యకర్తల ఆధ్వర్యంలో జరిగిందని బాధిత టిఎంసి నాయకుడు ఆరోపించారు. ఇదిలా ఉంటే హౌరాలోని సదర్ హాస్పిటల్‌కు శనివారం రాత్రి 13సంవత్సరాల మైనర్ బాలిక న్యూమోనియా చికిత్స కోసం వచ్చింది. సిటి స్కాన్ కోసం వెళ్లగా అక్కడ కాంట్రాక్ట్ లేబరోటరీ టెక్నీషియన్‌గా పనిచేస్తున్న వ్యక్తి ఆమెపట్ల అనుచితంగా ప్రవర్తించాడు. దీంతో భయపడి ఏడుస్తూ బయటకు పరుగెత్తుకు వచ్చి అక్కడే ఉన్న మరోరోగి బంధువుకు విషయం తెలియజేసింది. కాగా నిందితుడిని అమన్‌రాజుగా గుర్తించారు. ఈలోగా అక్కడికి వచ్చిన కుటుంబసభ్యులకు మైనర్ బాలిక తనపట్ల లేబరేటరీ టెక్నీషియన్ ప్రవర్తించిన తీరును వివరించింది. వెంటనే వారు హాస్పిటల్ వైద్యాధికారుల దృష్టికి తీసుకెళ్లారు. వైద్యాధికారులు పోలీసులకు సమాచారం అందించారు. ఈ వార్త త్వరగా అంతటికీ వ్యాపించడంతో స్థానికులు, బాధితురాలి కుటుంబ సభ్యులు, బంధువులు హాస్పిటల్‌కు తరలి వచ్చారు. భారీసంఖ్యలో గుమిగూడి హాస్పిటల్ వద్ద నిరసన చేపట్టారు. నిందితుడిపై దాడికి యత్నించారు. ఈలోగా ఆసుపత్రికి వచ్చిన పోలీసులు నిందితుడిపై దాడి జరగకుండా కాపాడారు. బాధిత కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు నిందితుడు అమన్‌రాజును అరెస్ట్ చేశారు. కాగా ఈఘటనలు రాత్రివేళ హాస్పిటల్‌లో భద్రతను పెంచాల్సిన అవసరాన్ని చెప్పకనే చెబుతున్నాయి.

ఫరూఖాబాద్‌లో మైనర్ బాలికపై అత్యాచారం

ఉత్తర్‌ప్రదేశ్ రాష్ట్రంలోని ఫరూఖాబాద్‌లో 13సంవత్సరాల మైనర్ బాలికపై ప్రభుత్వ పాఠశాలకు చెందిన ప్యూన్ అత్యాచారం చేశాడు. ఐదు నెలల తర్వాత ఈ ఘటన వెలుగుచూసింది. కూతురు గర్భవతి అని గ్రహించిన బాధితురాలి తల్లిదండ్రులు ఈ విషయమై స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో విచారణ జరిపిన పోలీసులు నిందితుడైన ప్రభుత్వ పాఠశాల ప్యూన్‌ను, అతడికి సహాయపడిన మరొక వ్యక్తిపై పోస్కో చట్టం కింద కేసు నమోదు చేశారు. అయితే నిందితులు బాలిక నోట్లో గుడ్డ కుక్కి అత్యాచారం చేశారని, అనంతరం ఈ విషయాన్ని ఎవరికైనా చెబితే చంపేస్తామని బెదిరించినట్లు పోలీసుల విచారణలో వెల్లడైంది. అయితే కాయంగంజ్ కొత్వాలీ ఇంఛార్జి ఇన్‌స్పెక్టర్ రామ్ అవ్‌తామాట్లాడుతూ బాలికకు వైద్యపరీక్షలు చేయించామని. ఈ కేసులో ఇప్పటి వరకూ ఎవరూ అరెస్ట్ కాలేదని, త్వరలోనే వారిని అరెస్ట్ చేస్తామని తెలియజేశారు.

రూ.2వేల కోట్లు పరిహారం

(మొదటి పేజీ తరువాయి)

కమిటీల నివేదికల్లో చేసిన సిఫార్సులు ఆచరణాత్మకం కాదని ఆయన కొట్టిపారేశారు. సాంఘికంగా బాధితులకు న్యాయం చేసేందుకు, భౌతిక వాస్తవాలను దృష్టిలో పెట్టుకుని వాటిని పరిగణనలోకి తీసుకోలేదని ఆయన అన్నారు. వేయనాడ్‌లో ఈ ఏడాది జులై 30వ తేదీన కొండచరియలు విరిగిపడిన ఘటనలపై ఈ వారాంతంలో పిటిఐ వార్తాసంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన మాట్లాడుతూ